

సంగీత మేరు శిఖరాలు
రూ॥120/-
పేజీలు:138
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


సిఐబిని తక్షణం రద్దు చేయాలి
ఎఐటియుసి డిమాండ్

శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు
10


సంపుటి 09, సంచిక: 282 | శుక్రవారం | 11 -09-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## బిజెపికి దొడ్డి దారిన భారీ నిధులు?

- గుజరాత్‌లో ఆరు చిన్న పార్టీలకు రూ.1,700 కోట్ల విరాళాలు అందడంపై అనుమానాలు
- నిధుల మూలం, వినియోగంపై సిబిఐ, కాగ్‌తో దర్యాప్తు చేయాలి
- సిపిఐ డిమాండ్



**న్యూఢిల్లీ:** గుజరాత్‌లో నమోదై ఉన్నప్పటికీ గుర్తింపు పొందని ఆరు రాజకీయ పార్టీలకు 2023–24లో ఏకంగా రూ.1,700 కోట్ల మేర విరాళాలు అందడంపై సిపిఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పెద్ద మొత్తంలో విరాళాలు అందుకున్న ఈ పార్టీలకు ఎలాంటి రాజకీయ కార్యకలాపాలు కనిపించకపోవడం, ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో పోటీ చేయకపోవడం, కొన్ని పార్టీలు ఎన్నికల సంఘానికి సరైన ఆడిట్, ఆర్థిక నివేదికలను సమర్పించకపోవడం అనేక సందేహాలు లేవనెత్తుతోందని సిపిఐ పేర్కొంది. ఈ మేరకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరు పార్టీలకు అందిన విరాళాల వివరాలను అందులో వెల్లడించారు. ఈ విరాళాల పరిమాణం, వాటి తరువాయి 8లో




## పంచాయతీ ఆదాయం ఇక...
# సొంత బ్యాంకు ఖాతాల్లో

‘తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం – 2018’ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

- శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టిన పంచాయతీ రాజ్ శాఖ మంత్రి
- గ్రామాల అభివృద్ధికి అడ్డుగా ఉన్న ఆటంకాలను తొలగిస్తున్నాం
- స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సీతక్క వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామ పంచాయతీ స్వయంగా సమకూర్చుకునే నిధులను, వివిధ పథకాల కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందే నిధులను గ్రామపంచాయతీలు తమ సమీపంలోని జాతీయ, సహకార బ్యాంకులు, పోస్టాఫీస్‌ల్లో జమ చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం –2018 సవరణ బిల్లును గురువారం శాసనసభ, శాసనమండలి ఉభయ సభలు ఆమోదించాయి. శాసనసభలో ఈ బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనుసూయ సీతక్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, పట్టణాల వైపు ప్రజలు వలస వెళ్తున్నప్పటికీ సొంతూరుతో ఉన్న అనుబంధం ఎప్పటికీ చెరిగిపోనిదన్నారు. తల్లి ప్రేమ ఎంత గొప్పదో, పల్లెతో ప్రజలకు ఉండే ప్రేమ, అభిమానం, అక్కడి వాతావరణం కూడా అంతే ప్రత్యేకమని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి అడ్డుగా ఉన్న చట్టపరమైన, పరిపాలనా ఆటంకాలను తొలగిస్తూ స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేయడం ద్వారా నిజంగానే గ్రామాలను దేశానికి పట్టుగొమ్మలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. గ్రామాల్లో మౌలిక వసతులు, ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి పల్లెలను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలన్న ధ్యేయంగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం –2018లోని 70వ నిబంధనలోని ఉప నిబంధన 3కు సవరణ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాలు త్వరితగతిన అభివృద్ధి తరువాయి 8లో

# దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతు



ఎక్కడో ప్రమాదం పొంచి ఉంది : కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలి

- సర్ పేరుతో జాబితా నుంచి ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది
- ఎమ్మెల్యేగా రెండో సారి గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణను సీరియస్‌గా తీసుకోవాలి
- వెయ్యిరోజుల ప్రజాపాలనను అసెంబ్లీలో వివరించేందుకు సభను ఏర్పాటు చేసాం
- కార్యకలాపాలు సజావుగా సాగకుండా బిఆర్‌ఎస్ కుట్ర చేసింది
- సిఎల్‌పి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

> కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయంగా ఎదిగి, ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగే వారా?. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచింది. జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. తెలంగాణ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది.
> – సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేల్చారని, అయితే ఓటర్ల జాబితాలో మాత్రం 88 కోట్ల మంది మాత్రమే ఉన్నట్లు చూపిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సుమారు 15 కోట్ల ఓట్లు గల్లంతైనట్లు తెలుస్తుందని, ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉందని, దీని పట్ల అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో ఓటర్ల జాబితా నుంచి ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని, ఎమ్మెల్యేగా రెండోసారి గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకోవాలన్నారు. అర్హులైన వారి ఓట్లు తొలగిపోకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఓటు హక్కును కాపాడే బాధ్యతను ప్రతి నాయకుడు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఎమ్మెల్యే వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన కూడా భవిష్యత్ ఎన్నికల్లో గెలుపోటములపై ప్రభావం చూపుతుందని సిఎం హెచ్చరించారు. కాంగ్రెస్ శాసనసభా పక్షం (సిఎల్‌పి) సమావేశం గురువారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో జరిగింది. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ ప్రసంగించారు. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్‌ఎస్ ఫామ్ హౌస్‌లో కెసిఆర్ అధ్యక్షతన సమావేశమై తరువాయి 8లో





## బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్

- చైనా అధ్యక్షుడి భారత్ పర్యటన ఖరారు
- న్యూఢిల్లీలో రేపటి నుండి బ్రిక్స్ సదస్సు

**బీజింగ్:** చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు న్యూఢిల్లీ వస్తున్నారు. చైనా విదేశీమంత్రిత్వశాఖ గురువారం అధికారికంగా ఈ విషయాన్ని ధృవీకరించింది. సెప్టెంబరు 12–13 తేదీలలో న్యూఢిల్లీలో భారత్ ఆతిథ్యం ఇస్తున్న 18వ బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ హాజరవుతున్నారని తెలియజేసింది. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత చైనా అధ్యక్షుడు మళ్ళీ భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు జిన్‌పింగ్ బ్రిక్స్ సదస్సుకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా మోదీ–జిన్‌పింగ్ మధ్య సమావేశం జరుగుతుందని అధికార వర్గాలు తెలియజేశాయి. ఆసియాలో రెండు అగ్రదేశాలమధ్యా ద్వైపాక్షిక సంబంధాలను స్థిరీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలలో భాగంగా ఈ రెండు రోజుల్లో కార్యకలాపాలు వేగం పుంజుకోనున్నాయి.ఉన్నతస్థాయిలో దౌత్యకార్యకలాపాల ప్రక్రియలో ఎదురవుతున్న చిక్కులను పరిష్కరించుకుందుకు నాయకులిద్దరి సమావేశం దోహదం చేస్తుందని ఆశాభావంతో ఉన్నారు.ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులు తీవ్ర తరువాయి 8లో

## ఆర్‌టిసిని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలి

- శాసన సభలో సిపిఐ శాసన సభా పక్ష నేత కూనంనేని
- సొంత ప్రయోజనాల కోసం గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మిక సంఘాలను రద్దు చేసిందని విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రభుత్వంలో ఆర్‌టిసి విలీన ప్రక్రియను కూడా త్వరగా చేపట్టాలని సిపిఐశాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా బస్టాండ్లను ప్రయాణికుల ప్రాంగణాలుగా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, ఆ దిశగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. శాసనసభలో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్‌టిసి సమస్యలను కూనంనేని సాంబశివరావు ప్రస్తావించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కార్మిక సంఘాలను రద్దు చేసిందని విమర్శించారు. కార్మిక సంఘాలు లేకపోవడంతో కార్మికులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలే తెలువని పరిస్థితి నెలకొన్నది. స్వేచ్ఛ కూడా లేకుండా చేశారని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ హాయంలో కార్మికులు చేపట్టిన సమ్మెలో 8 మంది మరణించారని, ఖమ్మంలో శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అయినప్పటికీ గత ప్రభుత్వం కార్మిక సంఘాలను పునరుద్ధరించకుండా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆర్‌టిసి సమస్యలను తాము సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామని, తద్వారా మంత్రి పొన్నం చొరవ తీసుకున్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కార్మికులు సమ్మె చేపడితే, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించిందన్నారు. కార్మిక సంఘాల పునరుద్ధరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల కూనంనేని హర్షం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తరువాయి 8లో

## ఆర్‌టిసిలో త్వరలో కార్మిక సంఘాల ఎన్నికలు

- అనంతరం విలీన ప్రక్రియ పూర్తి చేస్తాం
- శాసనసభలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



దేశంలో పేద ప్రజలకు రైల్వేలు ఎలాంటి సేవలు అందిస్తున్నాయో,అదే తరహాలో టిజిఎస్‌ఆర్‌టిసి తెలంగాణ ప్రయాణికులకు సేవలనందిస్తూ, ప్రాణవాయువులా నిలుస్తోందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. త్వరలోనే కార్మిక సంఘాల ఎన్నికలను నిర్వహిస్తామని, ఆ తర్వాత అధికారుల కమిటీలో గుర్తింపు సంఘం ప్రతినిధులకు అవకాశం కల్పించి, ఇతర రాష్ట్రాల తరహాలో ఎటువంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా ఆర్‌టిసి విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆర్‌టిసి బస్సులలో సిసిటివి కెమెరాల ఏర్పాటు, ప్రయాణికుల వసతులు, కార్మికుల సంక్షేమం అంశాలపైన సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు, కాంగ్రెస్ సభ్యులు కె.శంకర్, చిక్కుడు వంశీ కృష్ణ, కూచుకుల్ల రాజేష్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, అనిరుద్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, దానం నాగేందర్,బిజెపి సభ్యులు పాల్వాయి హరీశ్ బాబు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిచ్చారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆర్‌టిసిని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని, ఆ సంస్థను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కొత్త బస్సులు కొనుగోలు చేయకపోవడం, రిటైర్డ్ అధికారిని ఎండిగా నియమించి నిర్వహణను బలహీనపర్చడంతోనే ఆర్‌టిసి సంస్థ నష్టాల్లోకి కూరుకుపోయిందని, కార్మికుల సమస్యలను కూడా గత పాలకులు పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ తరువాయి 8లో

## ‘ఫీ’ రీయింబర్స్‌మెంట్ కోసం స్వరాష్ట్రంలోనూ ఆందోళనలు

- ఇలాంటి పరిస్థితులు రావడం బాధాకరం
- శాసనమండలిలో సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆవేదన
- సర్టిఫికేట్లు ఇవ్వని కాలేజీలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్
- ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరత తీర్చాలని విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్



ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సర్టిఫికేట్లు ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కాలేజీలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న), నెల్లికంటి సత్యం ‘ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల’పై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు కళాశాలల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని, చదువు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి వారి విద్య, ఉపాధికి ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు రీయింబర్స్‌మెంట్ తరువాయి 8లో




## సోషల్ మీడియా వినియోగించే పిల్లల భద్రతకు రక్షణ వ్యవస్థ అవసరం

- సుప్రీంకోర్టు అభిప్రాయం

**న్యూఢిల్లీ :** సోషల్ మీడియా, ఇతర డిజిటల్ వేదికలను వినియోగించే పిల్లల భద్రతకు మరింత పటిష్ఠమైన రక్షణ వ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. 18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు నేరుగా ఒప్పందాలు చేసుకోకుండా తగిన నియంత్రణలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై అత్యున్నత తరువాయి 12లో

## పెరుగుతున్న చెడు సంస్కృతితో చెడిపోతున్న యువత

- క్రిమినల్ నేరాలకు పాల్పడే వారిని ఎక్కువగా ప్రచారం చేయకుండా మీడియా సంయమనం పాటించాలి
- రాజకీయాల్లో సంస్కారం నైతిక విలువలు లోపిస్తున్నాయి
- ఎఐవైఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభల ముగింపు సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం యాదాద్రి

రాజకీయాల్లో పద్ధతులు, సంప్రదాయాలు, నైతిక విలువలు రోజురోజుకూ దిగజారిపోతున్నాయని, బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు సమాజానికి ఆదర్శంగా నిలవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. బూతులు మాట్లాడేవారిని, క్రిమినల్ నేరాలకు పాల్పడేవారిని మీడియా ఎక్కువగా ప్రచారం చేయడం వల్ల సమాజంలో చెడు సంస్కృతి పెరిగిపోతోందని, దీనివల్ల పిల్లలు, యువత చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా కూడా కొంత సంయమనం పాటించాలని సూచించారు. యాదగిరిగుట్టలో జరిగిన ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభల ముగింపు కార్యక్రమానికి గురువారం హాజరయ్యారు ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి తరువాయి 12లో




## నేటి నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

- నేడు హైదరాబాద్‌లో భారీ రెడ్‌షర్ట్ వలంటీర్ల ప్రదర్శన
- సిపిఐ రాష్ట్ర సమితి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్



నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి, భారత దేశంలో విలీనమే లక్ష్యంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17వ వరకు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సమితి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ప్రకటించాయి. వారోత్సవాలలో భాగంగా శుక్రవారం సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో హైదరాబాద్‌లో భారీ రెడ్‌షర్ట్ వలంటీర్ల ప్రదర్శన నిర్వహించనున్నారు. ఉదయం 11.30 గంటలకు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చిన సిపిఐ అగ్రనేతలలో ఒకరైన మఖ్దూం మోహియుద్దీన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ తెలిపారు. అనంతరం అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు రెడ్‌షర్టు వలంటీర్ల కవాతు ఉంటుందని వెల్లడించారు. ఈ ప్రదర్శనలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, తరువాయి 12లో

# భరోసా లేని ప్రైవేటు ఉపాధ్యాయుడి భవిష్యత్తు

భారతదేశం విద్యారంగంలో వేగంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు విస్తరిస్తున్నాయి. విద్య ఒక ప్రజాసేవ మాత్రమే కాకుండా భారీ ఆర్థిక రంగంగా కూడా మారింది. కోట్లాది కుటుంబాలు తమ పిల్లల చదువుకోసం భారీ మొత్తాలు ఖర్చు చేస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యతోపాటు విద్యాసంస్థల సంఖ్య కూడా పెరుగుతోంది. విద్యా మార్కెట్ విస్తరిస్తోంది. కానీ ఈ విస్తరణకు వెన్నెముకగా నిలుస్తున్న ఉపాధ్యాయుడి ఉద్యోగం, ప్రత్యేకించి ప్రైవేటు టీచర్ల ఉద్యోగ భద్రత మాత్రం చాలాచోట్ల ఇంకా అస్థిరంగానే ఉంది.

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుల సంక్షేమం, సామాజిక భద్రత, పదవీ విరమణ అనంతర రక్షణ కోసం దేశవ్యాప్తంగా సమగ్ర జాతీయ విధానం, చట్టబద్ధ వ్యవస్థ రూపొందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం విచారణకు స్వీకరించడం కీలకమైన పరిణామం. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. పిటిషన్‌ను నాలుగు వారాల తర్వాత విచారణకు తీసుకోనుంది. ఇది తీర్పు కాదు. ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయులందరికీ వెంటనే పెన్షన్ ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించిన సందర్భం కూడా కాదు. అయితే న్యాయస్థానం దేశవ్యాప్త సమస్యగా ఈ అంశంపై కేంద్రం, రాష్ట్రాల నుంచి సమాధానాలు కోరడం మాత్రం ఒక ముఖ్యమైన రాజ్యాంగపరమైన అడుగు. ఇంతకాలం రాష్ట్రాలవారీగా, సంస్థలవారీగా, ఉద్యోగ ఒప్పందాలవారీగా విడిపోయిన సమస్య ఇప్పుడు జాతీయ స్థాయి చర్చలోకి వస్తోంది. ఈ సమస్య పరిమాణాన్ని అర్థం చేసుకోవడానికి విద్యా వ్యవస్థ గణాంకాలే చాలు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం భారతదేశంలో 14.72 లక్షల పాఠశాలలు, సుమారు 98 లక్షల మంది ఉపాధ్యాయులు, 24.8 కోట్ల మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం పాఠశాలల్లో ప్రభుత్వ పాఠశాలలు సుమారు 69 శాతం ఉండగా, ప్రైవేటు పాఠశాలల వాటా 22.5 శాతం. అయితే ప్రైవేటు పాఠశాలలు 32.6 శాతం మంది విద్యార్థులకు విద్య అందిస్తూ, మొత్తం ఉపాధ్యాయుల్లో సుమారు 38 శాతం మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అంటే ప్రైవేటు విద్యా రంగాన్ని విద్యా వ్యవస్థకు వెలుపల ఉన్న చిన్న భాగంగా చూడటం వాస్తవాన్ని తప్పుగా అర్థం చేసుకోవడమే. పిటిషన్‌లో పేర్కొన్న లెక్కల ప్రకారం గుర్తింపు పొందిన ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లోనే 37,30,047 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఉన్న ఉపాధ్యాయులకు దేశవ్యాప్తంగా ఒకే విధమైన సంక్షేమ వ్యవస్థ లేకపోవడం తీవ్రమైన విధాన లోపం. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు, ప్రైవేటు పాఠశాలలో అదే అర్హతతో అదే వయస్సు పిల్లలకు అదే సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయుడు మధ్య అంతులేని వ్యత్యాసం. ఇద్దరి పనికి సామాజిక విలువలో తేడా లేదు. కానీ వారి ఉద్యోగ భద్రత, వేతనం, సెలవులు, పదోన్నతి, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ, వైద్య సదుపాయాలు, పదవీ విరమణ ప్రయోజనాల్లో మాత్రం విపరీతమైన తేడాలున్నాయి. ఇది కేవలం ఉద్యోగ సంబంధిత అసమానత కాదు... విద్యా నాణ్యతను కూడా ప్రభావితం చేసే సమస్య. తెల్లవారితే ఉద్యోగం ఉంటుందో లేదో తెలియని ఉపాధ్యాయుడి నుంచి దీర్ఘకాలిక నిబద్ధతను ఎలా ఆశించగలం?

ఒక విద్యార్థి వ్యక్తిత్వాన్ని, మేధో సామర్థ్యాన్ని, ఆలోచనా విధానాన్ని తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడే తన జీవన భద్రత గురించి ప్రతిరోజూ ఆందోళన చెందాల్సి వస్తే బోధనలో స్థిరత్వం ఎలా వస్తుంది? ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్య హక్కులను ఎవరూ ప్రశ్నించాల్సిన అవసరం లేదు. ఒక విద్యాసంస్థను నిర్వహించడానికి ఆర్థిక స్వాతంత్ర్యం, పరిపాలనా స్వేచ్ఛ అవసరం. కానీ ఆ స్వేచ్ఛకు ఒక హద్దు ఉంటుంది. విద్యాసంస్థను నిర్వహించే హక్కు, అక్కడ పనిచేసే మనుషుల ప్రాథమిక హక్కులను హరించే అధికారం కాదు. దేశంలో ప్రైవేటు విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తాయి. ఆ ఫీజులతో సంస్థలు భవనా లు నిర్మిస్తాయి, సాంకేతిక వసతులు ఏర్పాటు చేస్తాయి, విస్తరణ చేపడతాయి. అదే సమయంలో ఆ సంస్థలను నడిపించే ఉపాధ్యాయుల వేతనాలు, ఉద్యోగ భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కూడా సంస్థ బాధ్యతలో భాగం కావాలి. విద్యా సంస్థ లాభదాయకమైన వ్యాపార నమూనాగా పనిచేస్తే, అందులో పనిచేసే మనుషుల హక్కులను కూడా వ్యాపార వ్యయంగా పరిగణించి తగ్గించడం సమర్థనీయం కాదు. రాజ్యాంగంలోని 'ఆర్టికల్ 21 ఎ' పిల్లలకు విద్యా హక్కును హామీ ఇస్తుంది. ఆ హక్కును అమలు చేయడానికి ప్రభుత్వం విద్యా ప్రమాణాలను నిర్ణయిస్తుంది. ఉపాధ్యాయుల అర్హతలను నిర్దేశించేందుకు ఎన్‌సిటిఇ వంటి సంస్థలు పనిచేస్తాయి. విద్యా నాణ్యతపై నియంత్రణ ఉంటుంది. పాఠశాలల గుర్తింపు కోసం నిబంధనలు ఉంటాయి. కానీ ఒక సంస్థ గుర్తింపు పొందిన తర్వాత అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడి దీర్ఘకాలిక సామాజిక భద్రతకు దేశవ్యాప్తంగా స్పష్టమైన వ్యవస్థ లేకపోతే ఆ నియంత్రణలో భారీ లోపంగానే ఉండిపోతుంది. ఇటీవల ఉపాధ్యాయుల అర్హతలు, ఉపాధ్యాయ విద్యా సంస్థల నాణ్యతపై కూడా సుప్రీంకోర్టు దృష్టి సారించింది.

నాణ్యమైన విద్యకు నాణ్యమైన ఉపాధ్యాయులు అవసరమని న్యాయస్థానం పలు సందర్భాల్లో స్పష్టం చేసింది. అర్హతలు, శిక్షణ, పనితీరు విషయంలో ఉపాధ్యాయులపై బాధ్యతలు విధించే వ్యవస్థ ఉంటే, వారి ఉద్యోగ జీవితానికి కనీస భద్రత కల్పించే వ్యవస్థ కూడా సమాంతరంగా ఉండాలి. ఉపాధ్యాయుడి నుంచి బాధ్యత కోరుతూ, అతని హక్కుల విషయంలో మాత్రం వ్యవస్థ మౌనం వహించడం న్యాయసమ్మతం కాదు. కేంద్రం విద్యను జాతీయ అభివృద్ధికి పునాదిగా ప్రకటిస్తోంది. రాష్ట్రాలు విద్యా రంగాన్ని తమ ప్రధాన ప్రజా బాధ్యతల్లో ఒకటిగా చెబుతున్నాయి. ప్రైవేటు రంగాన్ని విద్యా విస్తరణలో భాగస్వామిగా ప్రభుత్వాలు ఆహ్వానిస్తున్నాయి. అయితే అదే భాగస్వామ్య రంగంలో పనిచేసే లక్షలాది మంది ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత విషయంలో కేంద్రం, రాష్ట్రాలు పరస్పరం బాధ్యతను బదిలీ చేసుకునే పరిస్థితి కొనసాగకూడదు. అందుకే, దేశవ్యాప్తంగా కనీస సేవా ప్రమాణాలను నిర్ణయించాలి. నియామక పత్రం తప్పనిసరి చేయాలి. వేతన చెల్లింపులకు పారదర్శక వ్యవస్థ ఉండాలి. ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ వంటి చట్టబద్ధ ప్రయోజనాల అమలును కట్టుదిట్టం చేయాలి. ఉద్యోగాన్ని అకస్మాత్తుగా తొలగించే పద్ధతులకు నియంత్రణ అవసరం. ఉపాధ్యాయులకు స్వతంత్ర ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ ఉండాలి. పదవీ విరమణ తర్వాత కనీస సామాజిక భద్రత కల్పించే విధానాన్ని రూపొందించాలి. ప్రైవేటు విశ్వవిద్యాలయాలు పెరగడం ఉన్నత విద్య విస్తరణకు సంకేతం కావచ్చు. కానీ వాటిలో పనిచేసే ఉపాధ్యాయుడు రేపటి గురించి భయపడుతుంటే ఆ అభివృద్ధి అసంపూర్ణమవుతుంది. అందుకే, నేటి సుప్రీం కోర్టు నిర్ణయం కొత్త ఆశలను రేకెత్తిస్తున్నది. ●



## హైవే పనులు ఆలస్యంపై సిగ్గుపడుతున్నా

ముంబయి—గోవా రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగడం నాకు సిగ్గుగా అనిపించింది. అందుకే దాని ప్రారంభోత్సవానికి నేను రానని ముందే ప్రకటిస్తున్నా. మరోవైపు మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు చేపడతా. ఒక సంవత్సరంలోపే అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేసి వారిపై చర్యలు తీసుకుంటా. అధికారులను సస్పెండ్ చేసి ఒక రికార్డు సృష్టించాలనుకుంటున్నా. ఇప్పుడు నేను దీన్ని ఆపబోను' ●

– కేంద్ర మంత్రి నితన్ గడ్కరీ



## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

తెలంగాణ సాయుధ పోరాటంలో మడమ తిప్పని పోరాట యోధురాలు ఆమె. సెప్టెంబరు 26, 1895న జన్మించారు. చాకలి ఐలమ్మగా గుర్తింపు పొందిన తెలంగాణా వీరవనిత. సామాజిక ఆధునిక పరిణామానికి నాంది పలికిన స్త్రీ. వరంగల్ జిల్లా, రాయపర్తి మండలం క్రిష్టాపురం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలుకు నాలుగవ సంతానంగా చాకలి ఐలమ్మ జన్మించింది. పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో ఐలమ్మ బాల్య వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబం, చాకలి కులవృత్తే వారికి జీవనాధారం. 1940–44 మధ్య కాలంలో విస్నూర్‌లో దేశ్‌ముఖ్, రజాకర్ల అరాచకాలపై ఎదురు తిరిగి ఎర్రజెండా పట్టింది ఐలమ్మ.

మల్లంపల్లి భూస్వామి కొండలరావు కు పాలకుర్తిలో 40 ఎకరాల భూమి ఉండగా ఐలమ్మ కౌలుకు తీసుకుంది. అందులో నాలుగు ఎకరాలు సాగుచేశారు. పాలకుర్తి పట్వారీ వీరమనేని శేషగిరిరావుకు ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. జీడి సోమనర్సయ్య నాయకత్వంలో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఐలమ్మ ఆ సంఘంలో సభ్యురాలు. పాలకుర్తి పట్వారీ శేషగిరిరావు ఐలమ్మను కుటుంబంతో వచ్చి తన పొలంలో పని చేయాలని ఒత్తిడి చేయడంతో పనిచేయడానికి నిరాకరించింది. పాలకుర్తి పట్వారీ పప్పులుడకక అయిలమ్మ కుటుంబం కమ్యూనిస్టుల్లో చేరిందని విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశాడు. కేసులో అగ్రనాయకులతో పాటు అయిలమ్మ కుటుంబాన్ని ఇరికించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ సహకారంతో ఐలమ్మకు అనుకూలంగా తీర్పువచ్చింది. రజాకార్ల ఉపసేనాధిపతి అయిన దేశ్‌ముఖ్ రెండుసార్లు పరాజయం పాలయ్యాడు. ఐలమ్మ ఇంటిని కూడా తగులబెట్టారు. అనేక రకాలుగా నష్టపోయినప్పటికీ అయిలమ్మ కుటుంబం ఎర్రజెండాను వీడలేదు. అయిలమ్మ భూపోరాటం విజయంతో పాలకుర్తి దొర ఇంటిపై కమ్యూనిస్టులు దాడిచేసి ధాన్యాన్ని ప్రజలకు పంచారు. అయిలమ్మ భూపోరాటంతో మొదలుకొని సాయుధ పోరాటం చివరి వరకు నాలుగు వేలమంది ఉత్పత్తి కులాల వారు అమరులయ్యారు. 10లక్షల ఎకరాల భూమి పంపకం జరిగింది. ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ సెప్టెంబర్ 10,1985న అనారోగ్యంతో మరణించింది.

*(సెప్టెంబరు 10న చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా)*

# పండుగ సమయంలో మాంసం తింటే పాపాత్ములా?

**అరుణ్ శ్రీవాస్తవ**

మమతా బెనర్జీని ఓడించి, మార్పుకోసం బిజెపిని ఎన్నుకోవాలన్న నరేంద్ర మోదీ పిలుపునకు భారీగా స్పందించిన బెంగాలీలు, ముఖ్యంగా భద్రలోక్ (మధ్యతరగతి) ఇప్పుడు తమ ఎన్నికల నిర్ణయానికి పశ్చాత్తాపపడుతున్నారు. హిందుత్వ ఆధ్యాత్మిక గురువు ధీరేంద్ర శాస్త్రి ప్రసంగాన్ని మాంసం, చేపలు తినే బెంగాలీ హిందువులు ఇప్పుడు బెంగాలీ అస్థిత్వం, సంస్కృతిని నాశనం చేసే కుట్రలో ఒక భాగంగా భావిస్తున్నారు. ఆర్‌ఎస్ఎస్, గుజరాత్ కేంద్రీకృత బిజెపి నాయకత్వం చాలా కాలంగా దీనిని లక్ష్యంగా చేసుకున్నాయి.బాగేశ్వర్ బాబాగా ప్రసిద్ధి చెందిన ధీరేంద్ర, తరచుగా ఆర్‌ఎస్ఎస్ అభిప్రాయాలను వినిపిస్తుంటారు. ప్రజానాడిని తెలుసుకోవడానికి బిజెపి–ఆర్‌ఎస్ఎస్ ఆయనను వాడుకుంటున్నాయి. భారతదేశం ఇప్పటికే హిందూ దేశం అయ్యిందన్న బాగేశ్వర్ వాదన ఇందుకు తాజా ఉదాహరణ.

బాగేశ్వర్ తనను తాను ఒక దైవాంశసంభూతుడిగా, దైవత్వాన్ని పొందిన వ్యక్తిగా భావించుకుంటారు. సహజంగానే, ఆయనకు హిందూ మతంలోని వివిధ శాఖలు, మార్గాల గురించి తెలిసి ఉండాలని ఆశిస్తారు. దుర్గా, కాళీ దేవతలకు మేక, చేపలను భోగ్ (పవిత్ర నైవేద్యం)గా సమర్పించే శాక్త సంప్రదాయానికి తన సలహా విరుద్ధమని ఆయనకు ఎలా తెలియదు? ఈ ఆచారాలను కపటమైనవిగా పిలవడం అనేది బెంగాల్ విశిష్టమైన ఆధ్యాత్మిక వారసత్వాన్ని తిరస్కరించే కుట్ర మాత్రమే కాదు, బెంగాలీ సంస్కృతిని, గుర్తింపును తుడిచిపెట్టడానికి ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నం కూడా.

ఇంతకు శాస్త్రి ఏమన్నాడు? హౌరాలో ఇటీవల జరిగిన హనుమాన్ కథా కార్యక్రమంలో, దుర్గా పూజ పందాల్‌లకు మాంసాహార దుకాణాలను దూరంగా పెట్టాలని కోరుతూ విశ్వ హిందూ పరిషత్ జారీ చేసిన సూచనకు ఆయన గట్టి మద్దతు తెలిపారు. పండుగ సమయంలో మాంసాహారం తీసుకునే వారిని పాఖండీ(పాపాత్ములు) అని పిలవడం ద్వారా, ఆ అలవాటును అపవిత్రమైనదిగా, 'సనాతన' నియమాలకు విరుద్ధమైనదిగా పేర్కొనడం ద్వారా విహెచ్‌పి సందేశాన్ని శాస్త్రి ముందుకు తీసుకెళ్లారు. శాస్త్రి ప్రధానంగా మధ్యప్రదేశ్ కేంద్రంగా పనిచేస్తారు. ఉత్తర/మధ్య భారత ప్రజలకు తన సేవలను అందిస్తారు. ఈ ప్రాంతాలలో, నవరాత్రి తొమ్మిది రోజులు ఉపవాసం, కఠినమైన శాకాహారం, ఉల్లిపాయ, వెల్లుల్లి, మాంసానికి పూర్తిగా దూరంగా ఉండటంతో ముడిపడి ఉంటాయి. వైష్ణవ, శాక్త సంప్రదాయాల మధ్య ఘర్షణ వివిధ వర్గాలు ఆరాధించే విభిన్న పద్ధతులను ఎత్తి చూపుతుంది. తూర్పు భారతదేశంలో శాక్త హిందూ మతం (దేవతను అత్యున్నత శక్తిగా ఆరాధించడం) విస్తృతం గా ఆచరణలో ఉంది. శాక్త సంప్రదాయాలలో, మాచ్ (చేపలు), పాఠా(మేక మాంసం) 'అపవిత్రమైనవి' లేదా పాపపూరితమైనవిగా పరిగణించబడవు. ముఖ్యంగా, హిందూ ప్రవర్తనకు సంబంధించి ఒకే విధమైన నియమావళిని (యూనిఫామ్ కోడ్) సమర్థించడానికి శాస్త్రి తరచుగా బహిరంగ వేదికలను ఉపయోగిస్తుంటారు.

ఒక పరిణామం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. బిహార్, యుపి నుండి వచ్చిన బెంగాలీయేతర ఇబిసి, ఒబిసి వలసదారులు, గుజరాతీలు, మార్వాడీల మద్దతుతో పాటు, టిఎంసి, కాంగ్రెస్ నుండి బిజెపిలో చేరిన వారి మద్దతు కూడా శాస్త్రికి ఉంది. టిఎంసి నుంచి వచ్చిన సువేందు అధికారి ఆయనకు బలమైన మద్దతుదారుగా ఉన్నారు. పూజ సమయంలో మాంసాహారం తింటున్నందుకు బెంగాలీ హిందువులను శాస్త్రి విమర్శించిన వేదికను అధికారి కూడా పంచుకున్నారు. స్థానిక హిందూ ఓటర్లకు ఈ ప్రచారం దూరం కాకుండా చూసేందుకు, బెంగాల్ బిజెపి త్వరగానే శాస్త్రి ఆదేశాల నుండి దూరం జరిగింది. ఇటీవల ప్రముఖ స్థానిక బిజెపి నాయకులు శాస్త్రికి ఘన స్వాగతం పలకడంతో, ఈ పరిస్థితి రాజకీయంగా ప్రమాదకరంగా మారింది.

**పండుగల్లో చేపలు, మాంసం బెంగాలీల ఆచారం**

బెంగాల్‌లోని రాజకీయ వర్గాలన్నింటిలోనూ, బాగేశ్వర్ వ్యాఖ్యను తమదైన సుస్థిరమైన, విభిన్నమైన ఆచారాలు కలిగిన ప్రాంతంపై ఒక బయటి మత నాయకుడు ఉత్తరభారత, కఠినమైన శాకాహార మత వ్యవస్థలను రుద్దడానికి చేస్తున్న ప్రయత్నంగా చూస్తున్నారు. ప్రాథమికంగా, స్థానిక వంట సంప్రదాయాల ను గౌరవించిన స్వామి వివేకానంద వంటి చారిత్రక వ్యక్తులను ఉదహరిస్తూ, బెంగాలీల ఆహారపు అలవాట్ల ను నిర్దేశించే హక్కు మత లేదా రాజకీయ నాయకులకు లేదని నొక్కిచెబుతూ, పశ్చిమ బెంగాల్ బిజెపి నాయకులు, రాష్ట్ర అధ్యక్షుడు కూడా ఆయన ప్రకటన నుంచి బహిరంగంగా తమను తాము దూరం చేసుకోవడానికి ఇదే కారణమైంది.కాళీ ఘాట్, దక్షిణేశ్వర్, తారాపీఠ్ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలలో దేవతలకు సాంప్రదాయ జంతుబలి (బలి), మాంసం లేదా చేపలను భోగ్‌గా (పవిత్ర నైవేద్యం గా) సమర్పించడం అనేది ఒక పురాతన ఆచారం. కాబట్టి బెంగాలీ హిందూ ఆచారాలను కించపరిచేందు కు బాగేశ్వర్ ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ చర్య పట్ల అన్ని రాజకీయ వర్గాలకు చెందిన బెంగాలీలు ఒకే రీతిలో ఆగ్రహంతో ఉన్నారు. బెంగాల్ రాజకీయ చరిత్రలో ఉత్తర భారత సన్యాసి చేసిన అనుచిత వ్యాఖ్యలను విమర్శించేందుకు అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావడం ఇదే మొదటిసారి. గతంలో ఎన్నడూ ఏ మత లేదా రాజకీయ నాయకుడు కూడా మాంసాహారం తినే బెంగాలీలను 'పాఖండీ' (పాపులు) అని పిలవలేదు.

**పారని పాచిక**

బాగేశ్వర్ వ్యాఖ్యపై బెంగాలీలు ఎంతగా ఆగ్రహంతో ఉన్నారంటే, రాష్ట్రవ్యాప్తంగా ఆయనపై కనీసం పది ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. కాంగ్రెస్ వంటి రాజకీయ పార్టీలు సైతం ఆయన బెంగాలీల మనోభావాలను దెబ్బతీశారని, సామాజిక అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ పరువు నష్టం కేసులు దాఖలు చేశాయి. గతంలో పశ్చిమ బెంగాల్‌కు ఆయనను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు షామిక్ భట్టాచార్య స్వాగతించినప్పటికీ, తాజాగా శాస్త్రి ఆదేశాన్ని గట్టిగా తిరస్కరిస్తూ, 'బెంగాలీలు ఏమి తినాలో ఏ బాబా గానీ, ఏ రాజకీయ పార్టీ గానీ నిర్ణయించలేదు. మేము అష్టమి నాడు లూచీ, నవమి నాడు మటన్ తింటాము, ఇకపైనా అలాగే తింటాము... స్వామి వివేకానంద కంటే గొప్ప బాబా ఎవరూ లేరు' అని అన్నారు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), వామపక్ష నాయకులు కూడా ఆయనను తీవ్రంగా విమర్శించారు.

ఆర్‌ఎస్ఎస్, బిజెపిలు ఏకీకృత అఖిల భారత హిందూ జాతీయవాద అస్థిత్వాన్ని విస్తరించడానికి పశ్చిమ బెంగాల్ పై తీవ్రంగా దృష్టి సారిస్తున్నాయి. ఇది సాంప్రదాయ బెంగాలీ బహుళత్వాన్ని, లౌకికవాదాన్ని పునర్నిర్మించి, అధిగమించే ప్రయత్నం. భారతదేశమంతటా హిందూ నాగరికతను ఏకీకృతం చేయాలన్న తమ లక్ష్యానికి, పశ్చిమ బెంగాల్‌లోని సామాజిక రాజకీయ స్థానాన్ని చేజిక్కించుకోవడం అత్యంత కీలకమని ఆర్‌ఎస్ఎస్ భావిస్తోంది. బెంగాల్ సాంస్కృతిక, రాజకీయ రంగాలను తమవైపు తిప్పుకోవడం విస్తృత హిందుత్వ ప్రణాళికకు ఒక ప్రధాన మైలురాయి అవుతుందని వ్యూహకర్తలు పేర్కొన్నారు.

స్వామి వివేకానంద, బంకిం చంద్ర చటోపాధ్యాయ, సుభాష్ చంద్ర బోస్ వంటి పూజ్య బెంగాలీ ప్రముఖులను తీవ్ర హిందూ జాతీయవాద కథనంలోకి చేర్చడానికి ఈ కాషాయ వ్యవస్థ చురుకుగా ప్రయత్నిస్తోంది. ఆసక్తికరంగా, ఇది బెంగాల్ సంస్కరణవాద, లౌకిక చరిత్రను మతతత్వ మెజారిటీవాద చట్రానికి సరిపోయేలా పునర్ వ్యాఖ్యానిస్తోంది. చారిత్రకంగా, మధ్యతరగతి బెంగాలీ భద్రలోక్, ప్రాంతీయ మేధావు లు ఒక విలక్షణమైన, సమ్మిళిత సాంస్కృతిక నీతిని (సూఫీ, బౌల్, మానవతావాద సంప్రదాయాలను కలుపుకొని) కలిగి ఉన్నందుకు గర్వపడుతుంటారు. ఇది ఉత్తరాది తరహా సంకుచిత మెజారిటీ రాజకీయాలను చాలావరకు ప్రతిఘటించింది. జాతీయ ప్రధాన కార్యాలయాల నుండి వెలువడే కేంద్రీకృత, హిందీ – హిందూ రాజకీయ పదజాలంపై ఏ విధమైన నొక్కిచెప్పినా, అది తరచుగా బెంగాలీ అస్థిత్వంలో అంతర్లీనంగా ఉన్న భాషాపరమైన, లౌకిక ఆత్మగౌరవంతో విభేదిస్తుంది.

బెంగాలీ అస్థిత్వానికి, దాని చారిత్రకంగా బలమైన వామపక్ష ధోరణికి మధ్య ఉన్న సంబంధం ఒక ముఖ్యమైన చారిత్రక, సామాజిక చర్చనీయాంశం. ఒకటి మరొకదాని కంటే అంతర్గతంగా 'ఎక్కువ ప్రభావవంతమైనది' అనడం కంటే, గత శతాబ్దంలో ఈ రెండూ ఒకదానిపై ఒకటి తీవ్రంగా ప్రభావం చూపాయి, బలోపేతం చేసుకున్నాయి, కొన్నిసార్లు విభేదించుకున్నాయి. 1960ల నుండి 2000ల ప్రారంభం వరకు వామపక్ష రాజకీయాలు బెంగాలీ అస్థిత్వంలో లోతుగా పెనవేసుకుపోయాయి. బెంగాలీ సంస్కృతి సాహిత్యాన్ని, కవిత్వాన్ని ప్రోత్సహిస్తుంది. ఈ వాతావరణంలో వామపక్ష భావజాలానికి సహజమైన నివాసం దొరికింది. వామపక్ష రాజకీయాల లౌకిక చట్రం ఈ సాంస్కృతిక వైఖరికి బాగా అనుగుణంగా ఉండి, చాలాకాలం పాటు మతపరమైన విభజనను ప్రతిఘటించింది. 20వ శతాబ్దమంతటా రాజకీయ చైతన్యం, లౌకికత్వం, సాంస్కృతికంగా చైతన్యవంతమైన బెంగాలీ అస్థిత్వాన్ని రూపొందించడంలో వామపక్ష ధోరణి అత్యంత ప్రభావవంతంగా నిరూపించబడింది. ఇది విద్య, సాహిత్యం, వ్యవసాయ సమానత్వానికివిలువనిచ్చే సమాజాన్ని పెంపొందించింది.

భారతదేశంలోని మిగిలిన ప్రాంతాలు, ముఖ్యంగా ఉత్తర, తూర్పు భారతదేశం వామపక్షవాదాన్ని రష్యా, చైనా నుండి దిగుమతి చేసుకున్న ఆలోచనగా చూసినప్పటికీ, బెంగాలీ మనస్తత్వం వలన వ్యతిరేక పోరాటం ద్వారా బలంగా రూపుదిద్దుకోవడం, తొలితరం వామపక్ష నాయకులు స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడటం వలన, వామపక్షవాదాన్ని ఒక విదేశీ దిగుమతిగా కాకుండా, బెంగాలీ దేశభక్తి, తీవ్ర ధిక్కారానికి కొనసాగింపుగా చూశారు. స్పష్టంగా, బెంగాల్‌లో తన ఎదుగుదల, విస్తరణ కోసం కాషాయ శిబిరం ఇప్పటివరకు ఉన్న సమ్మిళిత బెంగాలీ సంస్కృతి, అస్థిత్వంపై దాడిచేసి, వాటిని నాశనం చేయాల్సిన అవస రం ఏర్పడింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అలా చేయడానికి ప్రయత్నించింది, కానీ సఫలం కాలేకపోయింది. చివరకు అత్యంత వివాదాస్పదమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ద్వారా భారత ఎన్నికల సంఘం ద్వారా ఎన్నికల వ్యవస్థను తారుమారు చేసే మార్గాన్ని ఎంచుకోవలసి వచ్చింది. సర్ 70 లక్షలకు పైగా ఓటర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించింది. బిజెపి పన్నాగం ఫలించి, ఎన్నికల్లో గెలిచింది. అయితే, ఇప్పుడు గుజరాత్ కేంద్రంగా ఉన్న బిజెపి, బాగేశ్వర్ వంటి ఆధ్యాత్మిక గురువుల ద్వారా తీవ్రమైన దాడికి దిగింది. కాషాయ శిబిరం జాబితాలో చాలామంది ఆధ్యాత్మిక గురువులు ఉన్నారు. కానీ ఈ సున్నితమైన విషయంపై మరే ఇతర మత పెద్ద మాట్లాడలేదు.

వాస్తవానికి, ఈ పనికోసం విశ్వ హిందూ పరిషత్ (విహెచ్‌పి)బాగేశ్వర్‌ను ఉపయోగించుకుంది. ఉత్తర భారత(వైష్ణవ) సంప్రదాయాలు, తూర్పు భారత (శాక్త) సంప్రదాయాల మధ్య ఉన్న ప్రాథమిక వైరుధ్యం కారణంగా, దుర్గా పూజ సమయంలో మాంసాహార వినియోగాన్ని బహిరంగంగా లక్ష్యంగా చేసుకోవాలని ఆయన నిర్ణయించుకున్నారు. బెంగాలీలు కానివారిపై, ముఖ్యంగా గుజరాతీలు, మార్వాడీలపై ఆయనకు గణనీయమైన ప్రభావం ఉంది.

*(ఐపిఎ సర్వీస్)*

# నిజాం నిరంకుశ పాలనను గడగడలాడించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

నిజాం ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభువుల అణిచివేత దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన మహోన్నతమైన జనం నడిపిన విప్లవ పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం. "బండెనుక బండి కట్టి పదహారు బండ్లు కట్టి ఏ బండ్లె పోతావు కొడుకో నైజాం సర్కారోడ అంటూ", "దొర ఏందిరో నీ దొరతనం ఏంటిరో" అంటూ నిజాం నవాబ్, రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ద్వారా తెలంగాణ ప్రజలను అందరినీ ఏకం అయ్యేలా చేసింది.

కష్టాలు, కన్నీళ్లు, వెట్టిచాకిరీ, దౌర్జన్యాలు, అత్యాచారాలు, అవమానాలే ఆ మట్టి మనుషులను తట్టి లేపాయి. ఆలోచనలే పునాదులు అయ్యాయి. పనిముట్లే ఆయుధాలయ్యాయి. గడ్డి కోసిన చేతులే గొడ్డళ్లను ఎత్తాయి. దండం పెట్టిన చేతులే కొడవళ్లను పట్టాయి. 'బాంచన్ దొర, కాల్మొక్తా' అన్న గొంతులే భూస్వాములు, పటేళ్లు, దొరల అరాచకాలపై గర్జించాయి. ఈ పరిణామాలే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంగా మారాయి. జనం నడిపిన విప్లవమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అని ఒక్క మాటలో అనవచ్చు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, నిజాం నవాబ్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం చరిత్రలో మరువలేనిది.

నిజాం పాలనలో గ్రామాలన్నీ భూస్వాములు, పెత్తందార్లు, పటేళ్లు, పట్వారీల చేతుల్లో ఉండేవి. జమిందార్, దేశ్‌ముఖ్ పేరుమీద రెవెన్యూ వ్యవస్థ నడిచేది. వీరందరూ నిజాం సర్కార్‌కు తొత్తులుగా ఉండేవారు. అసలు వీరి పేరు చెబితేనే తెలంగాణ పల్లెలు గజగజ వణికిపోయేవి. వీరు పల్లెల్లో ఉంటూ నిట్టనిలువునా దోచుకునేవారు. నైజాం ప్రభుత్వం విధించే పన్నులను దేశ్‌ముఖ్‌లు, దేశ్ పాండేలు వసూలు చేసేవారు. ఈ క్రమంలో అనేక ఘోరాలకు పాల్పడేవారు. రైతుల పంటను శిస్తు కింద గుంజుకునేవారు. భూమలను గుంజుకోవటమే కాదు కౌలు రైతులను చిత్రహింసలకు గురి చేసేవారు. ప్రతిదానికి పన్ను కట్టాల్సిందే. గ్రామాల్లో ఉండే దొరలు, భూస్వాములు, పటేళ్లు, పట్వారీల ఇళ్లలో ఏదైనా పండగ జరిగినా వీరు పన్ను కట్టాల్సిందే. వీరి అరాచకాలను భరించలేకనాటి తెలంగాణ ప్రాంతంలోని గ్రామాల్లో వెట్టిచాకిరీ వ్యవస్థను నిర్మూలించడం, దున్నేవాడికి భూమి దక్కాలనే నినాదంతో పోరాడారు. భూస్వాములకు, దేశ్‌ముఖ్‌లకు, జాగీర్దార్‌లకు, దేశ్‌పాండేలకు వ్యతిరేకంగా ప్రజలు కమ్యూనిస్టు నాయకత్వం పిలుపుతో ఉద్యమించారు. రజాకార్ల అరాచకాలకు, నిజాం నవాబుల దమనకాండకు విరుగుడుగా సాయుధ పోరాటం ఆరంభమయ్యింది. రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి సాయుధ పోరాటానికి పిలుపునివ్వగా, ఆరుట్ల రామచంద్రారెడ్డి, దొడ్డి కొమురయ్య, చిట్యాల ఐలమ్మ, అనభేరి ప్రభాకర్ రావు, బొమ్మగాని ధర్మ బిక్షం లాంటి వారు పాల్గొనడంతో తెలంగాణ సాయుధ పోరాటం పతాకస్థాయికి చేరింది.

**దేశానికి ఆగస్టు15న స్వాతంత్ర్యం వచ్చినా నిజాం పాలనలోనే ఉన్న తెలంగాణ**

భారతదేశానికి స్వాతంత్ర్యం 1947 ఆగస్ట్ 15న వచ్చిన నాటి హైదరాబాద్ సంస్థానం ఇంకా నిజాం అధీనంలో ఉంది. 16 జిల్లాల్లో తెలంగాణ ప్రాంతానికి చెందినవి 8 జిల్లాలు ఉండేవి. మిగతావి కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల పరిధిలో ఉండేవి. ఈ ప్రాంతాలన్నీ నిజాం చేతుల్లో ఉండేవి. రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ 1947 సెప్టెంబర్ 11న సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు. ముగ్గురు కమ్యూనిస్టు నాయకుల పిలుపుతో సాయుధ పోరాటంలో పాల్గొన్న ప్రజలు గ్రామాల్లో ప్రజా ఉద్యమాలు మొదలు పెట్టారు. చాలా పల్లెల్లో గ్రామ దళాలు ఏర్పడ్డాయి. జనం ఏకమయ్యారు. పనిముట్లనే ఆయుధాలుగా మార్చుకొని దున్నేవాడికే భూమి అనే నినాదంతో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో భూపోరాటం కొనసాగింది. సాయుధ





దళాలు ప్రజలకు దిశా నిర్దేశం చేస్తూ దొరల, భూ స్వాముల కబంధ హస్తాల నుండి ఒక్కొక్క గ్రామాన్ని విముక్తి చేస్తూ 3000 గ్రామాలలో పది లక్షల ఎకరాలను ప్రజలకు పంచిన ఘనమైన చరిత్ర ఈ మహోత్తర పోరాటానిది. ఈ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దాదాపు 4వేల మందికి పైగా అసువులు బాసారు. పోరాటపటిమకు తలొగ్గిన నిజాం రాజు 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారు. అంటే ఒక సంవత్సరం కాలం అనంతరం 1948 సెప్టెంబర్ 17న ఒక సంవత్సరం ఆలస్యంగా తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం రావడం జరిగింది.

**తెలంగాణ సాయుధ పోరాటంలో విద్యార్థుల పాత్ర కీలకమైనది**

తెలంగాణ సాయుధ పోరాట సంగ్రామంలో ప్రజలకు సామాజిక చైతన్యం కల్పించడం కోసం విద్యార్థులు రైతుల బస్తీల్లోకి వెళ్లి అణగారిన ప్రజలకు జమీందారీ వ్యవస్థ అన్యాయాలను తెలియజేశారు. అక్షరాస్యత పెంచేందుకు చిన్న చిన్న బడి తరగతులు వారి ఇంట్లోనే రహస్యంగా నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ నిజాం పాలనకు వ్యతిరేకంగా నినాదాలు, ప్రదర్శనలు, మానవహక్కుల కోసం నిరసనలు చేపట్టారు. ప్రజలతో బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించారు. కొంతమంది విద్యార్థులు నేరుగా గెరిల్లా దళాలలో చేరి పోరాటంలో పాల్గొని అమరులయ్యారు.

కొంతమంది విద్యార్థులు సమాచారం సేకరించడం, రహస్య పత్రికలు పంపించడం, ఆయుధాలను తరలించడం వంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థులు పాటలు, నాటకాలు, వీధి నాటకాల ద్వారా రైతుల్లో చైతన్యం రేకెత్తించారు. 1948 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు అని ఉమ్మడి నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలోని పాఠశాల విద్యార్థులు పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేస్తే నిజాం పాలకులు 10మంది విద్యార్థులను సజీవదహనం చేశారు.

**కర్నాటక, మహారాష్ట్రలో అధికారికంగా విలీన దినం జరుపుతున్నా తెలంగాణలో ఎందుకు జరపడం లేదు?**

సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉండి నేడు కర్ణాటక, మహారాష్ట్ర కలిసిన జిల్లాల్లో హైదరాబాద్ విలీన దినోత్సవాలను ఆ రాష్ట్రాల ప్రభుత్వాలు ఎప్పటినుండో అధికారికంగా నిర్వహిస్తున్నాయి. కానీ ఉమ్మడి ఆంధ్రాలో సాధ్యం కాలేదు. వారు ఆంధ్ర పాలకులు తెలంగాణను విస్మరించారు. ఆనాటి సాయుధ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంకోసం ఉద్యమిద్దాం. వచ్చే మన రాష్ట్రంలో మన సాయుధ పోరాట వీరులను మనం స్మరించుకుందామని మాట్లాడిన కెసిఆర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉండి కూడా సెప్టెంబర్ 17 విలీన దినోత్సవం అధికారికంగా నిర్వహించలేకపోయాడు. కనీసం తెలంగాణ సాయుధ పోరాట యోధులను గుర్తించలేదు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం సాయుధ పోరాట యోధులను గుర్తించి సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

**చరిత్రను మతాల మధ్య ఘర్షణగా చిత్రీకరించకూడదు**

నేడు ఓట్ల కొరకు తెలంగాణ సాయుధ పోరాటం హిందూ, ముస్లింలకు మధ్య జరిగినట్టు బిజెపి చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. సెప్టెంబర్ 17 చరిత్ర గురించి మాట్లాడుతున్న కొన్ని పార్టీలు ఆ ఉద్యమంలో మీ ఆనవాలు ఎక్కడ అంటే చెప్పలేని స్థితి. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను మతపరమైన కోణంలో వక్రీకరించకుండా, వాస్తవ చారిత్రక నేపథ్యాన్ని ప్రజలకు తెలుపాలి. ఈ పోరాటం ప్రధానంగా నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు సాగించిన పోరాటం తప్ప మతాల మధ్య జరిగింది కాదు.

**సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రభుత్వం అధికారికంగా గుర్తించి, సెప్టెంబర్ 17ను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది మేమే అంటున్న కాంగ్రెస్ నేడు రాష్ట్రంలో అధికారంలో ఉంది వారే కాబట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని ఊరూవాడా ఉత్సవాలు ప్రభుత్వపరంగా నిర్వహించాలి.

గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సభలు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పోరాట యోధుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలి. తెలంగాణ సాయుధ పోరాట యోధుల వర్ధంతి, జయంతులను అధికారికంగా నిర్వహించేలా కృషి చేయాలి. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను విద్యార్థులకు పాఠ్యాంశాల్లో చేర్చడం ద్వారా నేటితరం విద్యార్థులకి ఆనాటి చరిత్ర తెలుస్తుంది. సెప్టెంబర్ 17 తెలంగాణ విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.



తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో

# చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొనియాడారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆమె చిత్రపటానికి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ వికారాబాద్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిట్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి అని కొనియాడారు. నాటి దొరలు, పటేల్, పట్వారీలు, జాగీర్దార్‌ల దౌర్జన్యాలకు ఆమె ఎదురొడ్డి నిలిచారన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధులకు ఐలమ్మ అన్నం పెట్టి ఆశ్రయం కల్పించారని, ప్రత్యక్షంగా ఉద్యమంలో పాల్గొని తుపాకీ చేతబట్టి పోరాటం చేశారని కూనంనేని గుర్తు చేశారు. విసునూరి దొర దౌర్జన్యాలను అడుగడుగునా ఎండగడుతూ ప్రజల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. సామాజిక, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ చూపిన ధైర్యం తెలంగాణ ప్రజా ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని సాంబశివరావు అన్నారు.

కూరగాయల సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు

# సమగ్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తిరిగి పెంచడంతో పాటు రైతులకు ఆధునిక సాంకేతికత, నాణ్యమైన ఇన్‌పుట్స్, సాగునీరు, మార్కెటింగ్, కోల్డ్‌స్టోరేజ్ వంటి సదుపాయాలను సమన్వయం చేస్తూ సమగ్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శాసనసభ సమావేశాలలో భాగంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో బిజెపి సభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు, ఎంఐఎం సభ్యులు మాజిద్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్ మేరాజ్, కాంగ్రెస్ సభ్యులు యశశ్విని రెడ్డి తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. గతంలో తెలంగాణలో సుమారు 3 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు జరిగితే, ప్రస్తుతం అది లక్ష ఎకరాలకు తగ్గిపోయిందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల 202526 సంవత్సరంలో సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఈ పరిస్థితిని మార్చి, తెలంగాణలోనే ఉత్పత్తిని పెంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అందుకోసం ప్రస్తుత వానాకాలంలో లక్ష ఎకరాలు, రాబోయే రబీలో మరో లక్ష ఎకరాల్లో కూరగాయలు సాగుచేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రైతులను కూరగాయల సాగు వైపు ప్రోత్సహించేందుకు భారీగా రాయితీలు ప్రకటిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నారు, మల్చింగ్, షేడ్‌నెట్‌ల కోసం రూ.20 కోట్లు, శాశ్వత పందిళ్ల కోసం రూ.8 కోట్లు, బిందు సేద్యం (డ్రిప్) కోసం రూ.97 కోట్లు కేటాయించామని చెప్పారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు, అల్లం, కంది సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎరువుల వాడకంలో యూరియా వినియోగాన్ని తగ్గించి, భూమి సంరక్షణకు ప్రాధాన్యమిచ్చేలా కేంద్ర సబ్సిడి విధానంలో మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని, ఈ విషయమై దక్షిణ భారత వ్యవసాయ మంత్రుల సమావేశాన్ని కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతుల ఉత్పత్తులకు సరైన నిల్వ, మార్కెటింగ్ వసతులు కల్పించేందుకు కోహెడ వద్ద శంషాబాద్ విమానాశ్రయ సమీపంలో 170 ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి మార్కెట్ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. మరోవైపు వ్యవసాయ విద్యలో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రమాణాలు పాటించని 6 ప్రైవేట్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలల అనుబంధాన్ని రద్దు చేశామని, మిగిలిన కళాశాలల పైనా నిఘా ఉంచామని హెచ్చరించారు. విద్యార్థుల సంఖ్య తగ్గుతున్న దృష్ట్యా నాలుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలో 37వ ర్యాంకు నుంచి 19వ ర్యాంకుకు మెరుగుపడిందని, త్వరలోనే ప్రథమ స్థానానికి తీసుకువెళ్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఏడాదే హుజూర్ నగర్, డిచ్‌పల్లి, వికారాబాద్‌లలో కొత్త వ్యవసాయ కళాశాలలకు అనుమతులు ఇచ్చి, వ్యవసాయ సీట్ల సంఖ్యను 1,100 నుంచి 2,000కు పెంచామని మంత్రి తుమ్మల చెప్పారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

### కూనంనేని సాంబశివరావు

వ్యవసాయం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం సుజాత నగర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. పాడి, కూరగాయాల సాగు సుజాత నగర్‌లో ఎక్కువ చేస్తారని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆరు లక్షల టన్నుల కూరగాయాలు దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. దిగుమతిని ఎగుమతి చేసే దిశగా కూరగాయాల సాగును అభివృద్ధి చేయాలని సూచించారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పి, వాటి ద్వారా పరిశ్రమలను ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

### డిప్యూటీ సిఎం మల్లు భట్టి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిని ప్రోత్సహించే క్రమంలో ఫ్లోటింగ్ సోలార్ (నీటిపై తేలియాడే) విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ సభ్యులు మదన్ మోహన్ రావు, కసిరెడ్డి నారాయణ రెడ్డి అడిగిన ప్రశ్నలకు ఉపముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రధాన రిజర్వాయర్లపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై విద్యుత్, నీటిపారుదల శాఖలు ఉమ్మడిగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. అయితే, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి అయ్యే అధిక వ్యయం ప్రధాన సవాలుగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ కఠిన నిబంధనల వల్ల ప్రతి మెగావాట్ ఉత్పత్తికి రూ. 1.30 కోట్ల అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రంలోకి భారీగా పెట్టుబడులు వస్తాయని చెప్పారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కావడంతో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందని భట్టి తెలిపారు. భావి అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తూనే, ఉచిత, రాయితీ విద్యుత్ సబ్సిడిల కోసం ఏటా ప్రభుత్వం రూ. 19 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. భవిష్యత్తు అవసరాల కోసం సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని, ఇందులో భాగంగా అమ్రాబాద్ లోని 80 గ్రామాల్లో 'మైక్రో గ్రిడ్'ల ద్వారా అమ్రాబాద్ సోలరైజేషన్ పైలట్ ప్రాజెక్టును చేపడుతున్నామని ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లో సోలార్ రంగాన్ని ప్రోత్సహించడానికి 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. రైతులు, సామాన్య ప్రజలు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో శాసనసభ్యులు భాగస్వాములు కావాలని భట్టి విక్రమార్క కోరారు.

### ఉద్యోగులకు రూ.కోటి బీమా దేశంలోనే తొలిసారి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్ల కోసం అమలు చేస్తున్న రూ.కోటి ప్రమాద బీమా పథకం దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో అమలవుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ సభ్యులు చిక్కుడు వంశీ కృష్ణ, వేముల వీరేశం, ఆదినారాయణ జారె అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 16 బ్యాంకుల సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఈ పథకం పరిధిలోకి వచ్చారని వెల్లడించారు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు, విద్యుత్ సంస్థలు, సింగరేణి ఉద్యోగులకు సంబంధించి 98 బీమా క్లెయిమ్‌లను పరిష్కరించి కోట్ల రూపాయల పరిహారం అందించినట్లు తెలిపారు. ప్రమాద మరణానికి రూ.కోటి బీమాతో పాటు ఇతర ప్రయోజనాలతో కలిపి రూ.1.20 కోట్ల వరకు, విమాన ప్రమాద మరణానికి రూ.2 కోట్ల వరకు బీమా వర్తిస్తుందన్నారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉందన్నారు. ఇందుకోసం ఇప్పటికే రూ.240 కోట్ల నిధులు కేటాయించామన్నారు.

కనీస వేతనాల చెల్లింపులో

## తెలంగాణ దేశానికే ఆదర్శం

### మంత్రి వివేక్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కనీస వేతనాల చెల్లింపులో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఆలోచిస్తోందని చెప్పారు. శాసనసభలో గురువారం కాంగ్రెస్ సభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మల్ రెడ్డి రంగారెడ్డి, సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని మంత్రి గుర్తు చేశారు. నదీమ్ కమిటీ నివేదిక అందిన వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అలాగే ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ కార్పొరేషన్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ఈ దిశగా త్వరలోనే సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ఖరారు చేస్తామని మంత్రి వివేక్ తెలిపారు.

**ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా వేతనాలు ఇవ్వాలి : కూనంనేని**

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచితే, అందరి వేతనాలు రేషనలైజ్ చేయడంతో ఉన్న వేతనం తగ్గిందని సభ దృష్టికి తీసుకొచ్చారు. 10 శాతం మాత్రమే వేతనం పెంచారని చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్‌లలో వేతనాలు తగ్గాయన్నారు. సింగరేణిలో సగం మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులే ఉన్నారని, వారి వేతనాలు పెంచాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు వేతనాల్లో దోపిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వేతనాలు చెల్లించాలని కోరారు. కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం నిర్వహించాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో

## వైద్య నిర్ధారణ సేవలు మరింత విస్తరణ

### శాసనమండలిలో మంత్రి సి.దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య నిర్ధారణ సేవలను మరింత విస్తరిస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ తెలిపారు. శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు తీన్మార్ మల్లన్న అడిగిన ప్రధాన ప్రశ్నకు, సిపిఐ నెల్లికంటి సత్యం అడిగిన అనుబంధ ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో 9 ఎంఆర్‌ఐలు, 50 సిటి స్కాన్లు, 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, కొత్తగా 9 ఎంఆర్‌ఐ, 8 సిటి స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వివరించారు. గాంధీ, ఉస్మానియా తదితర ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అదనపు ఎంఆర్‌ఐ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కొత్తగా నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, నల్గొండ, మహబూబ్‌నగర్ జిజిహెచ్‌లు, నీలోఫర్ తదితర ఆసుపత్రుల్లో ఎంఆర్‌ఐ సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు. వైద్య పరికరాల నిర్వహణ కోసం 'ఈ ఉపకరణ్' వ్యవస్థను వినియోగిస్తున్నామని, టిజిఎంఎస్‌ఐడిసిలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఏర్పాటు చేసి పరికరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గత రెండున్నరేళ్లలో 1,500 మందికి పైగా టెక్నీషియన్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించామని మంత్రి చెప్పారు.

## 17 లక్షల మందికి ఎన్ఇహెచ్ఎస్

### మంత్రి దామోదర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఇహెచ్ఎస్) అమలు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ తెలిపారు. శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ఎ.వి.ఎన్.రెడ్డి, బి.మహేష్ కుమార్ గౌడ్ 'ఉద్యోగుల కొత్త ఆరోగ్య పథకం (ఎన్ఇహెచ్ఎస్)' అమలుపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2026 జూలై 17 నుంచి పథకం అమల్లోకి వచ్చిందని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన 30 మంది సభ్యులతో నూతన ఈహెచ్ఎస్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ బేసిక్ వేతనం, పెన్షన్‌లో 1.5 శాతం చెల్లిస్తుండగా, అంతే మొత్తాన్ని ప్రభుత్వం సమకూరుస్తోందన్నారు. దీంతో నెలకు రూ.88 కోట్లు, ఏడాదికి రూ.1,056 కోట్ల నిధులు అందుబాటులో ఉంటాయని మంత్రి వివరించారు. ఇహెచ్ ఎస్ పరిధిలో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ కలిపి 921 ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీ ఆథరైజేషన్ ఇచ్చినట్లు తెలిపారు. పథకం పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని, అర్హులకు డిజిటల్ హెల్త్ కార్డులను జారీ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ అంశంపై సభ్యులు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. పిహెచ్‌సి స్థాయి నుంచి నిమ్స్, ఎయిమ్స్ వరకు వైద్య రంగాన్ని ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. గత బిఆర్‌ఎస్ పాలనతో పోలిస్తే ప్రస్తుతం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ వ్యవస్థలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఉద్యోగులు ప్రభుత్వం లో భాగస్వాములేనని, వారి సంక్షేమానికి ప్రభు త్వం ప్రాధాన్యత ఇస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కంటే మెరు గ్గా ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తేదీనే ప్రభు త్వం జీతాలు చెల్లిస్తున్నదని ఆయన చెప్పారు.

## దివ్యాంగులందరికీ పింఛన్లు

### శాసనమండలిలో మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పింఛన్ అందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. శాసనమండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు టి.భానుప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4,66,351 మంది వికలాంగులు పింఛన్లు పొందుతున్నారని మంత్రి తెలిపారు. కొత్తగా పింఛన్ల కోసం ఇప్పటివరకు 1,23,199 దరఖాస్తులు వచ్చాయని, సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని మంత్రి చెప్పారు. దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తయిన తర్వాత అర్హులకు పింఛన్లు మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. సదరం, యుడిఐడి సర్టిఫికెట్ల జారీలో జాప్యం కారణంగా పింఛన్ల మంజూరులో ఆలస్యం జరుగుతోందని తెలిపారు. తాత్కాలిక సర్టిఫికెట్ల విధానాన్ని అమలు చేస్తున్నామని, హార్ట్ పేషెంట్లకు సైతం పింఛన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అనర్హులకు మంజూరైన పింఛన్లను గుర్తించి తొలగిస్తున్నామని సీతక్క తెలిపారు.

ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్

## 2027 జూన్ నాటికి పూర్తి

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను 2027 జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శాసన మండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు సిహెచ్.నవీన్ (తీన్మార్ మల్లన్న), పింగిలి శ్రీపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. 2017–18లో ప్రారంభమైన ఈ కారిడార్ పనులు కాంట్రాక్టర్ సంస్థ ఎన్‌సిఎల్‌టికి వెళ్లడంతోపాటు మరో సంస్థ పనులు కొనసాగించలేకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం గాయత్రి కన్‌స్ట్రక్షన్స్‌తో పనులు వేగవంతం చేశామని, పగలు, రాత్రి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఫ్లైఓవర్ కింద బిటి రీన్యూవల్స్, కొత్త రోడ్డు పనులు పూర్తి చేశామని తెలిపారు. ఉప్పల్–నారపల్లి మార్గం భువనగిరి, బిబినగర్ ఎయిమ్స్, జనగామ, వరంగల్ ప్రాంతాలకు కీలకమైన రహదారి అని, వరంగల్‌కు ఇది ప్రధాన రహదారి కావడంతో పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు మంత్రి చెప్పారు.

మంత్రి తుమ్మల పనితీరుపై

## బిజెపి ఎమ్మెల్యేల ప్రశంసలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనితీరును బిజెపి ఎమ్మెల్యేలు పాయల శంకర్, రాకేష్ రెడ్డి శాసనసభలో ప్రశంసించారు. మంత్రి తుమ్మల ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంతో చొరవ చూపుతున్నారని, తాము ఇలాంటి మంత్రిని చూడలేదన్నారు. ఎప్పుడైనా ఫోన్ చేసినా స్పందిస్తారని, పనిలో ఉండి ఫోన్ ఎత్తలేకపోయినా తిరిగి కాల్ చేసి మాట్లాడతారని తెలిపారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి జరిగితే అభినందించాల్సిందేనని స్పష్టం చేశారు. ఏ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఓపికగా విని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యే వరకు నిరంతరం ఫాలోఅప్ చేస్తారని అభినందించారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావును ఆదర్శంగా తీసుకోవాలని సభ్యులు సూచించారు.

# జర్నలిస్టుల ఆరోగ్య పథకం హామీ నెరవేర్చండి






### టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ

**ఆదిలాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా, ఎన్నికల మేనిఫెస్టోలో జర్నలిస్టులకు ఇచ్చిన ఆరోగ్య పథకం హామీని ఇంతవరకు నెరవేర్చకపోవడం విచారకరమని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు ఆరోగ్య పథకాన్ని అమలు చేసి, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ కోరారు. బుధవారం నాడు ఆదిలాబాద్ పట్టణంలోని తరంగిణి ఫంక్షన్ హాలులో జరిగిన, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ఆదిలాబాద్ జిల్లా మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో ఎనిమిదేళ్లుగా జేహెచ్ఎస్ పథకం అమలుకాకపోవడంతో అనారోగ్యాలకు గురవుతున్న జర్నలిస్టులు చికిత్స కోసం పడుతున్న తిప్పలు వర్ణనాతీతమని విరాహత్ అలీ ఆందోళన వ్యక్తం చేసారు. కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక, ఇప్పటికే వందల సంఖ్యలో జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయినట్లు ఆయన విచారం వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని తాము పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి ఫలితం మాత్రం లేదన్నారు. ఇప్పటికైనా ఆరోగ్య పథకాన్ని అమలుచేసి జర్నలిస్టుల ప్రాణాలకు భరోసా కల్పించాలని ఆయన కోరారు. జర్నలిజం వృత్తి పట్ల సమాజంలో విశ్వాసం సన్నగిల్లుతున్న నేటి పరిస్థితుల్లో, పవిత్రమైన మీడియా వృత్తికి పూర్వ వైభవం దక్కించేందుకు గాను నైతిక విలువలతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐజెయు జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల రవీందర్, ప్రకాష్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం నాయకుడు హన్మంత్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, కార్యదర్శి దేవేందర్ లతో పాటు జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న దాదాపు 200 మంది జర్నలిస్టులు హాజరయ్యారు. అనంతరం ఆదిలాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## 22ఎపై వాయిదా తీర్మానం తిరస్కరణ

### శాసనమండలి నుంచి బిఆర్ఎస్ సభ్యుల వాకౌట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనమండలిలో బిఆర్ఎస్ సభ్యుల ఆందోళన పరంపర గురువారం కూడా కొనసాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడికి చెందిన టెస్సరాక్ట్ కంపెనీకి భూముల కేటాయింపుపై, 22ఎపై చర్చ జరపాలని ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని శాసనమండలి చైర్మన్ తిరస్కరించడంతో బిఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. సభ ఉదయం సమావేశం కాగానే బిఆర్ఎస్ సభ్యులపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదన చారి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని కోరారు. ప్రశ్నోత్తరాల సమయం అనంతరం వాటిపై చర్చిద్దామని చైర్మన్ తెలుపగా, ఈ అంశంపై వెంటనే చర్చ జరపాలని బిఆర్ఎస్ సభ్యులు కోరుతూ వెల్‌లోకి దూసుకొచ్చి కాగితాలు చింపివేసి నిరసన తెలిపారు. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్ వద్దకి వెళ్లడానికి ప్రయత్నించగా మార్షల్స్ ఆయనను అడ్డుకున్నారు. బిఆర్ఎస్ సభ్యుల ఆందోళన నడుమ చైర్మన్ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడికి చెందిన కంపెనీ 'టెస్సరాక్ట్ కంపెనీ'కి కేటాయించిన భూములపై చర్చించాలని మధుసూదనచారి ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని చైర్మన్ తిరస్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన చారి మాట్లాడుతూ శాసనమండలి నడుస్తున్నది సభ్యుల కోసమా? లేక మార్షల్స్ కోసమా అని చైర్మన్‌ను ప్రశ్నించారు. సభ్యులను మార్షల్స్ అడ్డుకొవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడికి చెందిన టెస్సరాక్ట్ కంపెనీకి భూముల కేటాయింపుపై, 22ఎపై చర్చ జరపాలని చైర్మన్‌ను కోరారు. దీనికి సమ్మతిస్తే సభలో ఉంటామని, లేకపోతే వాక్ ఔట్ చేస్తామని పేర్కొన్నారు. దీనికి చైర్మన్ అనుమతించకపోవడంతో బిఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సర్కిల్-23 & సర్కిల్-24
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- |
| 42/EE-23 & 24/RJRNZ/ GHMC/2026-27 | (07) నెం.ల పనులు | రూ. 53.30 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.09.2026 సా.5.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 16.09.2026 సా.5.00గం.ల వరకు | శ్రీ బి.నరేందర్ గౌడ్, ఇఇ, సర్కిల్-23 & 24, ఆర్‌జెఆర్ఎన్‌జెడ్, జిహెచ్ఎంసి, పూల్‌బాగ్, హైదరాబాద్. ఫోన్ నెం. 9989930608 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-23, చాంద్రాయణగుట్ట & సర్కిల్-24, జంగంమెట్/ఆర్‌జెఆర్ఎన్‌జెడ్/ జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 9746-PP/CL/ADVT/2026-27, Date: 10-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**
బోడుప్పల్ సర్కిల్-10, ఉప్పల్ జోన్
తేది: 09.09.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- |
| 23/EEC-10/ BUPL/ MMC/ Tenders/ 2026-27, తేది: 09.09. 2026 | ఎంఎంసి, ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్-10 పరిధిలోని బోడుప్పల్ వార్డు నం. 11 మరియు చెంగిచెర్ల వార్డు నం. 12ల లోని వివిధ ప్రాంతాలలో ప్రజల భద్రత కోసం కదిలించగల బారికేడ్లను ఏర్పాటు చేయడం. ఎంఎంసి, ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్-10 పరిధిలోని మేడిపల్లి, వార్డు నం. 9 లోని వివిధ కాలనీలలో, గ్రావెల్ రోడ్లను చదును చేయడానికి మరియు వాటిపై WMM మరియు రాతి ముక్కలను పరచడానికి JCBని వినియోగించడం. ఎంఎంసి, ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్-10 పరిధిలోని పీర్జాదిగూడ, వార్డు నం. 10 లోని వివిధ కాలనీలలో, గ్రావెల్ రోడ్లను చదును చేయడానికి మరియు వాటిపై WMM మరియు రాతి ముక్కలను పరచడానికి JCBని వినియోగించడం. | రూ. 7.70 లక్షలు | 15.09.2026 @ 12:30 PM | శ్రీ కె.రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.Tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, ఎంఎంసి.
DIPR R.O. No. : 9713-PP/CL/ADVT/2026-27, Date: 10-09-2026

## 11 నుంచి 17 వరకు తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

గుండ్రాంపల్లిలో ప్రారంభం: సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/నల్లగొండ:** భూమి కోసం,భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పేదలు, రైతులు, కూలీలు దొరలు, భూస్వాముల అరాచకాలకు, గడీల పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారని ఆయన తెలిపారు. ఈ పోరాట ఫలితంగా భూమిలేని నిరుపేదలకు సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. వేలాది గ్రామాలకు విముక్తి కల్పించిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు,మండల కేంద్రాల్లో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించాలని,వారి త్యాగాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.నల్లగొండ జిల్లాలో తెలంగాణ సాయుధ పోరాటానికి కీలక కేంద్రంగా ఉన్న గుండ్రాంపల్లిలో వార్షికోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.అలాగే 17న హైదరాబాద్‌లో తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాల ముగింపు సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## 27న పూర్వ విద్యార్థుల సంఘం వార్షికోత్సవం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా పరిషత్ మల్టీపర్పస్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం 8వ వార్షికోత్సవాన్ని ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు గుంటగండ్ల దామోదర్ రెడ్డి తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జడ్‌పిఎంపి హైస్కూల్ సూర్యాపేటలో చదివిన ప్రతి ఒక్క విద్యార్థి సంఘంలో సభ్యులుగా చేరవచ్చన్నారు. ఇప్పటికే 1964కు ముందు చదివిన సీనియర్లు సైతం సంఘంలో చేరినట్లు వివరించారు. సభ్యత్వాల కోసం 9290518520ను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి తాటి చంద్రశేఖర్, డాక్టర్ వేణుధర్, డాక్టర్ విద్యాసాగర్, శ్రీరాములు, డాక్టర్ పటేల్ నర్సింహారెడ్డి, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## స్వామి జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** సిపిఐ పట్టణ కౌన్సిల్ సభ్యులు కుడితొట్టి స్వామి జీవితం భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తుందని సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవలే గుండెపోటుతో మృతి చెందిన సిపిఐ పట్టణ కౌన్సిల్ సభ్యులు కుడితొట్టి స్వామి కుటుంబాన్ని పలువురు కార్యకర్తలతో కలిసి ఆయన గురువారం పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు ప్రజల పక్షాన పోరాటం నిర్వహించారన్నారు. స్వామి గతంలో పిఏసిఎస్ డైరెక్టర్‌గా పనిచేసి రైతులకు ఎంతో అండగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, పట్టణ కార్యవర్గ సభ్యులు జడ వెంకన్న, సత్యవతి, విష్ణు పాల్గొన్నారు.

## 12న జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/అర్వపల్లి :** రాష్ట్ర న్యాయ సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 12న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ పి. మధు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులు, పెండింగ్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, చిన్నపాటి వివాదాలు, ఇతర రాజీ చేయదగిన కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. స్టేషన్ పరిధిలోని ప్రజలు తమపై ఉన్న పెండింగ్ కేసులు లేదా రాజీ చేసుకునే అవకాశం ఉన్న కేసులకు సంబంధించి సంబంధిత పోలీసు అధికారులు, న్యాయ సేవా సంస్థలు అధికారులను సంప్రదించాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల అంగీకారంతో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు సుదీర్ఘ న్యాయ ప్రక్రియకు ముగింపు పలికే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### 12న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా పరిధిలోని అన్ని కోర్టులలో ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.హిమబిందు తెలిపారు.తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి,రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార కమిటీల ఆధ్వర్యంలో నల్గొండ, మిర్యాలగూడ, నకిరేకల్,దేవరకొండ,నిడమానూరు కోర్టులలో లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కక్షిదారులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పెండింగ్ కేసులు,వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని కోరారు.

## భగీరథ నీటి సరఫరా క్షేత్రస్థాయిలో తనిఖీ



**ప్రజాపక్షం/నడిగూడెం :** మండలంలోని ఈకెపేట తండలో మంచినీటి సరఫరా వ్యవస్థను మిషన్ భగీరథ క్వాలిటి కంట్రోల్ ఏఈఈ మణికంత, ఏఈఈ సతీష్, మిషన్ భగీరథ ఇంట్రా డిఈ దేవాబిక్షం, మిషన్ భగీరథ గ్రిడ్ డిఈ అభినయ్ పరిశీలించారు. నీటి సరఫరా పరిస్థితిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడంతోపాటు, నీటి నాణ్యతను పరిశీలించేందుకు నమూనాలను సేకరించి మిషన్ భగీరథ ల్యాబ్‌లో పరీక్షించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి రాంబాబు, మిషన్ భగీరథ ల్యాబ్ సిబ్బంది బాలకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గణేష్ నవరాత్రి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పి నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్‌లతో కలిసి సంబంధిత అధికారులు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో నిమజ్జన ఏర్పాట్లపై సమీక్షించారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఘనంగా జరిగేలా ముంద స్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తు తం ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యత తక్కువగా ఉందని, గతేడాది సూర్యాపేట పరిధిలోనే వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగిన నేపథ్యంలో ఈ ఏడాది నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రస్తుతం అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో లేనందున నిమజ్జనంకు భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అనువైన ప్రాంతం లో ప్రశాంతంగా నిమజ్జనం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు, పోలీస్, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి నిమజ్జన పాయింట్ల వద్ద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, ఆర్‌డిఓలు, మున్సిపల్ కమీషనర్లు, ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

**వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ముందుకు సాగాలి**

పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, పోరాట పటిమ తరతరాలకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూస్వామ్య వ్యవస్థకు, అణిచివేతలకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఆ స్ఫూర్తితో సమాజ పురోగతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలు ఎల్లప్పుడూ చైతన్యవంతంగా ఉంటారని, జిల్లాలోని ప్రతి ఒక్కరి సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని అధికారులు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ చూపిన తెగువ, పోరాట స్ఫూర్తి నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, విఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, బిసి వెల్ఫేర్ అధికారి విశాల్, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, బొమ్మగాని శ్రీనివాస్, కృష్ణమ్ పాల్గొన్నారు.






## వీరనారి చాకలి ఐలమ్మ

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి కె. నరసింహ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ధైర్య సాహసాలకు, పట్టుదలకు, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. అన్యాయానికి, అణిచివేతకు వ్యతిరేకంగా ఆమె చేసిన పోరాటం చరిత్రలో ఆమెను వీరనారిగా నిలిచిపోయేటట్లు చేసిందన్నారు. ఆమె త్యాగాలను, సేవలను స్మరించుకోవడం మనందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిఐ చరమందరాజు, ఆర్‌ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్‌ఎస్‌ఐలు సాయిరాం, అన్వర్ పాల్గొన్నారు.

# విబి జి రామ్ జి కింద గ్రామాభివృద్ధి పనులే చేపట్టాలి

నల్లగొండ కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** విబి జి రామ్ జి కింద గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులనే చేపట్టాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఉదయాదిత్య భవన్‌లో విబి జి రమ్ జి పనులపై ఎంపీడీఓలు,ఎంపీఓలు,ఏపీవోలు,పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.గ్రామానికి ఎక్కువ నిధులు వచ్చేందుకు సగటు రోజు వేతనం పెంచాలని,ఇందుకు పనుల్లో పాల్గొనే వారి సంఖ్యను పెంచాలన్నారు. ముందే రూపొందించిన సమగ్ర గ్రామ పంచాయతీ ప్రణాళికను గ్రామసభలో చర్చించి అవసరమైన పనులను చేర్చాలని సూచించారు.అన్ని పాఠశాలల్లో టాయిలెట్లు,తాగునీరు,కిచెన్ షెడ్లు,అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్,లాబరేటరీలు యుద్ధ ప్రాతిపదికన మంజూరు చేసి పూర్తి చేయాలని, దీన్ని ఛాలెంజ్‌గా తీసుకోవాలన్నారు.చెరువుల వద్ద మత్స్యకారుల సహకార సంఘాలకు సమాచారం ఇచ్చి చేపల పెంపకం ద్వారా వారి జీవనోపాధి పెంచాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో జూన్ వరకు వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున నీటి సంరక్షణ పనులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని,కమ్యూనిటీ సోక్ పిట్లు, మ్యాజిక్ సోక్ పిట్లకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి,శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి, డీపీఓ తరుణ్ చక్రవర్తి, డీఎఫ్ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్బిరెడ్డిగూడెం మేజర్‌కు గండి

గరిడేపల్లి చెరువుకు మొండిచేయి



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గరిడేపల్లిలోని చెరువు నిండకపోతే రానున్న రోజుల్లో గరిడేపల్లి గ్రామంతో తాగునీటి ఎద్దడి తలెత్తె అవకాశం ఉంది. మండలంలోని మిగిలిన గ్రామాలలో చెరువులు ఎండిపోతే ఇదే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇంటీవల సాగర్ ఎడమకాలువకు తాగునీటి అవసరాల కోసం చెరువులు నింపడం కోసం అధికార యంత్రాంగం ప్రభుత్వం నీటిని విడుదల చేసింది. దీంతో అన్ని మేజర్, మైనర్ కాలువలకు తాగునీటి అవసరాల కోసం నీటిని వదిలారు. కాని కొంతమంది గండికొట్టడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత ఇరిగేషన్ అధికారులు పరిస్థితిని గమనించి అవసరమైన చర్యలు తీసుకుని చెరువులకు ఫీడర్ చానల్ ఉన్న వాటికే నీటిని వదిలితే నేరుగా చెరువులు నిండే అవకాశం ఉంటుంది. తద్వారా ఆ గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగి తాగునీటి ఇబ్బందులు రాకుండాచూసుకునే పరిస్థితి ఉంటుంది. సంబంధిత ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి మేజర్ మైనర్ కాలువలకు పెట్టిన గండ్లను వెంటనే మరమ్మతులు చేసి పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీంతో పాటు అబ్బిరెడ్డిగూడెం మేజర్ కాలువకు పెట్టిన గండిని ఇరిగేషన్ అధికారులు వెంటనే పూడ్చివేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో నీటి అవసరం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల మద్య రైతుల మద్య ప్రజల మద్య వివదాలు తలెత్తే ఘర్షణలు అయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.

## ట్రాన్స్‌జెండర్లు చట్టాలను గౌరవించాలి: డిఎస్‌పి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ట్రాన్స్‌జెండర్లు బలవంతపు వసూళ్లు చేస్తూ ప్రజలను వేధింపులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని నల్లగొండ డిఎస్‌పి కె.శివరాం రెడ్డి హెచ్చరించారు. పట్టణ పరిధిలోని ట్రాన్స్‌జెండర్లతో గురువారం నల్లగొండలో ప్రత్యేక అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా గౌరవప్రదంగా జీవించాలని సూచించారు.వ్యాపార సంస్థలు, దుకాణాలు,ఇళ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్, పండుగలు, శుభకార్యాలు తదితర సందర్భాలలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ బలవంతంగా డబ్బులు డిమాండ్ చేయడం లేదా వసూలు చేయడం చేయరాదని స్పష్టం చేశారు. ఎవరైనా స్వచ్ఛందంగా అందించే సహాయాన్ని మాత్రమే స్వీకరించాలని, డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం,బెదిరించడం,అసభ్యకరంగా ప్రవర్తించడం, ప్రజలను వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. అదే సమయంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలు,ఇబ్బందులు,వేధింపులు లేదా ఇతర చట్టపరమైన సమస్యలు ఉంటే భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో సిఐలు ఆదిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదాబాబు, షరీఫ్‌తో పాటు జిల్లాలోని పలువురు ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.



## గుప్త నిధుల పేరుతో జరిగే మోసాలను ప్రజలు నమ్మొద్దు

**ప్రజాపక్షం/చివ్వెంల :** ప్రజలు గుప్త నిధుల పేరుతో జరిగే మోసాలను నమ్మవద్దని సూర్యాపేట రూరల్ సిఐ జి. రాజశేఖర్ తెలిపారు. ఉండ్రుగొండ గ్రామంలోని శ్రీలక్ష్మి నృసింహ స్వామి పురాతన ఆలయాల పరిసర ప్రాంతాల్లో గుప్త నిధుల కోసం అక్రమంగా తవ్వకాలు చేస్తున్న వారిని అరెస్టు చేసినట్లు ఆయన మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. చివ్వెంల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉండ్రుగొండ గ్రామంలోని పురాతన ఆలయాల పరిసర ప్రాంతాల్లో కొంతమంది అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం రావడంతో కేశరాజుకుంట కట్ట వద్ద అనుమానాస్పదంగా తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను గుర్తించారు. వారి వద్ద నుంచి గుప్త నిధుల కోసం వాడుతున్న మెటల్ డిటెక్టర్, స్కానర్, లొకేటర్ తదితర అధునాతన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఉండ్రుగొండ లక్ష్మి నృసింహ స్వామి దేవాలయం చైర్మన్ చకిలం కృష్ణ కుమార్ ఫిర్యాదు మేరకు నిందితులు పచ్చిపాల మధు, యల్లాల శ్రీకాంత్, భూతరాజు శివ, నకిరేకంటి గోపి, చర్లపల్లి ప్రణయ్‌కుమార్, రాపాని తిరుపయ్య, కడారి సైదులు, భూక్యా తులశ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించినట్లు తెలిపారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ వి. మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారి 65పై లారీ బీభత్సం

**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** జాతీయ రహదారి 65పై లారీ బీభత్సం సృష్టించింది. బ్రేక్‌లు ఫెయిల్ కావడంతో అదుపుతప్పిన ఓ లారీ రోడ్డు పక్కన భోజనం చేసేందుకు నిలిపి ఉంచిన రెండు లారీలను బలంగా ఢీకొట్టింది. అనంతరం అదుపు తప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటన మండలంలోని దుర్గాపురం స్టేజీ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం డక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడుతో విజయనగరం వైపు వెళ్తున్న లారీ దుర్గాపురం స్టేజ్ వద్దకు చేరుకోగానే ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ కావడంతో డ్రైవర్ లారీని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించినప్పటికి సాధ్యం కాలేదు. వేగంగా దూసుకొచ్చిన లారీ రోడ్డు పక్కన భోజనం చేసేందుకు నిలిపి ఉంచిన రెండు లారీలను వరుసగా బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న దాటికి ఆగి ఉన్న లారీలకు భారీగా నష్టం వాటిల్లింది. అనంతరం ప్రమాదానికి కారణమైన లారీ అదుపుతప్పి రహదారిపై బోల్తా పడింది. ప్రమాద సమయంలో లారీల్లో ఎవరూ లేకపోవడం, డ్రైవర్లు భోజనం కోసం బయటకు వెళ్లి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికి గాయలు కాకపోవడంతో స్థానికులు, వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు, వాహనాల నష్టంపై వివరాలు సేకరిస్తున్నారు. బ్రేకులు ఫెయిల్ కావడమే ప్రమాదానికి ప్రధాన కారణంగా ప్రాథమికంగా తెలుస్తోంది.



## 11 నెలలుగా జీతాలు లేక విలవిల

**ప్రజాపక్షం/నందికొండ:** స్థానిక కమలా నెహ్రూ ఆసుపత్రిలోని ఆరోగ్యశ్రీ విభాగంలో అభయ మేన్‌పవర్ సప్లయర్స్ ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి 11 నెలలుగా వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలల తరబడి జీతాలు అందక కుటుంబ పోషణ,రోజువారీ ఖర్చులు నిర్వహించడం కష్టంగా మారిందని వారు తెలిపారు.తమ సమస్యను సంబంధిత సంస్థతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని బకాయి వేతనాల కోసం ఎదురుచూస్తూనే విధులు నిర్వహిస్తున్నామని, అయినప్పటికీ తమ సమస్యపై స్పష్టమైన హామీ గానీ,పరిష్కారం గానీ లభించలేదని వారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.11 నెలలుగా వేతనాలు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాలని,బకాయి వేతనాలను వెంటనే చెల్లించి తమకు న్యాయం చేయాలని ఆరోగ్యశ్రీ సిబ్బంది కోరుతున్నారు.

## ప్రతీ విద్యార్థి తెలుగు, ఆంగ్ల భాషలను ధారాళంగా చదవాలి

డిఇఓ పి.సుసింధర్ రావు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం డిఇఓ పి.సుసింధర్ రావు ఆకస్మికంగా సందర్శించారు. సందర్శనలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. అనంతరం గణితం, తెలుగు, ఆంగ్లం విషయాలకు సంబంధించి నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, విద్యార్థుల ప్రగతి నివేదికలపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థికి తెలుగు, ఆంగ్ల భాషలను ధారాళంగా చదవడం,రాయడంతో పాటు ప్రాథమిక గణిత ప్రక్రియలు స్పష్టంగా వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలలోని ఏ ఒక్క తరగతిలోనూ చదవడం, రాయడం రాని విద్యార్థి ఉండకూడదని ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా పాఠశాల ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలను సందర్శించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మేక నాగయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోదాటి రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 45వ సెషన్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న ఎంజియు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** దక్షిణ భారత చారిత్రక విశిష్టతను వెలికి తీసే లక్ష్యంతో స్థాపించిన సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ 45వ సెషన్‌కు మహాత్మా గాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) ఆతిథ్యం ఇవ్వనుందని ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు.గురువారం ఎంజీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నవంబర్ 13 నుంచి 15 వరకు ఈ చారిత్రక సదస్సు జరుగుతుందని, దక్షిణ భారతదేశం నుంచి చరిత్రకారులు,అధ్యాపకులు తమ పరిశోధన పత్రాలు సమర్పిస్తారని,ఈ ప్రతిష్టాత్మక సెషన్ నిర్వహణ ద్వారా ఎంజీయూ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయని,తెలంగాణ చారిత్రక విశేషాలను ఈ వేదిక ద్వారా చాటే గొప్ప అవకాశం లభించిందని తెలిపారు.ప్రతి విభాగం నుంచి చారిత్రక అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించడం ద్వారా అర్థవంతమైన చర్చ జరుగుతుందని,ఈ కార్యక్రమాన్ని అన్ని విభాగాలు కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చరిత్ర విభాగం బీఓఎస్ ఆచార్య విజయబాబు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 1200 మందికి పైగా చరిత్రకారులు ఈ మేధో మథనానికి హాజరవుతారని తెలిపారు. అనంతరం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణప్రియ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వసంత,ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరీష్ కుమార్,మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదల ఇంటి కల సాకారం



**ప్రజాపక్షం/మాగనూర్ :** పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మాగనూరు మండల కేంద్రానికి చెందిన బ్యాగరి చిన్న అంజప్ప నూతన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు. గురువారం ఈ నూతన గృహాన్ని కాంగ్రెస్ పార్టీ మాగనూరు మండల అధ్యక్షులు శివరాం రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, సీనియర్ నాయకులు ముష్టి లక్ష్మయ్య, వాకిటి శ్రీనివాసులు, ఉజ్జలి కృష్ణయ్య పాల్గొన్నారు.

## చిరకాల స్వప్నం సాకారం

**ప్రజాపక్షం/కృష్ణ :** కృష్ణ మండలంలోని గుర్జాల్ గ్రామ ప్రజల చిరకాల స్వప్నమైన రోడ్డు సౌకర్యం మంత్రి వాకిటి శ్రీహరి ఎన్నికల హామీలో భాగంగా సాకారం అవుతోందని కృష్ణ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో గుర్జాల్ గ్రామం నుంచి కృష్ణ రైల్వే బ్రిడ్జి వరకు మొత్తం రూ.2.45 కోట్ల వ్యయంతో చేపట్టిన రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటికే 1 కిలోమీటర్ సిసి రోడ్డు పనులు పూర్తయ్యాయన్నారు. మరో 1 కిలోమీటర్ బిటి రోడ్డు పనులను గురువారం పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజప్ప గౌడ్, గుర్జాల్ సర్పంచు కమలమ్మ, సంతోష్ పాటిల్, ఉపసర్పంచు షఫీ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు అన్వర్, సంతోష్ శెట్టి, కృష్ణ సర్పంచు నాగేంద్ర, కాంగ్రెస్ నాయకులు రాకేష్, పల్లె సురేష్, జవహర్లాల్, ఆసిఫ్, సిద్రామ్, కీరప్ప గౌడ, చన్ను, మాజీ ఎంపిటిసి నాగప్ప, తిమన్న, తిమప్ప, శంకర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## యోగా టీచర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోండి

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ ఆదర్శ పాఠశాలలో పార్ట్ టైం యోగా టీచర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వైశాలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాలో ప్రావీణ్యం ఉండి, యోగా సర్టిఫికెట్ పొందిన నిరుద్యోగ యువకులు పార్ట్ టైం యోగా టీచర్‌కు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 15న ఇంటర్వ్యూకు సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల పనివేళలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.



## రైతులకు 24 గంటల కరెంటు సరఫరా కోసం ధర్నా

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట్ బిజెపి జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మక్తల్ మండలం జక్లేర్ సబ్ స్టేషన్ మరి నేషనల్ హైవే 167 రోడ్డు రాస్తారోకో చేయడం జరిగింది. రైతులకు 24 గంటల కరెంటు సప్లై చేయాలని త్రిపేస్ నారాయణపేట్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని పంటలు వేసి న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని పంట రుణాలను మాఫీ చేయాలని ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు గోవర్ధన్ గౌడ్ బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి ఉపాధ్యక్షులు కర్ణస్వామి యువ మోర్చా నాయకులు భరత్ కుమార్ జిల్లా కిసాన్ మెర్చా ప్రధాన కార్యదర్శి దుబ్బల హనుమంతు మండలాల మోర్చా అధ్యక్షులు బిజెపి కార్యకర్తలు రైతులుపాల్గొన్నారు.

## ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : యువకుడు మృతి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై జె.నరేష్ కథన ప్రకారం బొల్లారం గ్రామానికి చెందిన హనుమంతు పార్వతమ్మల కుమారుడు శివశంకర్ (19) రాత్రి సుమారు 8 గంటల సమయంలో కిరాణా సరుకులు తీసుకురావడానికి ద్విచక్ర వాహనంపై గ్రామంలోని కొర్లకుంట రోడ్డు లోని దుకాణం వద్దకు వెళ్తున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన కృష్ణ ప్రసాద్ తన ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తుండగా, రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివశంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో రోడ్డుపైనే పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో శివశంకర్‌ను వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండటంతో మరింత మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే శివశంకర్ మృతి చెందినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. యువకుడి మృతితో బొల్లారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడిగా ఎండి అఫ్రోజ్ ఎంపిక



**ప్రజాపక్షం/మక్తల్ :** ఎన్‌ఎస్ యూఐ నారాయణపేట్ జిల్లా అధ్యక్షుడిగా మక్తల్ పట్టణానికి చెందిన ఎండి అఫ్రోజ్ ఎంపికయ్యారు. యూత్ కాంగ్రెస్ లో కీలకంగా పనిచేస్తున్న అప్రోజ్ సేవలను సేవలను మరింత విస్తారంగా వాడుకునేందుకు మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు అఫ్రోజ్‌ను ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షునిగా నియమించారు. ఈ సందర్భంగా అప్రోజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏకంగా జిల్లా అధ్యక్షునిగా తనను ఎంపిక చేసినందుకు మంత్రి వాకిటి శ్రీహరి తో పాటు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మరింత విస్తారంగా కాంగ్రెస్ పార్టీలో తన సేవలు అందిస్తానని, పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు నాయకులు వార్డ్ కౌన్సిలర్లు అఫ్రోజ్ ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు పెరగాలి





**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించి, ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక సూచించారు. గురువారం నారాయణపేట్ ప్రభుత్వ వైద్యశాలలో వైద్య డాక్టర్ వినీత్‌తో కలిసి సేవాభారతి పాలమూరు ఆధ్వర్యంలో ఉచిత వినికిడి పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒపి సంఖ్య పెరుగుతోందని, నార్మల్ డెలివరీలు కూడా బాగా జరుగుతున్నాయని తెలిపారు.

ఆసుపత్రిని 100 శాతం అత్యుత్తమ వైద్య కళాశాలగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు. రోగులను వైద్యులు, సిబ్బంది ఆప్యాయంగా చూసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి మంగళవారం డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఆరోగ్యం మహిళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

**డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి**

ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజారోగ్య కార్యక్రమాలకు పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

సేవాభారతి పాలమూరు అధ్యక్షుడు రాందేవ్ మాట్లాడుతూ సంస్థ 1981లో రిజిస్ట్రేషన్ అయిందని, ప్రస్తుతం సుమారు 3 వేల మంది వాలంటీర్లు సేవలందిస్తున్నారని తెలిపారు. 1990 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనాథ పిల్లల కోసం ప్రత్యేక కేంద్రాలను నిర్వహిస్తూ సుమారు 300 మంది పిల్లలకు సేవలు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ ఏడు మంది అర్హులైన లబ్ధిదారులకు ఉచిత వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్, వైద్యులు, వైద్య సిబ్బంది, సేవాభారతి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**నర్సింగ్ కళాశాల పనులు పది రోజుల్లో పూర్తి చేయాలి**

నర్సింగ్ కళాశాల, హాస్టల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి పది రోజుల్లో భవనాలను అప్పగించాలని కలెక్టర్ సి.హెచ్.ప్రియాంక అధికారులను ఆదేశించారు. గురువారం నారాయణపేట్‌లోని నర్సింగ్ కళాశాల, హాస్టల్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని వివిధ విభాగాలను పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి పది రోజుల్లోగా అన్ని పనులు పూర్తి చేసి భవనాలను సంబంధిత అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలి

### కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.చెన్నయ్యతో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం గడువు పొడిగించినందున రాజకీయ పార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు అక్టోబర్ 7 వరకు అవకాశం ఉందని, తుది ఓటర్ల జాబితాను నవంబర్ 9న ప్రచురించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,15,824 నోటీసులు జారీ చేయగా, 329 నోటీసులు మాత్రమే పెండింగులో ఉన్నాయని చెప్పారు. హియరింగ్‌కు హాజరు కావాల్సిన 47,236 మందిలో సుమారు 40 శాతం మందికి విచారణ పూర్తయిందన్నారు. విచారణకు హాజరు కాని సుమారు 25 వేల మందికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదీలోగా అన్ని హియరింగ్‌లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు, కాంగ్రెస్, బిజెపి, బిఎస్పీ, బిఆర్ఎస్, టిడిపి, వైఎస్సార్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి చిట్యాల ఐలమ్మకు ఘన నివాళి







**పజాపక్షం/దామరగిద్ద :** దామరగిద్ద మండలంలోని ముస్తాపేట సిపిఐ(ఎం) గ్రామ శాఖ ఆధ్వర్యంలో వీరనారి ఐలమ్మ 41వ వర్ధంతిని గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) మండల కార్యదర్శి అంజిలయ్య గౌడ్ మాట్లాడుతూ కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం దొరల, భూస్వాములు, పటేల్, పట్వారిలా ఆగడాలను అరికట్టాలని ఎర్రజెండా నీడలో అనేక ప్రజా పోరాటాలు నిర్వహించడంలో ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి మల్లు స్వరాజ్యం నాయకత్వంలో పనిచేశారని తుది శ్వాస స్వరాజ్యం నాయకత్వంలో పనిచేశారని, తుది శ్వాస విడిచే వరకు ఎర్రజెండా నీడలో నిలబడిన త్యాగశీలి అని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 10 నుండి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి మహిందర్, నాయకులు లాలప్ప, గోవిందు, శర్ణప్ప, సిద్దప్ప, సాయి తదితరులు పాల్గొన్నారు.

**ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో 41వ వర్ధంతి సందర్భంగా శ్రీ వెంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, గడీల పాలనకు, దొరల అహంకారానికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ భూస్వామ్య దోపిడీకి, నిరంకుశత్వానికి ఎదురొడ్డి నిలిచి, పేదలు, బలహీన వర్గాల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన కొనియాడారు. అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం పోరాడే సంకల్పం, సమాజ శ్రేయస్సు కోసం నిలబడే నిబద్ధత మనందరిలో ఉండాలని చాకలి ఐలమ్మ, జీవితం మనకు చాటి చెబుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పటేల్ నరసింహులు, బాలకృష్ణయ్య, వెంకట్‌రాములు, ప్రకాశ్ దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చిట్యాల ఐలమ్మ అగ్నికణమై పోరాడి భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి పంటను రక్షించుకున్నారని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్ అన్నారు. గురువారం సిపిఐ నాగర్‌కర్నూల్ టౌన్ సమితి ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డు కాలనీ బస్టాండ్ సమీపంలోని ఐలమ్మ విగ్రహం వద్ద ఆమె వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కోట్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఐలమ్మ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుల త్యాగాల ఫలితంగా పేదలకు భూములు దక్కాయని నాయకులు పేర్కొన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జరిగే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ టౌన్ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముంకేశ్వరం శ్రీనివాసులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం

### సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో...

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండల కేంద్రంలోని కామ్రేడ్ నరసింహ భవనంలో సిపిఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి బాల్‌రెడ్డి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం దొరల గడీలపై తిరగబడిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తెలంగాణ ప్రజలను సమీకరించి, నిజాం ప్రభుత్వంపై, ఆనాటి దొరలపై పోరాటం సాగించిన ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత, గ్రామ శాఖ కార్యదర్శులు జక్కుల ఆశన్న, నక్క ఈశ్వర్, నాయకులు మధుగని రామకృష్ణ, జెట్టి నవీన్, శరత్, మిద్దె శ్రీను పాల్గొన్నారు.



## భూ స్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ పోరాటం : కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** భూమి కోసం, భుక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే ఆమెకు నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ వద్ద బిసి అభివృద్ధి శాఖ అధ్వర్యంలో ఆమె చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు, రజక సంఘం నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1940వ దశకంలో తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్య సాహసాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తినిస్తాయన్నారు. అప్పుడు పోరాటం చేసిన వారిలో ఐలమ్మ లాంటి చాలా కొద్ది మంది మహిళలు ఉన్నప్పటికీ ఆర్మీ లాంటి గేరిల్ల దళాలను ఏర్పాటు చేసి దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పని చేశారన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ ఐలమ్మ ఘనతలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా, బీసీ, రజక సంఘాల నేతలు, పలువురు జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు , టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో నిర్వహించిన జాబ్ డ్రైవ్ ఇంటర్వ్యూలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ నుంచి 11 మంది, కల్వకుర్తి నుంచి 7 మంది, ఆమనగల్ నుంచి 16 మంది, తలకొండపల్లి నుంచి ఒకరు చొప్పున మొత్తం 35 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ యువతకు అందుబాటులోకి వచ్చే ప్రతి ఉద్యోగ, ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హత, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర, మహేష్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

## ఆడవి పందిని ఢీకొని ద్విచక్ర వాహనం బోల్తా

### దంపతులకు స్వల్ప గాయాలు
### సకాలంలో స్పందించిన 108 సిబ్బంది

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ఆడవి పంది ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో దంపతులు గాయపడిన ఘటన నర్వ మండలం, తీపురస్పల్లి సమీపంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. యాంకి గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి పల్లెప్ప భార్యతో కలిసి ఉట్కూర్ సంతకు వెళ్తుండగా రోడ్డుపైకి వచ్చిన ఆడవి పంది వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది కేవలం ఐదు నిమిషాల్లో ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. పల్లెప్పకు తల, ఎడమ చేతికి గాయాలు కావడంతో రక్తస్రావాన్ని అరికట్టి అవసరమైన ప్రథమ చికిత్స అనంతరం నారాయణపేట్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి దంపతులిద్దరూ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. సకాలంలో స్పందించి సేవలందించిన 108 సిబ్బంది ఇఎంటి రాజ్ కుమార్, పైలట్ అనిల్‌ను వైద్యుల అభినందించారు.



## నల్లకుంటలో బోరుకు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కల్వరాల గ్రామంలోని నల్లకుంట తాగునీటి బోరు మోటార్‌కు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నూతనంగా మంజూరైన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ బండారు రాముడు ప్రారంభించారు. ఈ సమస్యను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సహకారంతో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైనట్లు తెలిపారు. ఇందుకు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ తరపున మంత్రి జూపల్లి కృష్ణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, మండల సీనియర్ నాయకులు చక్ర వెంకటేష్, పెంటయ్య, వార్డు సభ్యులు సుధాకర్, శ్రీకాంత్, మధు, అఖిల్, రాజయ్య, స్వాములు, ఆంజనేయులు, దయాకర్, మధుగని బాలరాజు, మధుగని రమేష్, గ్రామ పంచాయతీ లైన్‌మెన్ మాధవరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## మక్తల్‌లో వ్యభిచార కార్యకలాపాలపై పోలీసులు దాడి

### మక్తల్ ఎస్ఐ రాజు

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలోని నారాయణ పేట్ రోడ్డులో మహీంద్రా షోరూమ్ సమీపంలోని ఎస్‌విఎన్ లాడ్జ్‌లో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్, మక్తల్ పోలీసులు దాడి నిర్వహించారు. మక్తల్ ఎస్సై రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడిలో లాడ్జి నిర్వాహకుడు/యజమాని పి.భాస్కర్‌రెడ్డి, అతని సహాయకులు వులిగప్ప, సవాజ్‌తో పాటు 03 మంది పురుష కస్టమర్లు, 07 మంది మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో పోలీసులు 10 మొబైల్ ఫోన్లు, రూ.7,800 నగదు, 02 మోటర్ సైకిళ్లు, ఉపయోగించిన, ఉపయోగించని కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనపై మక్తల్ ఎస్సై రాజు కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అదుపులోకి తీసుకున్న వారికి అవసరమైన కౌన్సెలింగ్ కూడా నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు, ముఖ్యంగా వ్యభిచారం, మాదకద్రవ్యాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పద లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

# అర్హులైన వారికి పథకాలు, రుణాలు అందాలి

## బ్యాంకర్లు, అధికారులకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశం




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సంస్థాగత రుణాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో చేరేలా సంబంధిత శాఖలు, బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. గురువారం రంగారెడ్డి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డిఎం) సుశీల్‌కుమార్ కె.పి. ఆధ్వర్యంలో 2026–27 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డిసిసి) సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధికారులు, బ్యాంకర్లు, నాబార్డ్, ఆర్‌బిఐ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన పేద, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యకు అవకాశం కల్పించే దిశగా విద్యా రుణాల మంజూరుపై బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా సమగ్ర అభివృద్ధి, ఆర్థిక సాధికారత, సమ్మిళిత వృద్ధి సాధనకు అన్ని ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు, సంబంధిత సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

### మట్టి గణపతిని పూజిద్దాం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కలెక్టర్ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో మట్టి వినాయక విగ్రహాలను రంగారెడ్డి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి వెంకటనర్సుతో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మట్టి గణపతిని పూజిద్దాం... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశంతో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. మట్టితో తయారు చేసిన గణనాథులను పూజించేలా ప్రోత్సహించాలని సూచించారు.

### కలెక్టర్‌ను కలిసిన ట్రెసా రాష్ట్ర కార్యవర్గం

తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎల్.రమణరెడ్డి గురువారం క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు, వారి విధుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులు, ఉద్యోగ సంక్షేమానికి సంబంధించిన అంశాలను కలెక్టర్ దృష్టికి ట్రెసా రాష్ట్ర నాయకులు తీసుకెళ్లారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్‌డిఒ పార్థసింహా రెడ్డి, ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మ రాములు, సంయుక్త కార్యదర్శులు బోయిని కృష్ణయ్య, వాణిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, తహసీల్దార్లు ఎండి.అన్వర్, నాగయ్య, టి. సైదులు, డిప్యూటీ తహసీల్దార్లు జంగయ్య, ప్రియాంకతో పాటు ట్రెసా కార్యవర్గ సభ్యులు సరిత, విక్రమ్‌రెడ్డి, పాండు, నవీన్, శ్రీనయ్య, సురేష్, ఉదయ్ పాల్గొన్నారు.





# మధుయాష్కీకి అభినందనల వెల్లువ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌ను గురువారం వారి నివాసంలో కాంగ్రెస్ నాయకులు పుష్పగుచ్ఛలు అందజేసి శాలువలతో అభినందనలు తెలిపారు. ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు మోట రోహిత్, వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ కాల్వ సుజాత, గోట్స్ అండ్ షీప్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ చరణ్ కౌశిక్ యాదవ్, యాదవ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ గజ్జి భాస్కర్ యాదవ్, పృధ్వి చౌదరి,యోగేశ్వర్‌రెడ్డి, లోకేష్ యాదవ్, మేకల వీరన్న యాదవ్, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నోముల కృష్ణ గౌడ్, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, బుడ్డా సత్యనారాయణ, గణేష్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, బాబా యాదవ్, శ్రీనాథ్, రమాకాంత్, కొండోజు శ్రీనివాస్, బాలకృష్ణ యాదవ్, దాము మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



### మధుయాష్కీ గౌడ్‌కు సిఎల్‌పిలో సన్మానం

ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపి మధుయాష్కీగౌడ్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సన్మానించారు. అసెంబ్లీలో జరిగిన సిఎల్‌పి భేటీ అనంతరం మధుయాష్కీ సిఎంను కలిశారు. ఈ సందర్భంగా మధుయాష్కీకి పుష్పగుచ్ఛం అందజేసి సిఎం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిల్ల శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్, సీతక్క, పొన్నం ప్రభాకర్‌గౌడ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు తదితరులు మధుయాష్కీకు అభినందనలు తెలిపారు.

# మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేయడం జరుగుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని 2,6 వార్డులలో రూ.1.55 కోట్లతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేతా పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు ఉషారాణి విజయ్ కుమార్, చాకలి అశోక్, ప్రశాంత్, గణేష్, గోపాల్ రెడ్డి, బొల్లారం వెంకటరెడ్డి, అశోక్ కుమార్, గుండా శేఖర్. మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# రేడియల్ రింగురోడ్డు జంక్షన్‌తో సంకెపల్లిగూడ రైతులకు అన్యాయం



**ప్రజాపక్షం/షాబాద్:** రేడియల్ రింగురోడ్డు జంక్షన్‌తో సంకెపల్లిగూడ గ్రామస్తులకు అన్యాయం జరుగుతుందని గురువారం సంకెపల్లిగూడ గ్రామ రైతులు జాతీయ లింగు రహదారి షాద్‌నగర్‌కంది హైవే పై ధర్నా చేశారు. అనంతరం షాబాద్ తహశీల్దార్ కార్యాలయం ను ముట్టండించారు. సంకేపల్లిగూడ గ్రామ రైతులు, గ్రామ మాజీ ఎంపిటిసి కుమ్మరి చెన్నయ్య మాట్లాడుతూ.. గ్రామంలో రేడియల్ రోడ్డుకు చాల మంది రైతుల భూములు కోల్పోయారని తెలిపారు. ప్రసుత్తం రేడియల్ రింగు రోడ్డు జంక్షన్ కోసం గ్రామాని చెందిన వివిధ రైతుల భూమి సుమారుగా 27 ఎకరాలు జంక్షన్ కోసం తీసుకుంటే గ్రామంలోని భూములు మొత్తం రేడియల్ రోడ్డులో పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వ ఉన్నత శాఖ అధికారులు స్పందించి సంకేపల్లి గూడ గ్రామంలో ఇండ్లను తొలగించకుండ రేడియల్ రింగు రోడ్డు అలాంట్‌మెంట్ చేయాలని వివరించారు. కార్యక్రమంలో సంకెపల్లిగూడ మాజీ సర్పంచ్ దర్శన్, భూ భాధితులు వెంకట్ రెడ్డి, జగదీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వైద్యం వికటించి వ్యక్తి మృతి

## వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** వైద్యుల నిర్లక్ష్యం కారణంగా వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి పట్టణ కేంద్రంలోని శ్రీ ఐరా ఆసుపత్రిలో చోటుచేసుకుంది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా, కంది మండలం, ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన పెంటోల్ల నరేష్ గౌడ్ (40)చాతిలో నొప్పి వస్తుందని బుధవారం ఉదయం ఆసుపత్రికి రాగా వైద్య సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. బాధితుడికి నొప్పి తీవ్రం కావడంతో.. ఆసుపత్రిలో వెంటిలేషన్ లేకపోవడంతో నగరంలోని కాంటినెంటల్ ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. ఆసుపత్రికి చేరుకునే వారికి నరేష్ గౌడ్ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా కాంటినెంటల్ ఆసుపత్రికి వెళ్ళగా నరేష్ గౌడ్ రెండు, మూడు గంటల క్రితమే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో నరేష్ గౌడ్ మృతదేహాన్ని శంకర్ పల్లిలోని శ్రీ ఐర ఆసుపత్రికి తీసుకువచ్చి ఆందోళన నిర్వహించారు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మృతుడికి భార్య శిరీష, కొడుకు మణి దీక్షిత్, కూతురు ప్రణీత ఉన్నారు. వృత్తిరీత్యా నరేష్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శంకర్‌పల్లిపట్టణ కేంద్రంలోని శ్రీఐరా ఆసుపత్రిలో వైద్యం వికటించి మృతి చెందిన బాధితుడు నరేష్‌గౌడ్ కుటుంబానికి ఆసుపత్రి యజమాని లింగారెడ్డి రూ. తొమ్మిది లక్షలు జరిమానా కట్టించారు. 15 రోజుల క్రితం మృతుడు నరేష్‌గౌడ్ ఆసుపత్రిలో వైద్యచికిత్సలు చేసుకున్నాడు. వైద్యులు వైద్య చికిత్సలు అందించిన నిమిత్తం ఆయనకు 15 రోజులపాటు మందులను వాడాలని తెలిపారు. గురువారం ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో శ్రీ ఐర ఆసుపత్రికి రావడం జరిగింది.

# గణేష్ నిమజ్జనానికి 'ట్రాఫిక్' ఏర్పాట్లు

## సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సిపి సన్‌ప్రీత్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గణేష్ నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాఫిక్ నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లను సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజనలు గురువారం పరిశీలించారు. కూకట్‌పల్లిలోని ఐడీఎల్ చెరువును సందర్శించిన ఆయన సంబంధిత అధికారులు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఐడీఎల్ చెరువు ప్రవేశ ద్వారం, రెయిన్‌బో విస్టా టీజంక్షన్, రంగధాముని టెంపుల్ యూటర్న్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఏర్పాట్లను జాయింట్ సిపి పరిశీలించారు. సాధ్యమైనంత వరకు సాధారణ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. భారీ గణేష్ విగ్రహాల తరలింపు సమయంలో అవసరాన్ని బట్టి జేఎన్‌టీయూ, మూసాపేట వైపు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని ఆదేశించారు. ఐడీఎల్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను సైతం ఆయన పరిశీలించారు. మొత్తం 7 క్రేన్లను ఏర్పాటు చేయగా, వాటిలో 20 అడుగులకు పైబడిన విగ్రహాల నిమజ్జనం కోసం రెండు క్రేన్లను ప్రత్యేకంగా కేటాయించినట్లు అధికారులు వివరించారు. హైడ్రా ఆధ్వర్యంలో ఈతగాళ్లను అందుబాటులో ఉంచే ఏర్పాట్లను పరిశీలించిన జాయింట్ సిపి, ఐడీఎల్ చెరువు ప్రవేశ ద్వారం వద్ద జరుగుతున్న పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రెయిన్‌బో విస్టా టీజంక్షన్, రెయిన్‌బో విస్టా ఫేజ్1, మెరీనా స్కైస్ ప్రాంతాలను సందర్శించి స్థానిక నివాసుల ప్రతినిధులతో మాట్లాడారు. గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా వాహనాల రాకపోకలు సాఫీగా, ప్రజలకు సురక్షితంగా జరిగేలా ట్రాఫిక్ పోలీసులు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని జాయింట్ సిపి సన్‌ప్రీత్‌సింగ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ అగర్వాల్, ట్రాఫిక్2 డిసిపి శేషాద్రినిరెడ్డి, ట్రాఫిక్ 2 ఏడిసిపి వీరన్న, ట్రాఫిక్ అడ్మిన్ ఏడిసిపి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం



## సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

### కొత్త సభ్యులను అభినందించిన సిపి డాక్టర్ రమేష్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎస్ ఐ శ్రీనివాస్ (హెచ్‌సి 3046), ఉపాధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ శ్రీకర్‌బాబు (19435) ఎన్నికయ్యారు. ఎస్‌ఐ/ఏఎస్ ఐ కేటగిరీలో ప్రియదర్శిని (3251), హెడ్ కానిస్టేబుల్ కేటగిరీలో కార్తిక్ శ్రీనివాస్ (3276), పోలీస్ కానిస్టేబుల్ కేటగిరీలో రాజేందర్ (5180) వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్నికయ్యారు. వివిధ పదవులకు 29 మంది సభ్యులు నూతన కార్యవర్గంలో ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి)డాక్టర్ రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిపి నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వారి సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేయాలని సిపి సూచించారు. సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలకపాత్ర పోషించాలని సిపి రమేష్ ఆకాంక్షించారు.

# తెలంగాణ రైతాంగ పోరాటానికి స్ఫూర్తి వీరనారి ఐలమ్మ



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరవనితగా గుర్తింపు పొందిన చాకలి ఐలమ్మ ప్రజా పోరాటాలకు స్ఫూర్తిదాయకమని బిసి సంఘాల నాయకులు అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ సునీల్, సంఘాల నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు స్ఫూర్తినిచ్చాయని తెలిపారు. ఆమె ఆశయాలను నేటి తరాలు స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో బిసి వెల్ఫేర్ అధికారి కేశవ్‌రామ్, రజక సంఘం అధ్యక్షుడు ఎం.అజయ్, కౌన్సిలర్ ఆంజనేయులు, బిసిఫ్రంట్ చైర్మన్ మల్లేష్ యాదవ్, ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, బిసి వెల్ఫేర్ శాఖ సిబ్బంది, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో బోధన

## అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం బాలాపూర్ మండలం జిల్లెలగూడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపిపిఎస్)ను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు,మండల విద్యాశాఖ అధికారి కృష్ణతో కలిసి అదనపు కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలు, హాజరు, తరగతి గదుల్లో బోధనా విధానాలను, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



### అర్హులైన బాలికలందరికీ హెచ్‌పివి టీకా అందించాలి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి సూచించారు. బాలాపూర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యుపిహెచ్‌సి)ని అదనపు కలెక్టర్ సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. హెచ్‌పివి టీకా కార్యక్రమం అమలును పరిశీలించిన అదనపు కలెక్టర్ అర్హులైన బాలికలందరికీ టీకా అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, మెడికల్ ఆఫీసర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్ అక్రమ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఐలమ్మ' నేటితరానికి స్ఫూర్తి

## షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ఎదురుగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్‌బాబర్‌ఖాన్, చెంది తిరుపతి రెడ్డి, రఘునాయక్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రెడ్డి, రజక సంఘం అధ్యక్షుడు నందిగామ రాంచందర్, దంగు శ్రీనివాస్ యాదవ్, మండల అధ్యక్షుడులు శ్రీనివాస్, రమేష్, చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, కోఆప్షన్ సభ్యులు వావిలాల సుజీవన్, ఖదీర్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, రజక సంఘం నేతలు చిల్కమర్రి నర్సింలు, విఠ్యాల నర్సింలు, చించోడు అనంతం, శేఖర్, లింగారెడ్డి గూడ అశోక్, కృష్ణయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

**జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో...**భూమి కోసం,,భుక్తికోసం..విముక్తి కోసం పోరాడిన సహాస వనిత, బడుగు వర్గాల వీర యోధురాలు చాకలి ఐలమ్మ అని షాద్‌నగర్ జాయింగ్ యాక్షన్ కమిటి అధ్యక్షుడు జనార్థన్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్‌లు అన్నారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ముందుకు ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో నక్క బాల్‌రాజ్ నర్సింహ్మాగౌడ్, కృష్ణయ్య, అర్జున్‌కుమార్, రవీందర్ గౌడ్, హెల్త్ శ్రీనివాస్, ఎం.నర్సింలు, రంగరాజన్, రాము, చంద్రశేఖర్, సురేందర్, ఆర్టిసి నర్సింలు, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

**యాచారం :** మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసినివాళ్ళు అర్పించారు, కార్యక్రమంలో సిపిఐఎం జిల్లా కమిటి సభ్యులు పి.అంజయ్య, నాయకులు బాల్ రాజ్, శ్రీమన్నారాయణ, బాషయ్య, రమేశ్, రాములు, సత్తయ్య, సత్యనారాయణ, కోటయ్య, రామకృష్ణ, రాములు, శ్రీను, బిక్షపతి, మారయ్య, సాయిలమ్మ, పోషమ్మ, అంజమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

**శంకర్‌పల్లి:** చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా శంకరపల్లి పట్టణంలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే కాలే యాదయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో శంకరపల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గోపాలరెడ్డి, మునిసిపల్ వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, మండల మునిసిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటరెడ్డి, చంద్రమౌళి, మార్కెట్ వైస్ చైర్మన్ చంద్రమోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లారం వెంకట్‌రెడ్డి, బొల్లారం ప్రశాంత్ రెడ్డి, మోకీల సర్పంచ్ శేకర్, కౌన్సిలర్లు ఆనంద్, సంధ్య రాణి అశోక్, గిరిజ శేకర్, లలిత మోహన్‌రెడ్డి, ఉషాకిరణ్ విజయ్, ప్రశాంత్, అఖిల యాదిరెడ్డి, గణేష్, ఫైముదా బేగం సమ్మి, అశోక్, బాలకృష్ణరెడ్డి, రజని శ్రీనివాస్, మహమూద్, మొయిన్, ప్రకాష్ గుప్తా, వెంకట్రాంరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు ప్రశాంత్, సర్తాజ్, పొడువు శ్రీనివాస్,గోపాల్, సత్యం, బాలకృష్ణ, రాంరెడ్డి, అనంత్ రెడ్డి రజక సంఘం నాయకులు పట్టణ కాంగ్రెస్ ,కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్:** దొరల పెత్తనాన్ని దిక్కరించిన ధీరవనిత చాకలి ఐలమ్మ అని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇబ్రహీం అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎండి ఇబ్రహీం మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, మహిళా పోరాట స్ఫూర్తికి చిరస్మరణీయం ఐలమ్మ పోరాటమేనని అన్నారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మను స్మరించుకోవడం మనందని కర్తవ్యమని అన్నారు. సామాజిక వివక్ష, వెట్టి చాకిరి, దోపిడికి వ్యతిరేకంగా ఐలమ్మ సాధించిన పోరాటం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రజక నేతలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# లాలుపై మనీలాండరింగ్ అభియోగాలు

• రబ్రీదేవీ, తేజస్వీ యాదవ్, మరో నలుగురిపైనా.. ఇడికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ :** ఐఆర్‌సిటిసి కుంభకోణం ఆరోపణలకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నమోదు చేసిన కేసులో, మాజీ రైల్వే మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి, కుమారుడు తేజస్వి ప్ర ద్ యాదవ్, మరో నలుగురిపై మనీలా ండరింగ్ అభియోగాలు నమోదు చే యాలని ఢిల్లీ కోర్టు గురువారం ఆదేశించింది. గత ఏడాది అక్టోబర్‌లో ఈ కుంభకోణంపై సిబిఐ కేసులో ఆర్‌జెడి అధినేతతో పాటు మరో 11 మందిపై కోర్టు ఇప్పటికే అవినీతి అభియోగాలు నమోదు చేసింది. గురువారం, ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే మాట్లాడుతూ మనీలాండరింగ్ నేరానికి సంబంధించి ఏడుగురిపై బలమైన అనుమానం ఉందని, నిందితుల తరపు న్యాయవాదులు వాదించినట్లుగా దర్యాప్తు తీరు, సమయం, విధానం రాజకీయ కక్ష సాధింపు చర్యలతో ప్రేరేపించబడినట్లుగా కనిపించడం లేదని అన్నారు. ఈ కేసులో తొమ్మిది మంది నిందితులను న్యాయమూర్తి నిర్దోషులుగా విడుదల చేశారు. యుపిఎ–1 హయాంలో రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో లాలూ ప్రసాద్, మాజీ కేంద్ర మంత్రి ప్రేమ్ చంద్ గుప్తా భార్య అయిన సరళా గుప్తాకు చెందిన బినామీ కంపెనీ ద్వారా పాట్నాలోని ఒక విలువైన భూమిని లంచంగా తీసుకుని, 2004లో రెండు ఐఆర్‌సిటిసి హోటళ్ల నిర్వహణను ఒక కంపెనీకి అప్పగించారని సిబిఐ ఎఫ్‌ఐఆర్ ఆరోపించింది. ఇడి ప్రసాద్ కుటుంబ సభ్యులు, ఇతరులపై పిఎంఎల్‌ఏ కింద క్రిమినల్ కేసు నమోదు చేసింది. అధికారుల ప్రకారం, సిబిఐ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న ఇతరులలో విజయ్ కొచ్చర్, వినయ్ కొచ్చర్ (ఇద్దరూ సుజాత హోటల్స్ డైరెక్టర్లు), ప్రస్తుతం లారా ప్రాజెక్ట్స్‌గా పిలవబడుతున్న డిలైట్ మార్కెటింగ్ కంపెనీ, అప్పటి ఐఆర్‌సిటిసి మేనేజింగ్ డైరెక్టర్ పికె గోయల్ ఉన్నారు. ప్రతిఫలంగా విలువైన భూమిని పొందారని ఆరోపిస్తూ 2018 జులై 5న సిబిఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేయబడింది.

## సురక్షితమైన, సుస్థిరమైన..

# అంతరిక్షరంగానికి భారతదేశం మద్దతు

తొలి అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో ప్రధాని మోదీ వెల్లడి



**న్యూఢిల్లీ :** అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండే సురక్షితమైన, భద్రమైన, సుస్థిరమైన వాతావరణానికి భారత దేశం మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. శాస్త్రీయ సమాచారం పారదర్శకత, సమగ్రతతో ప్రజలందరి మంచి కోసం ఉపయోగపడాలని ఆయన నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ గురువారం మొదటి అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో వర్చువల్‌గా ప్రసంగిస్తూ, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాంకేతికతలు, భాగస్వామ్యాలు కేవలం విస్తృత ప్రపంచానికి మాత్రమే కాకుండా సేవలు అందిస్తున్నాయని అన్నారు. శతాబ్దాలుగా అంతరిక్షం ప్రజల ఊహాశక్తిని ప్రేరేపించిందని, ఇప్పుడు అది వాతావరణం మొదలు పంటలు, సముద్రాలు, సమాజాల వరకు భూమిపై జీవనాన్ని తీర్చిదిద్దుతోందని ప్రధాని చెప్పారు. అంతరిక్షం ఇవ్వగల శక్తి అనంతమైనది. మన బాధ్యత సమిష్టిది. కక్షలు మరింత రద్దీగా మారేకొద్దీ, సాంకేతికతలు మరింత శక్తిమంతం అయ్యే కొద్దీ, ఇందులో పాలుపంచుకునే వారి సంఖ్య పెరిగే కొద్దీ, మన ఎంపికలు స్పష్టంగా ఉండాలి. సహకారానికా లేక ఘర్షణకా ; స్వల్పకాలిక లాభం కన్నా సుస్థిరతకే ప్రాధాన్యత ఇవ్వాలన్నా ; బహిష్కరణ కన్నా సమ్మిళితానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నా' అని ఆయన అన్నారు. భారతదేశ విధానం 'వసుధైవ కుటుంబం'–ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అనే సూత్రంలో పాతుకుపోయిందని, ఈ స్ఫూర్తి ఇప్పుడు భూగోళాన్ని దాటి ప్రయాణిస్తోంది' అని మోదీ తెలిపారు. 'అంతర్జాతీయ చట్టం, సంప్రదింపులు, బహుపాక్షిక సహకారంపై ఆధారపడిన సురక్షితమైన, భద్రమైన, శాంతియుతమైన, సుస్థిరమైన అంతరిక్ష రంగానికి మేము మద్దతు ఇస్తున్నాం. శాస్త్రీయ సమాచారం పారదర్శకత, సమగ్రతతో సామూహిక ప్రయోజనానికి ఉపయోగపడాలి' అని ప్రధానమంత్రి అన్నారు. భారతదేశ అంతరిక్ష ప్రయాణం దేశ తత్వాన్ని ప్రతిబింబిస్తుందని, ఈ ప్రయాణానికి కేంద్ర బిందువుగా నిలుస్తున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ శ్రేష్ఠత, తక్కువ ఖర్చుతో కూడిన మిషన్ల కోసం ప్రపంచవ్యాప్త ప్రశంసలు పొందిందని ప్రధాని మోదీ వివరించారు. దీని సామర్థ్యాలు రైతులకు, మత్స్య కారులకు వాతావరణ అంచనాలకు, విపత్తు నిర్వహణకు నౌకాయానానికి ఉపయోగపడతాయని తెలియజేశారు.'34దేశాలకు చెందిన 430కి పైగా ఉపగ్రహాలు భారతీయ రాకెట్ల ద్వారా అంతరిక్షంలోకి ప్రయాణించాయి. ఇస్రో సాంకేతికతలు, భాగస్వామ్యం కేవలం భారతదేశానికి మాత్రమే కాదు, విశాల ప్రపంచానికి కూడా సేవలు అందిస్తాయి' అని మోదీ చెప్పారు. ఈ ప్రపంచ విశ్వాసం వెనక తరతరాల భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణుల అంకిత భావం, కృషి ఉందని ప్రధానమంత్రి వివరించారు. 'రేయింబగళ్లు అవిశ్రాంతంగా పనిచేస్తూ, వారు ప్రతీ మిషన్‌తో, ప్రతీ విజయంతో ఇస్రోకు ప్రపంచ ఖ్యాతిని తెచ్చి పెట్టి, అంతరిక్షయాన దేశాల సరసన భారతదేశానికి గర్వ కారణంగా నిలిచారు' అని ఆయన ప్రస్తుతించారు. చంద్రయాన్–3 భారతదేశాన్ని చంద్రుని దక్షిణ ధ్రువానికి సమీపంలో దిగిన రెండవ దేశంగా నిలిపిందని, ఆదిత్య ఎల్–1 సూర్యుడి రహస్యాలను ఛేదిస్తోందని మోదీ వివరించారు. గత ఏడాది ఒక భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించారని చెప్పారు.'భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, 2035నాటికి భారత అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించాలి. 2040నాటికి ఒక భారతీయుడిని చంద్రుడిపైకి పంపాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ ప్రయత్నాలన్నింటిలోనూ ఒక మార్గదర్శక సూత్రం స్పష్టంగా ఉంది. వాటి ప్రయోజనాలు మానవాళి మొత్తానికి చేరాలి. ఇస్రోతోపాటు, భారతదేశ ప్రైవేట్ అంతరిక్ష రంగం కూడా భారీ స్థాయిలో పురోగమిస్తోంది. పారిశ్రామిక రంగం శక్తి ఇస్రో విజయానికి తోడవుతోంది' అని మోదీ వెల్లడించారు. భారతదేశపు తదుపరి అంతరిక్ష రంగంలో కలిసి పనిచేయడానికి ఫ్రాన్స్‌ను, ప్రపంచాన్ని మేం ఆహ్వానిస్తున్నాం' అని ఆయన స్వాగతించారు. సదస్సుకు తనను ఆహ్వానించినందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధన్యావాదాలు తెలిపారు.

# జనగణనను పూర్తిగా వక్రీకరించారు


దాని ఉద్దేశం సందేహాస్పదంగా ఉంది : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** జనగణన (2027) పూర్తిగా వక్రీకరించబడిందని, దాని ఉద్దేశం చాలా సందేహాస్పదంగా ఉందని, అందులోని అంశాలు కొన్నిసార్లు 'విలువలేనివిగా, అనవసరమైనవిగా, దుర్మార్గమైనవిగా' ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఎన్నికలు జరగనున్న నాలుగు రాష్ట్రాల్లో జనగణన దశను ముందుకు జరపాలన్న ప్రభుత్వ నిర్ణయం, దానికి తోడు జనాభా లెక్కల షెడ్యూల్‌లో అనేక కొత్త ప్రశ్నలను చేర్చడం వంటి చర్యల వల్ల, సేకరించబోయే సమాచార నాణ్యతపైనా, జనాభా లెక్కలకు, జాతీయ జనాభా రిజిస్టర్‌కు, చివరికి జాతీయ పౌర రిజిస్టర్‌కు మధ్య ఉండే సంబంధాలపైనా కొందరు మాజీ జనాభా లెక్కల అధికారులు ఆందోళన వ్యక్తం చేశారని ఒక మీడియా నివేదిక పేర్కొన్న నేపథ్యంలో, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. జనగణన పూర్తిగా వక్రీకరించడిందని గురువారం జైరామ్ రమేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత కుల గణన విధానంలో డ్రాప్ డౌన్ జాబితాకు బదులుగా స్వేచ్ఛాయుత ప్రశ్నలను ఉపయోగించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఒక చాలా తీవ్రమైన లోపం అని కాంగ్రెస్ బుధవారం ఆరోపించింది. ఈ మొత్తం ప్రక్రియ విఫలం' కావాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరుకుంటున్నట్లుగా కనిపిస్తోందని కూడా పేర్కొంది.

# అది వ్యవస్థ చేసిన హత్య

ఎంపిఎస్‌సి అభ్యర్థి ఆత్మహత్యపై సిజెపి కన్వీనర్ దీప్కే విమర్శ



**ధారాశివ్ :** ఎంపిఎస్‌సి (మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్) పరీక్షలకు సన్నద్ధమవుతున్న ప్రథమేష్ దేశ్‌ముఖ్ ఆత్మహత్యను 'వ్యవస్థ చేసిన హత్య'గా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే అభివర్ణించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యువతకు నాణ్యమైన విద్య, ఉద్యోగాలను కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం కావడం వల్లే ప్రజలు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎంపిఎస్‌సి పరీక్షలకు సన్నద్ధమవుతున్న 28 ఏళ్ల దేశ్‌ముఖ్ పుణెలో ఆత్మహత్య చేసుకున్నారు. తనకు సుమారు రూ. 2.5 లక్షల అప్పు ఉందని పేర్కొంటూ ఆయన ఒక లేఖను వదిలివెళ్లారు. ధారాశివ్‌లోని పరండాకు చెందిన ఆయన, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పుణెలోని నవీ పేట్ ప్రాంతంలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కాగా, గురువారం ధారాశివ్‌లోని ఖసాపురి గ్రామాన్ని సందర్శించిన దిప్కే, దేశ్‌ముఖ్ కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగం సాధించి తన కుటుంబాన్ని పేదరికం నుండి బయటపడేయాలనే లక్ష్యంతో దేశ్‌ముఖ్ పుణె వెళ్లారని దిప్కే చెప్పారు. 'ఖర్చుల కోసం ఆయన స్నేహితుల నుంచి డబ్బు అప్పుగా తీసుకున్నారు. కానీ పరీక్షా పత్రాల లీకేజీలు, ఫలితాల జాప్యం కారణంగా విద్యార్థులపై ఒత్తిడి పెరిగింది. ఇది వ్యవస్థ వైఫల్యం, ఇది వ్యవస్థ చేసిన హత్య' అని దీప్కే ఆరోపించారు. వ్యవస్థ తీరు, నిరుద్యోగం, గ్రామీణ ప్రాంతాల యువత ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితుల పట్ల విసిగిపోయి దేశ్‌ముఖ్ ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నారని సిజెపి కన్వీనర్ పేర్కొన్నారు. 'ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రథమేష్ పుణెలో రోజుకు ఒక్క పూట మాత్రమే భోజనం చేసేవారు. తాను ప్రభుత్వ వాహనంలో ఇంటికి వస్తానని ప్రథమేష్ చెప్పేవారని ఆయన తల్లి తెలిపారు, కానీ దురదృష్టవశాత్తు బుధవారం ఆయన మృతదేహం అంబులెన్స్‌లో ఇంటికి వచ్చింది. ఆయన తండ్రి అప్పటికే మరణించారు' అని దీప్కే చెప్పారు. పుణె వంటి నగరాల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపిఎస్‌సి అభ్యర్థులు తమ ఖర్చులను భరించడంలో సవాళ్లను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. 'దేశ్‌ముఖ్ తన స్నేహితుల నుంచి రూ. 2 లక్షల నుంచి రూ. 2.5 లక్షల వరకు అప్పు తీసుకున్నారు... ఇంత చిన్న మొత్తానికి ఒక యువకుడు తన ప్రాణాలను తీసుకోవాల్సి వచ్చింది. ఉద్యోగాలు లేకపోవడం వల్లే గ్రామీణ ప్రాంతాల్లోని యువత పరిస్థితి ఇలా తయారైంది' అని ఆయన అన్నారు. 'అధికారి కావాలనే లక్ష్యంతో ప్రథమేష్ గ్రామం వదిలి వెళ్లాడు, పరీక్షలో విజయం సాధించకుండా అతను ఎలా తిరిగి వెళ్లగలడు? ఇందుకోసం అతను తన శక్తిమేర ప్రయత్నించాడు. ఖర్చులు తగ్గించుకుని నాలుగేళ్లపాటు అక్కడే (పుణెలో) ఉన్నాడు. అతనిలాంటి యువకులు వేల సంఖ్యలో ఉన్నారు అని దీప్కే పేర్కొన్నారు.రిజర్వేషన్ల అంశం గురించి మాట్లాడుతూ, ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయినందునే వారు రాజ్యాంగపరమైన పరిష్కారాన్ని కోరుతున్నారన్నారు. 'ప్రభుత్వం మెరుగైన సదుపాయాలను కల్పించలేకపోతోంది. ఒకవేళ వారికి మంచి సదుపాయాలు, పాఠశాలలు, విద్య, అవకాశాలు లభిస్తే, ఎవరైనా రిజర్వేషన్ల గురించి ఎందుకు అడుగుతారు? నాణ్యమైన విద్యను అందించడంలోనూ, ఉద్యోగాలు కల్పించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైనందునే ప్రజలు రిజర్వేషన్లను కోరుతున్నారు. ప్రభుత్వంపై నమ్మకం పోయినందునే వారు రాజ్యాంగపరమైన పరిష్కారాలను ఆశిస్తున్నారు' అని ఆయన చెప్పారు. ఎంపిఎస్‌సి అభ్యర్థుల ఆందోళనకు ఇంతకుముందు కేవలం మద్దతు మాత్రమే ఇచ్చిన సిజెపి, ఇకపై ఆ ఆందోళనలో ప్రత్యక్షంగా పాల్గొంటుందని కూడా దీప్కే తెలిపారు.

# ఆత్మహత్యల్లో 4వ స్థానంలో ఛత్తీస్‌గఢ్

• ఐదేళ్లలో 4వేల మంది ఆత్మహత్య • జాతీయ నేరాల రికార్డుల బ్యూరో వెల్లడి




**రాయ్‌పూర్:** పెరుగుతున్న వృత్తిపరమైన ఒత్తిళ్లు, విద్యాపరమైన ఆందోళనలు, ప్రేమలో విఫలమవడం, సోషల్ మీడియాలో 'లోపరహితమైన' జీవితాన్ని ప్రదర్శించాలనే అంతులేని తపన వంటివి భారతదేశ యువతపై, ముఖ్యంగా జెనరేషన్ జెడ్‌పై ఆందోళనకరమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కూడా దీనికి మినహాయింపు కాదు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం (సెప్టెంబర్ 10) సందర్భంగా, అధికారిక గణాంకాలు, మానసిక వైద్య అంచనాలు ఒక భయంకరమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఆత్మహత్యల కేసులలో ఛత్తీస్‌గఢ్ దేశవ్యాప్తంగా నాల్గవ స్థానంలో ఉంది. జాతీయ నేరాల రికార్డుల బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) గణాంకాల ప్రకారం, 2020 నుండి 2024 మధ్య ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 39,814 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఈ రాష్ట్రంలో 2020లో 7,710, 2021లో 7,828 మరణాలు నమోదు కాగా, 2022లో ఈ సంఖ్య 8,446తో గరిష్ట స్థాయికి చేరుకుంది. 2023లో ఈ సంఖ్యలు స్వల్పంగా 7,868కి తగ్గినప్పటికీ, 2024లో 7,962 మరణాలతో మళ్లీ పెరుగుదల ధోరణి కొనసాగింది.ఛత్తీస్‌గఢ్‌లో ఆత్మహత్యల రేటు ప్రతి లక్ష జనాభాకు 26గా ఉంది. ఇది జాతీయ సగటు అయిన 12.3 కంటే రెట్టింపు కంటే ఎక్కువ. రాష్ట్రంలోని మొత్తం ఆత్మహత్య కేసులలో 18 నుండి 30 ఏళ్ల మధ్య వయస్సు గల యువత 34.6% ఉన్నారు, దీంతో వీరు అత్యంత ప్రమాదానికి గురయ్యే వర్గంగా నిలుస్తున్నారు. రాయ్‌పూర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) అధికారులు నివేదించిన ప్రకారం, టెలిమానస్ హెల్ప్‌లైన్ (14416)కు వచ్చే ప్రతి పది కాల్స్‌లో నాలుగు 18 నుండి 28 ఏళ్ల మధ్య వయసున్న యువత నుండే వస్తున్నాయి. తీవ్రమైన ఒంటరితనం, 'తమ మాట ఎవరూ వినడం లేదు' అనే భావన వారి ప్రధాన ఫిర్యాదుగా ఉంది. యువతకు ప్రత్యేకమైన ఆందోళనలతో పాటు, ఆర్థిక బలహీనతలు, సామాజిక కారకాలు కూడా పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. మానసిక ఆరోగ్య నిపుణులు నొక్కిచెప్పినదేమిటంటే, బలహీనపడుతున్న సామాజిక మద్దతు, మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల తీవ్రమయ్యే ఆకస్మిక, ఆవేశపూరిత ప్రతిచర్యల నుండే పెరుగుతున్న విషాదాలు సంభవిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన సంఘటనలు ఈ అస్థిరతను స్పష్టం చేస్తున్నాయి. కోర్బా జిల్లాలో, సోషల్ మీడియా రీల్స్ చూస్తుండగా ఇంటర్నెట్ కనెక్టివిటీ కోల్పోవడంతో 52 ఏళ్ల మహిళ పురుగుల మందు తాగింది. దుర్గ్‌లో, అన్నయ్య/అక్కయ్య తిట్టడంతో 10 ఏళ్ల బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జాంజ్‌గిర్‌చంపాలో, ఒక కల్పిత పోలీసు కేసు పెడతామని బెదిరించడంతో 25 ఏళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యను ఒక నేరంగానో లేదా నైతిక బలహీనతకు సంకేతంగానో కాకుండా, నివారించగల ప్రజా ఆరోగ్య సంక్షోభంగా పరిగణించాలని మానసిక వైద్యులు నొక్కి చెబుతున్నారు. ఆత్మహత్య ఆలోచనలు ఉన్న వ్యక్తులు తీవ్రమైన మానసిక వేదనను ఎదుర్కొంటున్నారని గుర్తించి, కుటుంబాలు, సమాజాలు తీర్పులకు బదులుగా సానుభూతిని, రక్షణాత్మక వ్యక్తిగత భద్రతా వలయాలను అందించాలని వారు కోరారు.

# ఉప ఎన్నికలకు టివికె అభ్యర్థుల ప్రకటన

**చెన్నై :** తమిళనాడులోని రెండు అసెంబ్లీ స్థానాలకు అక్టోబర్ 6న ఉప ఎన్నికల జరగనున్నాయి. ఇందుకోసం అధికార టివికె గురువారం తమ అభ్యర్థులను ప్రకటించింది. దీనితో ప్రధాన ప్రత్యర్థి డిఎంకెతో నేరుగా ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది; ఎఐఎడిఎంకె కూడా ఈ పోటీలో దిగే అవకాశం ఉంది. ఏప్రిల్ 23న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి, మిత్రపక్షాల సహాయంతో సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టివికె) తన తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత రాష్ట్రంలో జరగనున్న తొలి ఎన్నికల పోరు ఇది. టివికె వ్యవస్థాపకుడు, ముఖ్యమంత్రి విజయ్, మాజీ ఎఐఎడిఎంకె ఎమ్మెల్యేలు కె. మరకథం కుమారవేల్, పి. సత్యభామలను మధురాంతకం, ధరాపురం నియోజకవర్గాల అభ్యర్థులుగా నామినేట్ చేశారు. టివికెలో చేరడానికి ముందు వారు ఈ రెండు స్థానాలకు ప్రాతినిధ్యం వహించారు. కుమారవేల్, సత్యభామ ఇద్దరూ ఏప్రిల్ 23 ఎన్నికల్లో ఎఐఎడిఎంకె అభ్యర్థులుగా ఆయా నియోజకవర్గాల్లో విజయం సాధించారు, ఆ తర్వాత ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి అధికార టివికెలో చేరారు.

## 'సిజెపి' నిరసనల్లో మైనర్ బాలిక ఆరోపణలు

# ఢిల్లీ, యుపి ప్రభుత్వాల నుంచి నివేదిక కోరిన 'సుప్రీం'

బాధితురాలిని ఎవరూ భయపెట్టలేరని హెచ్చరించిన 'ధర్మాసనం'

**న్యూఢిల్లీ :** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిరసనల్లో పాల్గొన్న ఒక మైనర్ బాలికపై వేధింపుల ఆరోపణలపై గురువారం సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు బాధితురాలిని గానీ, ఆమె కుటుంబాన్ని గానీ ఎవ రూ బెదిరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం బాలిక నమోదు చే సిన ఎఫ్‌ఐఆర్‌పై చర్యలు తీసుకునేలా చూడాలని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తాను ఆదేశించడంతో పాటు, ఈ విషయ ంపై ఢిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాల నుంచి నివేదిక కోరింది. 'ఇలాంటి విషయాలను ఎవరూ తేలికగా తీసుకోకూడదు. పిల్లల కు సంబంధించిన వ్యవహారంలో హింస జరిగినప్పుడు ఎవరినీ వెనకేసు కురాకూడదు. ఒకవేళ అటువంటి చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్వేచ్ఛగా తిరుగు తూ, బాధితురాలైన బాలికను గానీ, ఆమె కుటుంబాన్ని గానీ భయపెట్టి క్రిమినల్ చర్యలు చేపట్టకుండా అడ్డుకోవడానికి ప్ర యతిస్తుంటే అది చాలా తీవ్రమైన విషయం అవుతుంది. 'దీనిపై ఎలాంటి భిన్నాభిప్రాయానికి తావులేదు. ఇలాంటి విషయాలను తేలికగా తీసుకోకూడదు. ఎవరినీ కాపాడకూడదు. ఒక వేళ పిల్లలకు సంబంధించిన హింస వ్యవహారంలో, నిందితులు స్వేచ్ఛ గా తిరుగుతూ, క్రిమినల్ చర్యలు చేపట్టకుండా ఉండేందుకు, బాధితులను గానీ, వారి కుటుంబాన్ని గానీ భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నిస్తుంటే, అది చాలా తీవ్రమైన విషయ మే అవుతుంది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సిజెపి నిరసన సందర్భంగా తన తండ్రిపై దాడిచేశానని ఒక వీడియోలో చెప్పిన వ్యక్తిపై ఫిర్యాదు చేసిన తర్వాత, 14ఏళ్ల బాలిక వేధింపులకు గురైందని, ఆమె ఇంటిని ధ్వంసం చేశారని ఆ బాలిక త రపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఎవరి పేర్లను ప్రస్తావించకుండా, నిందితుడితోపాటు ఉండి కెమెరాలో చిక్కారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కేసు పెట్టకుండా ఆ చిన్నారిపై ఎ ఫ్‌ఐఆర్ నమోదు చేశారని న్యాయవాది వెల్లడించారు. ఇది సు ప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వుకు విరుద్ధమని, బాలిక నివాసంపై రాళ్లదాడి జరిగినట్లు చూపే రికార్డులో ఉంచవచ్చని న్యాయవాది చెప్పారు. 'హైపవర్డ్ కమిటీకి సమయం పడుతుం ది. కానీ, ఈ లోపు బిడ్డకు ఏదైనా జరిగితే, దానిని కమిటీ ద్వా రా తదనంతరం మార్చడం లేదా సరిదిద్దడం సాధ్యపడదు' అని న్యాయవాది సమర్పించారు. ఈ విజ్ఞప్తికి స్పందించిన ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మాట్లాడుతూ ఒక వేళ పిల్లలపై హింసకు పాల్పడిన సంఘవిద్రోహ శక్తులు స్వేచ్ఛగా తిరుగుతూ, ఆ పిల్లలను బెదిరించడానికి ప్రయత్నిస్తూ ఉంటే, అది తీవ్రమైన విషయం కావ చ్చు' అని అన్నారు. అంతకుముందు సిజెపి నేతృత్వంవలోని నిరసనల సమయంలో మైనర్ కార్యకర్త తండ్రిపై దాడి చేశారన్న ఆరోపణల నేపథ్యంలో, హిందుత్వ ప్రభావశీలి స్వతంత్ర భరద్వాజ్ పై మోపిన ఎఫ్‌ఐఆర్‌కు ఎస్‌సి / ఎస్‌టి (అత్యాచారాల నివారణ చట్టం) నేరపూరిత బెదిరింపుల నిబంధనలను ఢిల్లీ పోలీసులు సెప్టెంబరు 5న చేర్చారు. ఆరోపించిన దాడి కేసులో భరద్వాజ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రో చ్ జనతా పార్టీ పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వెలుపల నిరసన చేపట్టడంతో ఆయనను బులంద్ షహర్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జులై 20న నిరసన సందర్భంగా తాను ఒక మైనర్ కార్యకర్త తండ్రి 'పుర్రెను పగులగొట్టాను' తన రాజకీయ సంబంధాల కారణంగా అరెస్ట్ నుండి తాను తప్పించుకున్నానని భరద్వాజ్ ఒక ఇంటర్వ్యూ లో పేర్కొనడంపై ప్రజాగ్రహం వెల్లువెత్తిన నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు.



# మణిపూర్‌లో నలుగురు ఉగ్రవాదుల అరెస్టు

**ఇంఫాల్:** మణిపూర్‌లోని రెండు జిల్లాల్లో నిషేధిత సంస్థలకు చెందిన నలుగురు ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేశాయి. పోలీసు అధికారి తెలిపిన వివరాల ప్రకారం ఇంఫాల్ తూర్పు జిల్లాలోని మానా ఇంగ్‌ఖోల్‌లో, అస్సాం రైఫిల్స్ , గర్హ్వాల్ రైఫిల్స్‌కు అందిన నిఘా సమాచారం ఆధారంగా, నేషనల్ రివల్యూషనరీ ఫ్రంట్ ఆఫ్ మణిపూర్‌కు చెందిన 28 ఏళ్ల ప్రముఖ సభ్యుడిని అరెస్టు చేసారు. ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని చింగ్ మీరాంగ్‌లో, నిషేధిత కాంగ్లెపాక్ కమ్యూనిస్ట్ పార్టీకి చెందిన 44 ఏళ్ల కార్యకర్తను అరెస్టు చేసారు. ఇంఫాల్ ఈస్ట్‌లోని అహల్లుప్‌కు చెందిన కెసిపి (నొంగ్‌డ్రెంఖోంబా) సభ్యుడు ఉన్నారు. ఉగ్రవాదులను విచారించడం వంటి తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE IV ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE,
AT SANGA REDDY
G.W.O.P No. 31 Of 2026
BETWEEN:
Smt. Vemuri Anuradha,
......plaintiff
AND
All Concerned.
....Defendants
NOTICE
To,
1. To whomsoever it may concern.
The plaintiff herein filed above **G.W.O.P.No.31/2026** against above **All Concerned** to declare plaintiff as sole and exclusive legal guardian of both the person and the properties of the minor child Baby Nakka Netra Reddy. Hence, you are required to appear before Hon'ble Court through Legal counsel on **21.09.2026 at 10:30 am.** Failing which the matter will be heard & decided in your absence.
Sd/-
K. RAM MURTHY & K. UMA
Advocates,
FCI Colony, Miyapur,
Hyderabad-49,
Mobile: 9440412810.

**అంబేద్కర్ విగ్రహం అపవిత్రం**

# బంద్‌కు వాల్మీకి, దళిత సంఘాలు పిలుపు

హోషియార్‌పూర్, జలంధర్ ప్రాంతాల్లో మూతపడిన దుకాణాలు, వ్యాపార సంస్థలు



**హోషియార్‌పూర్/జలంధర్ :** పంజాబ్ లూధియానాలోని జలంధర్ బైపాస్ చౌక్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేశారన్న ఆరోపణలకు నిరసనగా, వివిధ వాల్మీకి, దళిత సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో గురువారం హోషియార్‌పూర్, జలంధర్ ప్రాంతాల్లో దుకాణాలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ఈ బంద్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. హోషియార్‌పూర్, జలంధర్ నగరాల్లోని అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసివేయబడ్డాయి. అయితే, ఆసుపత్రులు, మందుల దుకాణాలతో సహా అత్యవసర సేవలు మాత్రం యథావిధిగా కొనసాగాయి. బుధవారం నాడు లూధియానాలో ఏడు గంటల పాటు బంద్ పాటించారు. హోషియార్‌పూర్‌కు చెందిన వాల్మీకి సభ నాయకుడు తర్సెమ్ బాబ్బు, శ్రీ గురు రవిదాస్ టైగర్ ఫోర్స్‌కు చెందిన బిందర్ సరోయియా వంటి నాయకుల నేతృత్వంలో వాల్మీకి, దళిత సంఘాల కార్యకర్తలు హోషియార్‌పూర్‌లోని క్లాక్ టవర్ వద్ద సమావేశమయ్యారు. అనంతరం వారు ఆ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బజార్ల గుండా నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసనలో దళిత నాయకులు వికాస్ హన్స్, కమల్ భట్టి, రిషు అడియా తదితరులు పాల్గొన్నారు. బంద్ సక్రమంగా అమలయ్యేలా చూసేందుకు కొందరు కార్యకర్తలు స్కూటర్లు, మోటార్‌సైకిళ్లపై నగరంలో తిరిగారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హోషియార్‌పూర్, జలంధర్‌లోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు మోహరించారు. బంద్ ప్రశాంతంగా సాగిందని, నగరంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని అధికారులు తెలిపారు. కార్యకర్త సాబీ మాలిక్ నేతృత్వంలో గర్ధివాలాకు చెందిన వాల్మీకి వర్గీయులు గర్ధివాలా బస్ స్టాండ వద్ద సమావేశమై ధర్నా నిర్వహించారు, దీనివల్ల దసుయా–హోషియార్‌పూర్ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మంగళవారం సాయంత్రం లూధియానాలోని జలంధర్ బైపాస్ చౌక్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని అపవిత్రం చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిరసనలు జరిగాయి. ఈ చర్య వాల్మీకి వర్గీయులలో తీవ్ర అసహనానికి కారణమైందని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం విశేష కృషి చేసిన డాక్టర్ అంబేద్కర్‌కు జరిగినట్లుగా చెబుతున్న అవమానాన్ని సహించేది లేదని ఆయన అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని పోలీసులు త్వరగా గుర్తించి అరెస్టు చేయాలని, అలాగే సమగ్ర విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

## ఉన్నతస్థాయి కమిటీ

# పునర్వ్యవస్థీకరణలో మార్పులుండవ్

నీట్ నిరసనల కేసులో తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :**ఇటీవల ఢిల్లీలో విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలు, పోలీస్ సిబ్బందిపై జరిగిన హింస ఆరోపణలను విచారించేందుకు మాజీ సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీ పునర్వ్యవస్థీకరణలో ఎలాంటి మా ర్పులకు అంగీకరించబోమని గురువారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూ ర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మాట్లాడుతూ, తాము ఏర్పాటు చేసిన కమిటీ పక్షపాతంతో వ్యవహరించిందనే ఊహతో ముందుకు సాగబోమని స్పష్టంచేసింది. 'ఈ కమిటీ మా సహాయక హస్తంవంటిది. మేం ఎలాంటి మార్పులకూ అంగీకరించం. ఈ కమిటీ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తుంది. మేం దానిని పునర్వ్యవస్థీకరించం. ఈ కమిటీని పని చేయనివ్వండి. చూద్దాం. మేం పారిపోవడం లేదు. కమిటీ ఎక్కడైనా తప్పు చేసిందని ఎవరికైనా అనిపిస్తే మాకు చెప్పండి. మేం బహిరంగంగా విచారణ జరుపుతాం'అని సిజెఐ వ్యాఖ్యానించారు. విచారణ సందర్భంగా, పునర్వ్యవస్థీకరణ కోరుతున్న పిటిషనర్లలో ఒకరిగా హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ప్యానెల్‌లోని సభ్యులలో ఒకరైన ఈశాన్య రాష్ట్ర మాజీ డిజిపి, విచారణలో ఉండే అవకాశం ఉన్న ఒక ఉన్నతాధికారికి సన్నిహిత మిత్రుడు కావడం వల్ల 'ప్రయోజన వైరుధ్యం' కింద ఉన్నారని వాదించారు. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ ప్రశాంత్ భూషణ్ వాదనలను గట్టిగా సమర్థించారు. ప్రభుత్వ న్యాయవాది ద్వారా కమిటీ ప్రాతినిధ్యం వహించరాదు' అని శంకరనారాయణన్ చెప్పారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తా ఈ వాదనలను వ్యతిరేకించారు.



## ఎన్నికల తర్వాతే యుద్ధ సమాప్తి

**చమురు ధర తగ్గేది కూడా అప్పుడే : ట్రంప్ స్పష్టీకరణ**

**వాషింగ్టన్ :** నవంబరు మూడో తేదీన జరిగే కీలకమైన అమెరికా ద్వైవార్షిక ఎన్నికలు పూర్తయిన వెంటనే పశ్చిమాసియాలో యుద్ధం ముగుస్తుందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరలు కూడా అప్పుడే తగ్గుముఖం పడతాయని భరోసా ఇచ్చారు.అప్పటివరకూ ముడి చమురు ధర తగ్గే ప్రసక్తే ఉండదని తేల్చి చెప్పేశారు. "ఎన్నికలు పూర్తయిన వెంటనే యుద్ధం ముగుస్తుందని నేను అనుకుంటున్నాను, ఎందుకంటే అంతకంటే వారు (ఇరాన్ నాయకులు) తట్టుకోలేరు" అన్నారు. రిపబ్లికన్‌పార్టీ ఎన్నికల ప్రారంభ సదస్సులో పాల్గొనేందుకు టెక్సాస్ వెళుతూ విమానంలో ఆయన పాత్రికేయులకు ఈ విషయం చెప్పారు.ఇరాన్‌తో చర్చలు జరిగే అవకాశాలున్నాయని, కానీ దానిపై తాము దృష్టిపెట్టలేదన్నారు.ఇరానులో యుద్ధాన్ని ముగించాలని సొంత పార్టీ నుండే ట్రంప్‌పై తీవ్రమైన ఒత్తిడి వస్తోంది. దేశంలో ఆయన ప్రజాదరణ కూడా ఎన్నికలకు ముందుగా గణనీయ స్థాయిలో దిగజారిపోయిందని నెవార్ సర్వేలు ఎప్పటికప్పుడు చెబుతున్నాయి. ట్రంప్ నవంబరు ఎన్నికల్లో అమెరికా కాంగ్రెస్‌పై పూర్తిగా పట్టుకోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నారు. ఐనాగాని ఆయన "ట్రంప్ షో" కొనసాగించాలని బలంగా కోరుకుంటున్నారు.ఇరాన్‌లో యుద్ధం అంతులేకుండా సాగుతూ ఉండటంతో పెరిగిన చమురు ధరల సమస్య పరిష్కరించాలని రిపబ్లికన్ ప్రభుత్వంపై రోజు రోజుకూ ఒత్తిడి పెరుగుతున్న దశలో ట్రంప్ పైవిధంగా ఒక క్లారిటీ ఇచ్చారు.అమెరికా ప్రామాణిక ముడిచమురు ధర,గ్యాసోలిన్ ధర బుధవారం ఒక్కసారిగా పెరిగిపోయాయి.దీంతో ఆ దేశంలో ఆందోళన,ట్రంప్ వ్యతిరేకత పెరిగాయి. ఇరాన్‌లో ఆర్థిక పరిస్థితులు బాగా దిగజారిపోయాయని ఆయన బలంగా విశ్వసించారు.అమెరికా-ఇరాన్ మధ్య గడచిన నాలుగు రోజులుగా ముడిచమురు ధరలు ప్రపంచ మార్కెట్‌లో మూడుశాతం మేరకు భారీగా పెరగడంతో అన్ని దేశాలలో తీవ్ర ఆందోళన నెలకొంది. దీనివల్ల అంతర్జాతీయ స్థాయిలో సరఫరా చేసే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర జులై నెల తర్వాత మొదటిసారి మళ్ళీ 100 డాలర్లు దాటింది.ఈ పూర్వరంగంలో,నవంబరులో మధ్యంతర ఎన్నికలు పూర్తయ్యేవరకూ చమురు ధరలు తగ్గే అవకాశం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు."మధ్యంతర ఎన్నికల కంటే దీనికి ఇంకా కొంచెం సమయం పడుతుందని నేను భావిస్తున్నాను" అన్నారు.మధ్యంతర ఎన్నికల కోసం పార్టీని సన్నద్ధంచేసే ప్రజలను బయటకు రావాల్సిందిగా పిలుపు ఇచ్చేందుకు డాలస్‌లో రిపబ్లికన్‌పార్టీ ఏర్పాటుచేసిన సదస్సుకు బయలుదేరే ముందుగా ట్రంప్ పాత్రికేయులతో మాట్లాడుతూ చమురు ధరల పెరుగుదలపై అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.

**మోఖా రేవుకు చేరిన హౌతీలు :** ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు యెమెన్‌లోని ఎర్ర సముద్ర ఓడరేవు నగరం మోఖావద్దకు చేరుకున్నారు.దానిని చుట్టుముట్టారు. ఎర్ర సముద్రానికి కీలకమైన జలమార్గాన్ని నియంత్రించడానికి హౌతీలకు దీనివల్ల చాలా ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. దీనివల్ల యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉంటాయి. ఇది చాలా కీలక పరిణామం అవుతుంది. ఎందుకంటే గల్ఫ్ ఆఫ్ ఏడెన్,హిందూమహాసముద్రాన్ని కలిపే బాబ్ ఎల్ మండేబ్ ను చేరుకోవడానికి,దాన్ని నియంత్రించడానికి హౌతీలకు వీలు కలుగుతుంది.

# గెలుపుకోసం ఓటర్లకు ట్రంప్ డబ్బు ఎర

**ప్రతి అమెరికన్ ఎడల్ట్‌కీ 5000 డాలర్లు ఇస్తామని ప్రకటన**

**27 కోట్లమంది ఎడల్ట్‌కి 13 కోట్ల డాలర్లు ఎక్కడివి?**

**ట్రంప్ 'వ్యక్తిగత షో' లా మారిన డాలస్ పార్టీ సదస్సు**

**వాషింగ్టన్ :** ద్వైవార్షిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఉభయ సభలలోనూ మెజార్టీస్థానాలను రిపబ్లికన్ పార్టీ గెలుచుకుంటే ప్రతి ఎడల్ట్ అమెరికన్‌కూ 5000 డాలర్లు ఇస్తానని అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డబ్బు ఆశ చూపించారు. డాలస్‌లో జరిగిన పార్టీ సదస్సులో ఆయన ఈ ప్రతిపాదన చేశారు. మధ్యంతర ఎన్నికల్లో ఈ విధంగా ఒక అమెరికన్ అధ్యక్షుడు ఎడల్ట్ ఓటర్లకు డబ్బు ఎర చూపించడం ఆ దేశ చరిత్రలో ఇదే మొదటిసారి కావచ్చు.అమెరికాలో 27 కోట్ల మంది ఎడల్ట్స్ ఉన్నారు. ఈ రూపేణా చూస్తే 13 కోట్ల డాలర్లను ట్రంప్ ప్రభుత్వం అమెరికన్ వయోజనుల ఖాతాలకు జమ చేయాల్సి వస్తుంది. అదేవిధంగా ఈ సదస్సులో ప్రతిపక్ష డెమోక్రాట్లను ట్రంప్ వామపక్ష తీవ్రవాదులుగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశారు. అభ్యర్థులను ఎంపిక చేసే ఆలోచనలకు బదులుగా పూర్తిగా డాలస్ సదస్సు "ట్రంప్ షో" మాదిరిగా నడిచింది. నవంబరులో జరిగే ఎన్నికలు ముఖ్యంగా ట్రంప్‌కు అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రాణాధారంగా మారాయి. ఒకవేళ ఆయన మెజార్టీ సీట్లు గెలుచుకోలేకపోతే, ప్రతిపక్ష డెమోక్రాట్లు ఆధిపత్యం సాధిస్తే, ఇక పదవీ విరమణ చేసేవరకూ ట్రంప్ జీవచ్ఛవంలా ఎలాంటి స్వంత నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం లేకుండా అధికారంలో కొనసాగవలసి వస్తుంది. ప్రతి విషయానికీ ప్రతిపక్ష డెమోక్రాట్లను ఒప్పించి వారితో కలిసి ముందుకు ప్రయాణం చేయాల్సివస్తుంది. ఈ సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు ట్రంప్ అమెరికన్ వయోజనులకు ఒక్కొక్కరికి 50000 డాలర్లు వంతున డబ్బు ఎర చూపించారు. ఐతే ట్రంప్ ప్రకటించిన ఈ స్కీమ్‌కు ఎంతవరకూ చట్టబద్ధత ఉందీ? ఎంతవరకూ ఇది చెల్లుబాటవుతుందనే విషయంపై చర్చ జరుగుతోంది. నిజంగా ట్రంప్ ఈ ప్యాకేజీని వయోజన అమెరికన్లకు ఇచ్చినట్లయితే కొన్ని ట్రిలియన్ డాలర్లు ఖర్చు అవుతుంది. అధ్యక్షకాలం మధ్యంతర దశలో మొదటిసారి జరిగిన పార్టీ సమావేశంలో ట్రంప్ ఈ ప్రసంగిస్తూ ఈ ప్రతిపాదన చేశారు. ఆయన ఈ ప్రకటన చేయగానే సమావేశంలో పెద్ద ఎత్తున కరతాళ ధ్వనులమోత మోగిపోయింది. ట్రంప్ కూడా ఈ క్షణాలను అస్వాదిస్తూ, కూర్చున్న సభికులఅందరివైపు గర్వంగా చూస్తూ కనిపించారని బిబిసి వ్యాఖ్యానించింది.

ఈ స్కీమును ఏ విధంగా అమలు చేస్తారు? దీనికి నిధులు ఎలా సమకూరుస్తారనే విషయాలను మాత్రం ఆయన వివరంగా చెప్పలేదు. ప్రపంచవ్యాప్తంగా అమెరికాతో వ్యాపారం చేస్తున్న అనేక దేశాల నుండి దిగుమతుల పేరుతో ట్రంప్ వసూలు చేసిన భారీ సుంకాలకు, ఈ స్కీముకు ఒక సంబంధం ఉందని దేశ ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ అన్నారు. ప్రతిపక్ష డెమోక్రాట్లు దీనిని "రిక్తహస్తాలతో కూడిన వట్టిపోయిన వాగ్దానం"గా హేళనచేయగా, మరికొందరు ఈ స్కీము ప్రకటనకు, అమలుకు ఉన్న చట్టబద్ధత ఏమిటని నిలదీస్తున్నారు.

గడచిన ఆరునెలలుగా ఇరాన్‌పై అమెరికా చేస్తున్న భీకర పోరాటం కారణంగా దేశంలో పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం నేపథ్యంలో ఈ ప్రణాళిక ఆచరణ సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**దేశాన్ని వామపక్ష తీవ్రవాదులకు అప్పగించకండి : ట్రంప్ పిలుపు**

అమెరికా దేశాన్ని వామపక్షతీవ్రవాదులు అధికంగా ఉన్న ప్రతిపక్ష డెమోక్రాట్లకు అప్పగించవద్దని డోనాల్డ్ ట్రంప్ పిలుపు ఇచ్చారు. నవంబరు ఎన్నికలకు సన్నాహకంగా డాలస్‌లో జరిగిన రిపబ్లికన్‌పార్టీసదస్సులో ఆయన మాట్లాడుతూ, వామపక్ష తీవ్రవాద డెమోక్రాట్లకు దేశాన్ని ఎన్నికల మార్గంలో అప్పగిస్తే,దేశం తిరిగి కోలుకోవడానికి దశాబ్దకాలం పడుతుందని హెచ్చరించారు. డెమోక్రాట్లను వామపక్ష తీవ్రవాదులుగా,అమెరికా వ్యతిరేకులుగా,దుర్మార్గులుగా చిత్రీకరించే ఎజెండాను ఈ సదస్సు చేపట్టింది. డెమోక్రాట్లకు ఓటు వేస్తే అదొక విషాదంగా మారుతుందని అన్నారు. రిపబ్లికన్లకు ఓటు వేస్తే ఈ గడ్డ ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. రాబోయే పదేళ్ళలో ఇదే ప్రధానాంశంగా మారుతుందని హెచ్చరించారు.



ఒకవైపు దేశంలో ట్రంప్ రేటింగ్ యుద్ధం కారణంగా విపరీతంగా క్షీణించిపోయినాసరే ఆయన తన వ్యక్తిత్వాన్ని, తన ఫేస్‌వ్యాల్యూను ఈ ఎన్నికల్లో ప్రధానంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు సిద్ధపడ్డారు. పార్టీకి నష్టం జరిగినాసరే ఎన్నికల్లో ట్రంప్ తనను కేంద్రంగా చేసుకునే ప్రచారం జరగాలన్న పట్టుదలతో ఉండటంతో ఇప్పటికే గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులు చాలామంది డాలస్ సదస్సుకు దూరంగా ఉన్నారు.

# లైబీరియా కార్గోనౌకలో అగ్నిప్రమాదం

**చైనా షిప్‌యార్డ్‌లో ఘటన : 20 మంది మృతి**

**తక్షణ సహాయ చర్యలకు జిన్‌పింగ్ ఆదేశం**

**బీజింగ్ :** చైనాలో మరమ్మతులకోసం వెళ్ళిన లైబీరియాదేశ కార్గో నౌక "ఓషన్ మెలోడీ"లో అగ్ని ప్రమాదం సంభవించింది.ఈ ప్రమాదంలో కనీసం 20 మంది పైగా మరణించారు. జిన్హువా వార్తాసంస్థ గురువారం చెప్పిన సమాచారం ప్రకారం, చైనా క్వింగ్డావో ఓడరేవు నగరంలో ఉన్న కింగ్ డావో బెహై షిప్‌యార్డులో మరమ్మతులకోసం వెళ్ళిన ఒక కార్గోనౌకలో ఉదయం 11.30 గంటలకు మంటలు చెలరేగడంతో మరణాలు సంభవించాయి. దీంతో అనేక అగ్నిమాపకవాహనాలు ఆ ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చే పనిలో నిమగ్నమయ్యాయి.నౌకలో చిక్కుకుపోయినవారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగించాలని, సహాయ చర్యలు ముమ్మరం చేయాలని దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి ఘటనల్లో ఉన్నతస్థాయి నాయకుల నుండి కఠిన ఆదేశాలు జారీ చేయడం ఇదే మొదటిసారి అన్ని హాంకాంగ్ కేంద్రంగా పనిచేసే ప్రముఖ పత్రిక వ్యాఖ్యానించింది. అగ్నిప్రమాదం సంభవించడానికి గల కారణాలపై తక్షణం దర్యాప్తు చేపట్టాలని, బాధితులకు తగిన సహాయం అందజేయాలని కూడా దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశాలు ఇచ్చారు.ఈ అగ్నిప్రమాదం ద్వారా లఅన్ని ప్రాంతాలవారూ గుణపాఠాలు నేర్చుకుని ముందస్తు జాగ్రత్తలు పాటించాలని,దీనిని ఒక హెచ్చరికగా తీసుకోవాలని,ప్రాణాలు,ఆస్తులు కాపాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని కూడా స్టేట్ కౌన్సిల్‌కు ఆయన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇక మీదట ప్రమాదాలు జరగకుండా ముందస్తు తనిఖీలు ముమ్మరం చేయాలని, బాధితులకు మంచి చికిత్సలు అందించాలని ఆదేశించారు. అత్యవసర మంత్రిత్వశాఖ ఒక నిర్వహణా గ్రూపును కూడా ఘటనాస్థలానికి పంపించింది. రెండు నెలలక్రితం జులైలో సరిగ్గా పదో తేదీన చైనా షూ క్యాపిటల్ జిన్‌జియాంగ్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించడంతో 28 మంది సజీవదహనమైన విషయం ఈ సందర్భంగా గమనార్హం.కింగ్ డావో షిప్ యార్డ్ అనేది చైనా ప్రభుత్వంఅధికారికంగా నిర్వహిస్తున్న అత్యంత కీలకమైన ప్రభుత్వరంగ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ కేంద్రం. ఈ కేంద్రంలో వాణిజ్య నౌకల నిర్మాణం,మరమ్మతులతో పాటు ఇతర కీలక ఇంజనీరింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తారు.తొమ్మిది కి.మీ తీరప్రాంతంలో 815 ఎకరాలలో ఈ కీలక షిప్ యార్డును చైనా అభివృద్ధి చేసింది.




## సంఘాల ఎన్నికలు (మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం ఆర్‌టిసికి కొత్త ఊపిరి పోసిందన్నారు. మహిళల ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు బస్సుల్లో ఆక్యుపెన్సీ గణనీయంగా పెరిగిందన్నారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 347.47 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి, సుమారు రూ.12,171 కోట్లు ఆదా చేసుకున్నారని వివరించారు. ఆపరేషనల్ లాస్‌లతో ఇబ్బంది పడిన సంస్థ ఇప్పుడు లాభాల బాటలో పయనిస్తోందని, ఇప్పటికే 2,932 కొత్త బస్సులను అందుబాటులోకి తెచ్చామని, 340 డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చామన్నారు. హైదరాబాద్‌లో రద్దీ నివారణకు మినీ బస్సులు ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని, పిఎంఇడ్రైవ్ కింద 2,200 ఎలక్ట్రిక్ బస్సులను తెస్తున్నామన్నారు. 15 ఏళ్లు దాటిన పాత బస్సులను తొలగిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని మెట్రో, ఎంఎంటిఎస్ స్టేషన్‌లకు అనుసంధానంగా లాస్ట్ మైల్ కనెక్టివిటీ కోసం 370 కొత్త రూట్లను అందుబాటులోకి తీసుకొచ్చామని,ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రీమియం, ఎలక్ట్రిక్ బస్సులతో పాటు డిపోలలో కూడా సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆసిఫాబాద్, కాగజ్ నగర్ డిపోల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. యాదాద్రి వెళ్లే భక్తుల సౌకర్యార్థం వంగపల్లి వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగేలా చర్యలు తీసుకుంటామని, గాజులరామారం, శంషాబాద్, ఫ్యూచర్ సిటీల్లో బస్ టెర్మినల్స్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రసక్తే లేదని,ఆ సంస్థ ఆస్తులను కాపాడుతూ, అభివృద్ధికి వినియోగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. గతంలో తొలగించిన 244 మందిని తిరిగి విధుల్లోకి తీసుకున్నామని,1,430 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించామన్నారు. చనిపోయిన డ్రైవర్ శంకర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుందన్నారు.

## భారీ నిధులు?

**(మొదటి పేజీ తరువాయి)**

అసాధారణ విధానం చూస్తే.. కొన్ని రాజకీయ పార్టీలను రాజకీయ నిధులను మళ్లించేందుకు మాత్రమే ఏర్పాటు చేసి ఉండొచ్చన్న అనుమానం కలుగుతోందని... చివరకు ఆ నిధులు బిజెపికి చేరుతున్నాయా? అనే అంశంపై దర్యాప్తు జరగాలని సిపిఐ డిమాండ్ చేసింది. 'రాజకీయ నిధులను మళ్లించే మధ్యవర్తి పార్టీలుగా కొన్ని సంస్థలను ఉపయోగించి ఉంటే.. ఆ నిధుల మూలం, అవి చివరకు ఎక్కడికి చేరాయన్న పూర్తి వివరాలు తెలుసుకునే హక్కు భారత ప్రజలకు ఉంది. ఈ వ్యవహారంలోని ప్రతి లింక్‌పై పారదర్శక దర్యాప్తు జరగాలి. దర్యాప్తు ఫలితాలను పూర్తిగా ప్రజలకు వెల్లడించాలి. బాధ్యులుగా తేలిన వ్యక్తులు, సంస్థలపై వారి రాజకీయ స్థాయితో సంబంధం లేకుండా చర్యలు తీసుకోవాలి' అని పేర్కొంది. ఇది చిన్న రాజకీయ సంస్థలకు సంబంధించిన సాధారణ అంశంగా కొట్టిపారేయలేని విషయమని.. భారత ఎన్నికల ప్రజాస్వామ్య సమగ్రతకు సంబంధించిన తీవ్రమైన అంశమని సిపిఐ తెలిపింది.

**సిబిఐ, కాగ్‌తో విచారణ :** ఈ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు విరాళాలు ఇచ్చారు? ఏ మార్గాల్లో నగదు బదిలీ జరిగింది? చివరకు ఎవరికి చేరింది? అనే అంశాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) కాలపరిమితితో కూడిన సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సిపిఐ డిమాండ్ చేసింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ద్వారా ఈ నిధుల మొత్తం లావాదేవీలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని, ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా విరాళాల వలం, దాతల వివరాలు, నగదు బదిలీ మార్గాలు, అంతిమ లబ్ధిదారులపై దర్యాప్తు చేయాలని... చట్టబద్ధమైన నిబంధనలను ఉల్లంఘించిన పార్టీలపై ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని సిపిఐ కోరింది. అవసరమైతే ఆయా పార్టీల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలా? అనే అంశాన్ని కూడా పరిశీలించాలని పేర్కొంది. దర్యాప్తు వివరాలను ప్రజల ముందుంచాలని, ఆర్థిక లేదా ఎన్నికల అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

**బిజెపికి నిధులు చేరవేసే ఫ్రంట్‌లా?**

ఈ విరాళాల పరిమాణం, వాటి అసాధారణ విధానం చూస్తే.. కొన్ని రాజకీయ పార్టీలను రాజకీయ నిధులను మళ్లించేందుకు మాత్రమే ఏర్పాటు చేసి ఉండొచ్చన్న అనుమానం కలుగుతోందని సిపిఐ ఆరోపించింది. చివరకు ఆ నిధులు బిజెపికి చేరుతున్నాయా? అనే అంశంపై దర్యాప్తు జరగాలని పేర్కొంది.

## బ్యాంక్‌ఖాతాల్లో

**(మొదటి పేజీ తరువాయి)**

చేందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో కాంగ్రెస్ సభ్యులు భూపతిరెడ్డి, విజయ రమణరావు, చిక్కుడు వంశీకృష్ణ, వీరులపల్లి శంకర్, టి.రాంమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. నిధుల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామ పంచాయతీలకు ఈ చట్ట సవరణ ఎంతో ఉపశమనం కల్పించినుందన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు. బిజెపి సభ్యులు పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ నిధులను సహకార బ్యాంకుల్లో జమ చేసే వెసులుబాటును కల్పిస్తే భవిష్యత్‌లో అవి దివాళా తీస్తే ఆర్థికంగా నష్టపోయే అవకాశం ప్రమాదం ఉందని, ఆ బ్యాంకులను మినహాయించాలని ప్రతిపాదించారు. ఇందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు స్పందిస్తూ గ్రామపంచాయతీల నిధులు ప్రైవేట్ సహకారం బ్యాంకులో జమచేయడం జరగదని, రైతుల నిధులతో కొనసాగుతున్న కేవలం ప్రభుత్వ అపెక్స్ బ్యాంకులలో మాత్రమే జమ చేసేందుకు అనుమతి ఉంటుందని, తద్వారా సహకార బ్యాంకులు ఆర్థికంగా వృద్ధి చెందడం ద్వారా రైతులకు సైతం లాభం చేకూరనుందని తెలిపారు. బిజెపి సభ్యుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు పొలం బాటలు వేయాలని, ఇందుకు విబిజి రామ్‌జి నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సైతం కొంత నిధులను కేటాయించాలని కోరారు. ఇందుకు మంత్రి సీతక్క మాట్లాడుతూ రానున్న అక్టోబర్ నెల నుంచి పొలం బాట పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎంఐఎం సభ్యులు మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంపిటిసి, జెడిపిటిసి ఎన్నికలు నిర్వహించకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయని ఎన్నికలు ఎప్పటి లోగా నిర్వహిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అసూయ సీతక్క గురువారం శాసనమండలిలో ప్రవేశపెట్టిన పంచాయితీ రాజ్ చట్టం 2018 సవరణ బిల్లును శాసన మండలి ఆమోదించింది. అంతకుముందు తొలుత బిల్లు ముఖ్య ఉద్దేశాలను మంత్రి సీతక్క సభకు వివరించారు.

## విలీనం చేయాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ద్వారా ఆర్‌టిసికి మరింత ప్రధాన్యత వచ్చిందన్నారు. బస్టాండ్‌లలో మరుగుదొడ్లు బాగా లేకపోవడంతో మహిళలు ఇబ్బందిపడుతున్నారని, ప్రయాణించేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్‌లలో పారిశుద్ధ్యాన్ని పాటించాలన్నారు. ఇతర దేశాలలో బస్టాండ్‌లు బాగా ఉంటాయన్నారు. ప్రతినెలా 15 బస్టాండ్లనైనా పరిశీలించాలని, తద్వారా అప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. ఆర్‌టిసి రవాణ వ్యవస్థలో అత్యంత ప్రధాన్యతకూడిన వ్యవస్థ అని, ఎపి, తెలంగాణలో రవాణ వ్యవస్థ అనేక సేవలను అందిస్తోందన్నారు. పేదలకు ఉపయోగపడే ఈ వ్యవస్థను విచ్ఛిన్నం, నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించారని, కార్మిక వర్గాల్లో ఆర్‌టిసిని ప్రైవేటీకరణ చేస్తారనే భయం ఉన్నదని, అందుకే విలీన ప్రక్రియను త్వరగా చేపట్టాలని సూచించారు.

## స్వరాష్ట్రంలోనూ ఆందోళనలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఎంతో కీలకమని, ప్రభుత్వం విద్యను సామాజిక బాధ్యతగా భావించి, తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నెల్లికంటి సత్యం కోరారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవడంతో బడుగు బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు**
**రూ.8,591.62 కోట్లు : మంత్రి అడ్లూరి**

రాష్ట్రంలో 2025 26 విద్యా సంవత్సరం వరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు బకాయిలు రూ.8,591.62 కోట్లు ఉన్నాయని రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న), నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతను తీర్చాలి**

తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతతో పేద రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శాసన మండలిలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న), సిపిఐ సభ్యులు నెల్లికంటి సత్యం 'ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రస్తుత పరిస్థితి'పై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన మందులు సకాలంలో అందకపోవడంతో రోగులు బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలో ఉన్న నిమ్స్, నీలోఫర్, గాంధీ ప్రభుత్వ ఆసుపత్రులలో మందుల కొరత ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందాల్సిన మందులు అందుబాటులో లేకపోవడం వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. గ్రతంలో ఉన్న అడ్వైజరీ కమిటీలు లేకపోవడంతో ప్రభుత్వ వైద్యులు ప్రైవేట్ ప్రాక్టీస్ వైపు ఎక్కువ మొగ్గు చూపుతున్నారని తెలిపారు. వెంటనే అడ్వైజరీ కమిటీలను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో పాటు జిల్లా కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్, డయాగ్నస్టిక్ సెంటర్లు తదితర వి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ఓట్లు గల్లంతు

**(మొదటి పేజీ తరువాయి)**

శాసనసభ కార్యకలాపాలు సజావుగా సాగకుండా కుట్ర చేసిందని ఆరోపించారు. అధికారం కోల్పోయినా బిఆర్‌ఎస్ నేతలు అహంకారం వీడలేదని, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభ సజావుగా సాగకుండా చేశారని సిఎం విమర్శించారు. అధికారుల పట్ల అనుచితంగా వ్యవహరించడంతో పాటు మహిళా అధికారుల ఎదుట టీషర్టులు విప్పి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. శాసనసభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. పోలీసు సిబ్బందిలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రేవంత్ రెడ్డిని చూసుకున్నట్టుగా ఉందని, అందుకే పోలీసు అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు పాల్పడ్డారని ఆయన వ్యాఖ్యానించారు. దళితుల కార్యక్రమాన్ని కూడా అవమానించేలా వ్యవహరించారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టిన సమయంలో దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని అన్నారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసిన కాంగ్రెస్ సభ్యులను ఆయన అభినందించారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరించేందుకు సభను నిర్వహిస్తున్నామని తెలిపారు.

**సభకు ఎమ్మెల్యేల హాజరు తప్పనిసరి**

ఎమ్మెల్యేలు తప్పనిసరిగా శాసనసభ చర్చల్లో పాల్గొనాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. సభ జరిగే అన్ని రోజుల్లో సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండేలా చూసుకోవాలని సిఎం ఆదేశించారు. ప్రజలు ఇచ్చిన పదవిని సక్రమంగా వినియోగించుకోకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా రాణించడం కష్టమవుతుందని హెచ్చరించారు. నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించి ప్రజల తరఫున బలంగా మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయంగా ఎదిగి, ఇప్పుడు అదే పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచిందని సిఎం అన్నారు. జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. తెలంగాణ నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**కలిసి పనిచేస్తే కుట్రలను ఛేదించగలం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

కాంగ్రెస్ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తే ప్రతిపక్షాల కుట్రలను ఎలా ఛేదించవచ్చో చేసి చూపించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బిఆర్‌ఎస్ నాయకుల తీరు, వారి భాష, దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించిన తీరుపై సభ్యులంతా గట్టిగా గళమెత్తి కట్టడి చేయగలిగామన్నారు. ఇదే పోరాట స్ఫూర్తితో ఇకముందూ మనమంతా ఒకే మాట ఒకే బాటగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనన్ని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వం చేస్తున్న పనులకు తగిన ప్రచారం కల్పించకపోవడం వల్లే ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం లభిస్తోందన్నారు. ప్రభుత్వం సాధించిన విజయాలను సరైన రీతిలో ప్రజల్లోకి తీసుకెళ్తే ఆ ప్రచార ప్రవాహంలో ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయని భట్టి వ్యాఖ్యానించారు. సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి వివరించాలని సూచించారు. చిన్న పొరపాటుకు కూడా తావులేకుండా కులసర్వే నిర్వహించి, దాని ఆధారంగా రూపొందించిన వివరాలను శాసన సభలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపామని భట్టివిక్రమార్క తెలిపారు. సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులే రానున్న ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయని భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రతి గ్రామంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు ఎంతో సంతృప్తిగా ఉన్నారని, వారి అనుభవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ప్రచార కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

**దేశంలో సర్ ప్రక్రియ దుర్మార్గంగా సాగుతోంది: మహేష్ మార్ గౌడ్**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్) ప్రక్రియ దుర్మార్గంగా సాగుతోందని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. తమకు అనుకూలం కాదని భావించిన ఓట్లను పెద్ద సంఖ్యలో తొలగిస్తున్నారని, ముఖ్యంగా దళితులు, గిరిజనుల ఓట్లే అధికంగా తొలగిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో భారీ సంఖ్యలో ఓట్లు గల్లంతవుతున్నాయని, పకడ్బందీగా ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు.

సర్ ప్రక్రియపై సిఎం రేవంత్ రెడ్డి పలుమార్లు సమీక్షలు నిర్వహించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా సర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బిసి బిడ్డ కాకపోయినప్పటికీ సిఎం రేవంత్ రెడ్డి బిసిల రిజర్వేషన్ల కోసం ముందుకు వచ్చారని, బిసి రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం సహకరించడంలేదని విమర్శించారు.

**వచ్చే రెండున్నరేళ్లు కీలకం**

కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చే రెండున్నర సంవత్సరాలు అత్యంత కీలకమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ రెండున్నర కాలంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఓటర్ల జాబితా పరిరక్షణపై ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఎమ్మెల్యే పనితీరు, క్షేత్రస్థాయి కార్యకలాపాలు కీలకంగా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు.

## జిన్‌పింగ్

**(మొదటి పేజీ తరువాయి)**

అనిశ్చితిలో ఉన్నదశలో బ్రిక్స్ దేశాల సహకారంతో పాటు ఆసియా అగ్రదేశాలమధ్య సమతుల్యత ఆవశ్యకత,ప్రత్యేకించి పశ్చిమాసియా, రష్యా–ఉక్రేన్ యుద్ధాల గురించి కూడా నాయకులమధ్య సంభాషణ జరిగే అవకాశాలున్నాయి. జిన్‌పింగ్ 2019లో భారత్‌లో పర్యటించారు. మళ్ళీ ఆయన భారత్ పర్యటన ఇదే. అంతకుముందు 2016లో గోవాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో కూడా ఆయన పాల్గొన్నారు.2014లో మొదటిసారి జిన్‌పింగ్ భారత్‌లో పర్యటించి మోదీతో విస్తారంగా చర్చలు జరిపారు. రెండు రోజుల్లో జిన్‌పింగ్ భారత్ పర్యటన అనేక విధాలుగా ప్రాముఖ్యత సంతరించుకుంది.

# దులీప్ ట్రోఫీ గెలుచుకున్న ఈస్ట్ జోన్

దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో ఈస్ట్ జోన్ చరిత్ర సృష్టించింది. చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా ఈస్ట్ జోన్, సౌత్ జోన్ను ఓడించి 13 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ టైటిల్‌ను గెలుచుకుంది. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ.. వారి తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఈస్ట్ జోన్‌ను ఛాంపియన్‌గా నిలిపింది. ఆసక్తకర విషయం ఏమిటంటే.. 13 ఏళ్ల క్రితం ఎంఎ చిదంబరం స్టేడియంలో జరిగిన దులీప్ ట్రోఫీ టైటిల్‌ను కూడా ఈస్ట్ జోన్ గెలుచుకుంది. మొత్తంగా ఈస్ట్ జోన్‌కు ఇది మూడో దులీప్ ట్రోఫీ టైటిల్. మ్యాచ్ ముగియగానే ఇరు జట్ల కెప్టెన్లు కరచాలనం చేసుకుని మ్యాచ్ ముగింపును సూచించారు. అనంతరం ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలో సంబరాల్లో మునిగిపోయారు. కెప్టెన్ ఇషాన్ కిషన్, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ చేతుల్లో వికెట్లతో డ్యాన్స్ చేస్తూ కనిపించారు. జట్టు మొత్తం స్టేడియం చుట్టూ ప్రదక్షిణ చేసి ప్రేక్షకులకు అభివాదం చేసింది.




### హీరోగా నిలిచిన ఇషాన్ కిషన్

ఈస్ట్ జోన్ విజయంలో కెప్టెన్ ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. రెడ్‌బాల్ క్రికెట్లోకి తిరిగి వచ్చినప్పటి నుంచి ఇషాన్ కిషన్ క్రమంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ దులీప్ ట్రోఫీ ఫైనల్లో తన అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్లో ఇషాన్ కిషన్ ఒక్కడే 270 పరుగులు చేశాడు. ఇషాన్ కిషన్ 334 బంతులు ఎదుర్కొని 522 నిమిషాల పాటు క్రీజులో నిలిచాడు. ఈ ఇన్నింగ్స్ పరుగుల పరంగానే కాకుండా, టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన ఓర్పు, పోరాట స్ఫూర్తిని కూడా ప్రదర్శించింది. కండరాల నొప్పుల కారణంగా ఇషాన్ 250 పరుగుల వద్ద గాయపడి రిటైర్ అయ్యాడు. అయినప్పటికీ ఇషాన్ కిషన్ పట్టు వదలలేదు. తిరిగి మైదానంలోకి వచ్చి స్కోరును 270కి చేర్చాడు. కానీ కెప్టెన్ కథ అక్కడితో ముగియలేదు. ఇషాన్ కిషన్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా కీలకమైన 80 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో ఫైనల్లో ఇషాన్ మొత్తం పరుగులు 350కి చేరి, మ్యాచ్‌లో అత్యంత ఆకట్టుకున్న బ్యాటర్‌గా నిలిచాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్ చివరి రోజున మరో పేరు వార్తల్లో నిలిచింది. మహమ్మద్ కోనన్ ఖురేషి అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఖురేషి ఆట తీరు చూస్తే అతను చాలాకాలంగా ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడుతున్నట్లు అనిపించింది. తీవ్ర ఒత్తిడితో సాగిన ఈ మ్యాచ్లో అతని ఆత్మవిశ్వాసం, బ్యాటింగ్ శైలి స్పష్టంగా కనిపించాయి. అతను తన సెంచరీని పూర్తి చేసి, చివరి వరకు నాటౌట్‌గా నిలిచాడు. టైటిల్ దాదాపు ఖాయమైన సమయంలో ఈస్ట్ జోన్ తరపున ఈ ఇన్నింగ్స్ ఆడినప్పటికీ.. ఖురేషి తన అరంగేట్రాన్ని చిరస్మరణీయం చేసుకోవడానికి శాయశక్తులా కృషి చేశాడు.

### పోరాట స్ఫూర్తిని ప్రదర్శించిన మహమ్మద్ సిరాజ్

ఈస్ట్ జోన్‌ను అడ్డుకునేందుకు సౌత్ జోన్‌కు చెందిన మహమ్మద్ సిరాజ్ శాయశక్తులా కృషి చేశాడు. మ్యాచ్ ఫలితం దాదాపుగా తేలిపోయినప్పటికీ, సిరాజ్ తన సర్వశక్తులూ ఒడ్డి పోరాడాడు. సిరాజ్ చెన్నైలోని కఠినమైన, సవాలుతో కూడిన పరిస్థితులలో వరుసగా తొమ్మిది ఓవర్లు బౌలింగ్ చేశాడు. మ్యాచ్ ఫలితం తేలిపోయిన తర్వాత కూడా అతను బౌలింగ్ కొనసాగించడం అతని పోరాట స్ఫూర్తిని చాటింది. ఇదే ఫస్ట్‌క్లాస్ క్రికెట్ గొప్పతనం. ఫలితం కళ్ల ముందు కనిపిస్తున్నప్పటికీ, ఆటగాళ్లు చివరి బంతి వరకు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ప్రయత్నిస్తారు.

### 13 ఏళ్ల నిరీక్షణకు తెర

13 ఏళ్ల నిరీక్షణ అనంతరం ఈస్ట్ జోన్ ఆటగాళ్లు వారు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న దులీఫ్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. . తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా వారు దక్షిణ జోన్‌ను అధిగమించి దులీప్ ట్రోఫీ గెలుచుకున్నారు. ఇషాన్ కిషన్ నాయకత్వంలో సాధించిన ఈ విజయం అనేక విధాలుగా ప్రత్యేకమైనది. కెప్టెన్ బ్యాట్‌తో 350 పరుగులు చేయగా, అరంగేట్రం చేసిన కోనన్ ఖురేషి సెంచరీ సాధించాడు. సిరాజ్ చివరి వరకు పోరాట స్ఫూర్తిని ప్రదర్శించాడు. వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లు కూడా జట్టు సంబరాల్లో తమ ఉనికిని చాటుకున్నారు.

# ఆసియా కప్..ఫైనల్ దూసుకెళ్లిన భారత్

మహిళల ఆసియా కప్‌లో భారత్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమిఫైనల్ బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో విజయం సాధించింది. 150 పరుగుల లక్ష్య చేధనకు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 109 పరుగులకే పరిమితమైంది. మిండియా ఓపెనర్ షెఫాలీ వర్మ చరిత్ర సృష్టించింది. మహిళల ఆసియా కప్ టీ20 టోర్నీ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్గా నిలిచింది. దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ 2026 టోర్నీలో భాగంగా బంగ్లాదేశ్తో సెమీఫైనల్లో షెఫాలీ వర్మ(40 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సులతో 64) హాఫ్ సెంచరీ చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించింది. ఈ క్రమంలో స్మృతి మంధాన, హర్మన్ ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, రిచా ఘోష్లను షెఫాలీ వర్మ వెనక్కినెట్టింది. ఇప్పటి వరకు మహిళల ఆసియాకప్ టీ20 టోర్నీలో 20 ఇన్నింగ్సు ఆడిన షెఫాలీ వర్మ 593 పరుగులు చేసింది. 18 ఇన్నింగ్స్లో స్మృతి మంధాన 590, హర్మన్‌ప్రీత్ కౌర్ 465, జెమీ రోడ్రిగ్స్ 345 పరుగులు చేశాడు. 17 ఇన్నింగ్స్లో రిచా ఘోష్ 231 పరుగులు చేసింది. ఈ మ్యాచ్లో టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 149 పరుగులు చేసింది. షెఫాలీ వర్మ హాఫ్ సెంచరీతో సత్తా చాటగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(24), రిచా ఘోష్(21), ప్రతికా రావల్(20) పర్వాలేదనిపించారు. స్మృతి మంధాన(2), దీప్తి శర్మ(13), భార్తి ఫుల్మాలి(0) తీవ్రంగా నిరాశపర్చారు. బంగ్లాదేశ్ బౌలర్లలో సుల్తాన ఖాటున్ రెండు వికెట్లు తీయగా.. మరుఫా అక్తర్, నహిదా అక్తర్, రబెయా ఖాన్ తలో వికెట్ తీసారు.



## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

### ఆసియా రాజ్యాల మొదటి సభ
### ఏ నగరంలో జరిగింది?

- వారన్ హేస్టింగ్స్ ఖజానాను ముర్షిదాబాదు నుండి ఇచ్చటకు మార్చాడు?
  కలకత్తా
- రెగ్యులేటింగ్ చట్టము?
  క్రీ.శ. 1773
- టిప్పుసుల్తాన్ మరణం?
  క్రీ.శ. 1799
- మొదటి మైసురు యుద్ధంలో హైదరాలీచే ఓడింపబడినది?
  ఆంగ్లేయులు
- మనదేశంలో సివిల్ సర్వీసులు ప్రారంభించినది:
  కారన్వాలీస్
- వెసూవియస్ అగ్నిపర్వతం గల దేశం?
  ఇటలీ
- ఎడారి ప్రాంతాల ముఖ్య పంట
  ఖర్జూరం
- ఏ సంవత్సరంలో రిజర్వుబ్యాంకు స్థాపించారు.?
  1935
- ఎవరి పాలన కాలంలో మెగస్తనీస్ ఇండియాను సందర్శించాడు?
  చంద్రగుప్త మౌర్య
- దీన్‌ఇఇలాహి మతాన్ని స్థాపించినది?
  అక్బర్
- ఆహార పదార్థాలలో, సబ్బుల తయారీలో, నూలు వస్త్ర పరిశ్రమల్లో ఉపయోగించునది
  ఆలివ్ నూనె
- దిల్లీకి ఉత్తరంగా ప్రవహించుచున్న నది?
  యమున
- ఉష్ణవికిరణాన్ని ఈ పరికరంతో గుర్తించవచ్చు:
  థర్మోస్కోప్
- పక్షులను గురించి తెలియజేయు శాస్త్రము:
  ఆర్నిథాలజి
- విద్యుద్దీపము బల్బులో గాలిని తొలగించి దీనిని నింపుతారు:
  నైట్రోజన్
- లౌకికతత్వాన్ని ప్రబోధించే బాధ్యత?
  ప్రభుత్వానిది
- పరమత సహనాన్ని ప్రదర్శించిన చక్రవర్తి?
  అశోకుడు
- ఆసియా రాజ్యాల మొదటి సభ ఈ నగరంలో జరిగింది?
  న్యూఢిల్లీ
- రాజ్యాంగ పరిషత్ ఏర్పాటును గూర్చి మొట్ట మొదటగా ప్రతిపాదించినది?
  క్రిప్సు మిషన్
- తల్లిపాలను స్రవించడానికి ఉపయోగపడే హార్మోను పేరేమిటి?
  లాక్టోజనిక్ హార్మోన్
- మెదటి పంచవర్ష ప్రణాళిక ఏ సంవత్సరంలో ప్రారంభించబడెను?
  1951
- దీనికి రంగు, రుచి ఉండదు. దీన్ని పీలిస్తే మరణం సంభవించును?
  కార్బన్ మోనాక్సైడ్



- వానపాములతో తయారయ్యేది?
  వర్మికంపోస్ట్
- సముద్రపు మొక్కలు దీనిని నిక్షిప్తం చేసుకుంటాయి?
  అయోడిన్
- హృదయంలో గదుల సంఖ్య?
  4
- మానవుడు మొట్ట మొదటిసారిగా చంద్రుడు మీద కాలు మోపిన సంవత్సరం ఏది?
  1969
- ప్రభుత్వానికి గల నియమ నిబంధనలే....
  రాజ్యాంగ చట్టాలు
- కోల్‌కతా ప్రధాన కేంద్రంగా కలిగిన రైల్వే మండలం:
  ఆగ్నేయ రైల్వే
- శ్రేణులు అనగా :
  వృత్తి సంఘాలు
- Poverty in India (భారతదేశంలో పేదరికం) అను గ్రంధాన్ని వ్రాసినవారు?
  దండేకర్, నీలకంఠరధి
- పెల్లగ్రా చర్మవ్యాధి దీని లేమి వల్ల వస్తుంది?
  నియాసిస్
- మనదేశంలో బ్యాంకుల జాతీయాకరణ ఎప్పుడు జరిగింది?
  1969
- 'హరిత విప్లవం' అను పదాన్ని మొదట ఉపయోగించిన శాస్త్రవేత్త?
  విలియం ఎస్.గాడ్
- ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
  జులై 11
- పత్తి, పొగాకు, చెరకు మొదలైన పంటలకు అత్యధిక దిగుబడిని అందించే నేలలు ఏవి?
  నల్లరేగడి నేలలు
- పంచదార కర్మాగారాలు ఏ రాష్ట్రంలో ఎక్కువ ఉన్నాయి?
  ఉత్తరప్రదేశ్
- ప్రజాస్వామ్యానికి నిర్వచనాన్ని ఇచ్చింది?
  అబ్రహాం లింకన్
- 'వింగ్స్ ఆఫ్ ఫైర్' పుస్తక రచయిత ఎవరు?
  ఎ.పి.జె. అబ్దుల్ కలాం
- 'పసుపు విప్లవం' దేనికి సంబంధించినది?
  నూనె గింజలు
- ఎక్కువ కెలోరిఫిక్ విలువ గల పదార్థం?
  జున్ను
- ఈ గ్రహం మీద కూడా ప్రాణులు జీవించవచ్చునని నమ్ముతున్నారు
  కుజుడు
- మహల్ వ్యవస్థ ఇక్కడ అమలులో ఉండేది?
  పంజాబ్
- భూభ్రమణ వేగం గంటకు:
  1610 కి.మీ.
- అంతర్జాతీయ యోగ దినోత్సవం?
  జూన్ 21

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వీరనారి చాకలి ఐలమ్మ సాగించిన అసమాన పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని, నేటి తరానికి ఆమె ఆదర్శప్రాయురాలని సిపిఐ జిల్లా భద్రాద్రి కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. ఐలమ్మ వర్థంతి సందర్భంగా కొత్తగూడెం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన పలు వర్థతి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటి భూస్వామ్య పెత్తందారీ దోపిడీ విధానాలపై దేశ్‌ముఖ్ దౌర్జన్యాలపై ఎర్రజెండా అండతో ఎదురొడ్డి నిలిచిన వీర వనిత ఐలమ్మ అన్నారు. తన పంటను కాపాడుకోవడం కోసం ఆమె చేసిన తిరుగుబాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దిక్సూచిగా మారిందన్నారు. ఆ మహత్తర పోరాట వెట్టచాకిరీ నిజాం నిరంకుశ పాలన బానిస సంకెళ్లను తెంచి పీడిత ప్రజల విముక్తికి బాటలు వేసిందన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో భూసమస్యలపై రాజీలేని ఉద్యమాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఇంద్రాలి మురళీ రాచర్ల వెంకటయ్య రాజు పాల్గొన్నారు.



భద్రాద్రిలో....

**శేషగిరిభవన్‌లో...** చాకలి ఐలమ్మ వర్థంతి జిల్లా కేంద్రంలోని స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, బిసి సంఘం జిల్లా నాయకులు నేరెళ్ల రమేష్, రత్నకుమారి, రేసు ఎల్లయ్య, బోయిన విజయ్‌కుమార్, దుర్గయ్య, నల్లా శ్రీనివాస్, కైసర్, గద్దం సతీష్, రాజు, సర్వేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** చిట్యాల ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ వర్థంతి సందర్బంగా స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా దండి సురేష్ మాట్లాడుతూ ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, సిహెచ్.సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, పావులూరి మల్లికార్జున్, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, గాదె లక్ష్మినారాయణ, పేరబోయిన మోహన్‌రావు, పోటు పూర్ణచందర్ రావు, సిపిఐ కార్యాలయ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**పెద్దకొత్తపల్లి :** పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఐలమ్మ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పెబ్బేటి విజయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు టి.నరసింహ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు తన్నీరు మల్లయ్యతో కలిసి వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫయాజ్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ చేసిన తెగింపు పోరాటం నేటి తరాలకు ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు సాయిలు, రాధాకృష్ణ, లక్ష్మణ్, స్వామి, పర్వతాలు, ప్రకాష్, శివప్రసాద్, ఆంజనేయులు, కొత్త సంతోష్, గణేష్ గౌడ్, హసన్, బాలస్వామి, శివ, కొత్త భగవంతు తదితరులు పాల్గొన్నారు.

**పానుగల్ :** భూమి కోసం భుక్తి కోసం పేదల వెట్టి చాకిరి విముక్తి కోసం రజాకార్లు దొరలను గడీల నుంచి తరిమికొట్టిన వీర వనిత ఐలమ్మని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరామ్, మాజీ వార్డు సభ్యుడు లక్ష్మీనారాయణ అన్నారు. పానుగల్ మండలం కేతేపల్లిలో సిపిఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్థంతిని ఘనంగా నిర్వహించారు. విగ్రహానికి ఉప సర్పంచు కృష్ణవేణి, మహిళా వార్డు సభ్యులు కురుమమ్మ డంగు లక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ కళావతమ్మ, ఉపసర్పంచ్ కృష్ణవేణి, సిపిఐ మండల కార్యదర్శి కురుమయ్య, నాయకులు శివ కుమార్, మాల కుర్మయ్య, లక్ష్మీనారాయణ, కాశన్న, సాయిలీల, శంకరమ్మ, ఎల్లయ్య, చెన్నమ్మ, లక్ష్మి, దేవమ్మ, మాల చెన్నయ్య, బీరయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నాగర్ కర్నూల్‌లో...


వనపర్తిలో...


భద్రాద్రిలో....



ఖమ్మంలో...

# సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

**ప్రజాపక్షం/చిట్యాల :** భూమి కోసం, భుక్తి కోసం దొరలు, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మట్టి మనుషులు సాగించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని హిందూ–ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ చరిత్రను వక్రీకరించేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో సిపిఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ నాడు నైజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన రైతాంగ సాయుధ పోరాటం అగ్నికణంలా రగిలి, మహత్తర ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. ఈ పోరాటంలో నాలుగు వేల మంది అమరవీరుల త్యాగాలతో చరిత్ర ఎరుపెక్కిందన్నారు. సెప్టెంబర్ 17 పేరుతో సాయుధ పోరాట అమరవీరులను స్మరించుకునే పేరుతో బిజెపి చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల పాత్రను మరుగునపరచే ప్రయత్నాలను ఖండించారు. సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సాయుధ పోరాట చరిత్రకు నిలయమైన మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద శుక్రవారం వారోత్సవాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి సీమ అంజయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి ఎం.డి.అక్బర్, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి జిల్లా యాదయ్య, గ్రామ శాఖ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు బొబ్బల శంకర్‌రెడ్డి, బొడిగె బక్కశెట్టి, ఎర్పుల రాములు, కోయగూర మారయ్య, కసర్ల లింగస్వామి పాల్గొన్నారు.




# కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై.ఓమయ్య

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ రైజ్ చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 6,7,8 తేదీలలో కరీంనగర్ పట్టణంలో ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. మహాసభల్లో రాష్ట్రంలో, దేశంలో వివిధ రంగాలలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘ చర్చ అనంతరం పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దుచేసిన 44 రకాల చట్టాలను పునరుద్దరించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేయాలి. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికుల కనీస వేతనం 26 వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులరైజ్ చేయాలని, హమాలీ కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల వలే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలు అమలు చేయాలి, 2019 మోటర్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలి, కార్మికుల కనీస పెన్షన్ 15 వేలు అమలు చేయాలి, తదితర అంశాలతో పాటు 45 రకాల కార్మికుల సమస్యలపై తీర్మానాలను ఆమోదించడం జరిగిందన్నారు. రాబోయే కాలంలో సమస్యల పరిష్కారానికి మిలిటెంట్ పోరాటాలను నిర్వహించాలని మహాసభ తీర్మానించిందన్నారు. రాష్ట్రకమిటీలో నిజామాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా వై.ఓమయ్య, కార్యవర్గ సభ్యులుగా పిన్నెల హనుమాండ్లు, రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్.దేవేందర్, ఎస్.కవిత, గోవర్ధన్‌లను ఎన్నుకున్నందుకు రాష్ట్ర నాయకత్వానికి జిల్లా సమితి పక్షాన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హనుమాండ్లు, దేవేందర్, టి.చక్రపాణి, ఎస్.కవిత, గోవర్ధన్, బి.అనిల్, రాధా కుమార్, ఫెరోజ్ అలీ, భానుచందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.





శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

టిజిఇజెఎసి ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత ఆర్థిక శాఖతో సమావేశమై, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సమీక్షించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీనిచ్చారని 'తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ' (టిజిఇజెఎసి) తెలిపింది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో మరోసారి సమావేశమై, అన్ని అంశాలపై చర్చించి, పరిష్కరిస్తామని, ఉద్యోగ సంఘాల కోసం తన కార్యాలయ ద్వారాలు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిత్యం అందుబాటులో ఉంటుందని సిఎం స్పష్టం చేసినట్లు జెఎసి ప్రతినిధులు వెల్లడించారు. "తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు,పెన్షనర్ల తరఫున తమ సమస్యలను పరిష్కరించాలని" కోరుతూ టిజిఇజెఎసి ప్రతినిధులు శాసనసభ ప్రాంగణంలోని సిఎం చాంబర్‌లో సిఎం రేవంత్ రెడ్డిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లారు. రెండవ పిఆర్‌సి నివేదిక 51 శాతం ఫిట్‌మెంట్,పెండింగ్‌లోని ఆరు డిఎలు, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఆరు కరువు భత్యాలలో కనీసం మూడు డిఎలను తక్షణమే విడుదల చేయాలని జెఎసి ప్రతినిధులు సిఎంను విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన రూ.10వేల కోట్లకు పైగా ఉన్న పెండింగ్ బిల్లులను త్వరితగతిన విడుదల చేయాలని, ప్రస్తుతం ప్రతి నెలా చెల్లిస్తున్న వెయ్యి కోట్ల రూపాయలను రూ.రెండువేలకు పెంచి, ఇందులో వెయ్యి కోట్లు ఉద్యోగులకు, మరో వెయ్యి కోట్లు పెన్షనర్లకు విడుదల చేయాలని జెఎసి ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కొత్త ఉద్యోగులకు ఆరోగ్య పథకాన్ని (ఎన్‌హెచ్ఎస్) ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం కలిగే విధంగా సక్రమంగా అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లపై సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని జెఎసి ప్రతినిధులు తెలిపారు. సిఎంను కలిసినవారిలో టిజిఇజెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు,అదనపు సెక్రెటరీ జనరల్ దామోదర్ రెడ్డి, కో చైర్మన్లు సదానందంగౌడ్(ఎస్‌టియు),చావ రవి (యుటిఎఫ్), గౌతమ్ కుమార్(టిఆర్ఇఎస్ఎ)కటకం రమేష్, నాయకులు ముజీబ్ హుస్సేన్(టిఎన్‌జిఒ),బి.శ్యామ్,వెంకట్, రమణారెడ్డి, బిక్షంగౌడ్ తదితరులు ఉన్నారు.

# సిఎబిని తక్షణం రద్దు చేయాలి

## ఎఐటియుసి డిమాండ్

ప్రధాన కార్మిక సంఘాలను మినహాయించడంపై తీవ్ర అభ్యంతరం

కనీస వేతనాలు నిర్ణయించే బోర్డులో ఏకపక్ష నియామకాలు

ఉద్యోగ ప్రతినిధులకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి

కేంద్రమంత్రి మాండవీయకు అమర్‌జీత్ కౌర్ ఘాటు లేఖ



**న్యూఢిల్లీ :** కనీస వేతనాలు నిర్ణయించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్ర సలహా మండలి (సిఎబి)లో దేశంలోని ప్రధాన కార్మిక సంఘాలకు తగిన, సమానస్థాయి ప్రాతినిధ్యం ఇవ్వలేదని, తక్షణం ఈ సలహా మండలిని రద్దుచేసి ప్రాతినిధ్య ప్రజాస్వామ్య స్ఫూర్తితో తిరిగి ఏర్పాటు చేయాలని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ డిమాండ్ చేశారు. 2019 నాటి వేతన నియమావళిలోని సెక్షన్ 42 (1) కింద ఏర్పాటు చేసిన కేంద్ర సలహా మండలిని పునర్నిర్మించాలని కోరారు. సిఎబిలో ప్రతినిధుల కూర్పులో కేంద్రం ఏకపక్షంగా వ్యవహరించిందని, వేతనాల నిర్ణయంలో సిఎబి ఒక నిజమైన త్రైపాక్షిక సంస్థగా పనిచేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర కార్మిక,ఉపాధి శాఖామంత్రి డా.మన్సుఖ్ మాండవీయకు అమర్‌జీత్ కౌర్ రాసిన ఒక లేఖను గురువారం ఎఐటియుసి ప్రధాన కార్యాలయం పత్రికలకు విడుదల చేసింది. ఎఐటియుసికి తగిన ప్రాతినిధ్యం లేనందువల్ల తీవ్రంగా పరిగణిస్తున్నామని ఆ లేఖలో తెలియజేశారు. ఎలాంటి అరమరికలు లేకుండా పునఃసమీక్షించి బాహాటత్వ పద్ధతిలో ఈ మండలిని పునర్నిర్మించాలని కోరారు. సెక్షన్ 43 (1) కింద ఈ మండలి కనీస వేతనాలు నిర్ణయించడంలో, సమీక్షించడంలో సంబంధిత ఇతర విషయాలలో కూడా కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుందని, ఈ నిర్ణయాలు, సిఫార్సులు లక్షలమంది కార్మికులపై ప్రభావం చూపిస్తాయని, అందువల్ల ఈ నియామకాలు న్యాయబద్ధంగా, నిబంధనలకు, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యస్ఫూర్తికి అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రధాన కార్మిక సంఘాలను మినహాయిస్తూ ఈ సిఎబిని ఏర్పాటు చేశారని, ఈ మేరకు జులై 21వ తేదీన కేంద్ర కార్మిక, ఉపాధిమంత్రిత్వశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్ (ఎస్ఓ 3985–ఇ)ను తక్షణం రద్దు చేయాలని కోరారు. ఈ ప్రాతినిధ్యం కేంద్ర కార్మిక సంఘాల ఉద్యమ స్వభావాన్ని, సంస్థాగత పరిధిని, వాస్తవ ఉనికిని ప్రతిబింబించాలని కానీ కేంద్రం నోటిఫికేషన్ అందుకు అనుగుణంగా లేదని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సెక్షన్ 42 ప్రకారం, ఉద్యోగుల తరపు ప్రతినిధులు, యాజమాన్యాల ప్రతినిధులు,స్వతంత్ర వ్యక్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో ఈ మండలిని ఏర్పాటు చేయాలి. వేతనాలకు సంబంధించిన నిర్ణయాలు, సిఫార్సులు లక్షలాదిమంది కార్మికులను, ముఖ్యంగా తక్కువ వేతనాలు పొందే ఉద్యోగార్థులను, నిత్యం అభద్రతాభావంతో ఉండే వారిని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని స్పష్టం చేశారు. ప్రస్తుత కేంద్ర సలహా మండలి కూర్పు త్రైపాక్షిక సూత్రాన్ని కించపరిచిందని, భిన్నంగా వ్యవహరించి సిఎబి విశ్వసనీయతను దిగజార్చిందని విమర్శించారు. కనీస వేతనాల నిర్ణయించడానికి ఉద్దేశించిన కేంద్ర సలహా బోర్డులో 2021 నియమావళి ప్రకారం, ఉద్యోగుల తరపు ప్రతినిధులను, యాజమానుల తరపు ప్రతినిధులను సమానస్థాయిలో చెరో 12 మంది చొప్పున నియమించాలని ఏర్పాటు చేస్తారు. కానీ ఈ మండలిని ఏర్పాటు చేయడంలో దేశంలో కోట్లాదిమంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే ఎఐటియుసి సహా ఇతర ప్రధాన కార్మిక సంఘాలకు తగిన ప్రాధాన్యత కేంద్రం ఇవ్వలేదు. దీంతో ఈ మండలి నియామకాన్ని ఎఐటియుసి తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖ రాశారు. ఇతర కార్మిక సంఘాలు కూడా ఇంత తీవ్రమైన హెచ్చరికలు చేస్తూ కేంద్రానికి తమ నిరసనలు తెలియజేశాయి. సమ్మెలు కొనసాగిస్తామని కూడా హెచ్చరించాయి. దేశ కార్మిక రంగంలో ఉన్న గణనీయమైన వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎఐటియుసి సహా ఇతర కార్మిక సంఘాలకు తగిన ప్రానిధ్యం ఇవ్వనందువల్ల కేంద్ర ప్రభుత్వానికి తీవ్ర అభ్యంతరం తెలియజేస్తున్నామని కేంద్రమంత్రికి తన లేఖలో అమర్‌జీత్ కౌర్ స్పష్టం చేశారు.

## గజ్వేల్ ఎసిపి ఆధ్వర్యంలో క్లూస్ టీం ఆధారలు సేకరణ

పసుపు నీటి శుద్ధిఘటనతలో మూడు కేసులు నమోదు

ఎర్రవెల్లి, వర్ధరాజుపూర్, ఫామ్‌హౌస్ ఘటనలపై పోలీసుల చర్యలు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవెల్లి, వర్ధరాజుపూర్ గ్రామాలతో పాటు ఫామ్‌హౌస్ పరిసరాల్లో చోటుచేసుకున్న పసుపు నీటితో ప్రదేశాలను శుద్ధి చేసిన ఘటనలపై పోలీసులు మూడు వేర్వేరు కేసులు నమోదు చేశారు. గజ్వేల్ ఏసిపి నర్సింలు ఆధ్వర్యంలో క్లూస్ టీం పర్యటించి ఆధారాలు సేకరించారు. దళితులు నడిచిన నెలను బిఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారని సీరియస్‌గా తీసుకున్న సిఎం రేవంత్‌రెడ్డి ఈఘటనపై విచారణ అధికారిగా గతంలో సిద్దిపేట సిపిగా పనిచేసిన విజయ్‌కుమార్‌ను నియమించారు. రెండురోజుల్లో జాయింట్ కమిషనర్ విజయ్‌కుమార్ ఈ ప్రాంతాలను పర్యటించనున్నట్లు తెలిసింది.

## సెక్రటేరియట్‌లో ఎసిబి దాడులు

రూ.లక్ష లంచం తీసుకుంటూ చిక్కిన ఇద్దరు అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయంలో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్‌ఎఫ్) కింద వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు రూ.లక్ష లంచం తీసుకుంటూ ఇద్దరు అధికారులు ఎసిబికి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. హైదరాబాద్ సిటీ రేంజ్–2 ఎసిబి అధికారులు గురువారం వలపన్ని వారిని పట్టుకున్నారు. సచివాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఆనందేశి రాఘవేందర్ , బషీర్‌బాగ్‌లోని పరిశ్రమల భవన్‌లో తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎస్ఐడిసి)లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేడి వినోద్ లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి సిఎంఆర్‌ఎఫ్ వైద్య రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను ప్రాసెస్ చేయడంతో పాటు మంజూరైన రూ.2 లక్షల చెక్కు జారీ చేయడం, మిగిలిన వైద్య రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌ను తదుపరి ప్రక్రియకు పంపేందుకు అధికారులు రూ.లక్ష లంచం డిమాండ్ చేశారు. దీంతో ఫిర్యాదుదారు ఎసిబిని ఆశ్రయించారు. ఇదే వ్యవహారంలో గతంలో వీరిద్దరు ఫోన్‌పే లావాదేవీ రూపంలో ఫిర్యాదుదారుడి నుంచి రూ.5 వేల లంచం తీసుకున్నట్లు ఎసిబి వెల్లడించింది. తాజాగా మరోసారి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వినోద్ ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష స్వీకరించి రాఘవేందర్‌కు అప్పగించారు. లంచం సొమ్ము రూ.లక్షను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు విధులను అక్రమంగా, నిజాయితీకి విరుద్ధంగా నిర్వహించి అనుచిత ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఎసిబి పేర్కొంది. నిందితులిద్దరినీ నాంపల్లిలోని ప్రత్యేక ఎసిబి కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎసి ఎసిబి తెలిపింది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

**లంచం డిమాండ్ చేస్తే 1064కు ఫిర్యాదు చేయండి..**
ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఎసిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064 కు సమాచారం ఇవ్వాలని ఎసిబి సూచించింది. వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫిర్యాదుదారుడి పేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది.

## రాయదుర్గం భూముల వేలం వివరాలివ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాయదుర్గం సర్వే నెం.83/1లోని ఐదు ఎకరాల్లో రెండు ప్లాట్లను విభజించి లేఅవుట్ సవరించి ఈవేలం నిర్వహించడంపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేఅవుట్ ప్లాన్, ప్లాట్ నంబర్ల మార్పులకు సంబంధించిన వివరాలను కౌంటర్‌లో వెల్లడించాలని పేర్కొంటూ తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది. వేలాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ ప్రాంతాన్ని గతంలో చారిత్రక, శిలా రక్షణ ప్రాంతంగా గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి నిబంధనల ప్రకారమే వేలం నిర్వహించామని తెలిపారు.

## ర్యాలీలకు అనుమతి ఇవ్వండి

పోలీసు కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జాతీయ పతాకాలతో ఈనెల 12, 15 తేదీల్లో నిర్వహించనున్న బైక్ ర్యాలీలకు షరతులతో అనుమతి ఇవ్వాలని పోలీసు కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ర్యాలీలకు అనుమతి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన రెండు పిటిషన్లను జస్టిస్ మాధవీదేవి విచారించారు. బాలాపూర్ శివాజీ చౌక్ నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వరకు, అక్కడి నుంచి అసెంబ్లీ సమీపంలోని సర్దార్ పటేల్ విగ్రహం వరకు ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి కోరినట్లు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. ర్యాలీలతో మతపరమైన హింసకు అవకాశం ఉందని ప్రభుత్వం తరఫు న్యాయవాది పేర్కొనగా, తగిన షరతులతో అనుమతి ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారు.

## ఆర్22 గ్రేస్ మార్కులపై వివరణ ఇవ్వండి

జెఎన్‌టియుహెచ్‌కు హైకోర్టు నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్22 విద్యార్థులకు గ్రేస్ మార్కుల విషయంలో అనుసరించిన విధానంపై వివరణ ఇవ్వాలని జెఎన్‌టియుహెచ్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆర్18, ఆర్21 విద్యార్థులకు 0.50 శాతం గ్రేస్ మార్కులు ఇచ్చి, ఆర్22 విద్యార్థులకు 0.15 శాతం మాత్రమే ఇవ్వడాన్ని సవాలు చేస్తూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారించారు. బిటెక్, బిఫార్మసీ, బిబిఎ, ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థులకు సమానంగా 0.50 శాతం గ్రేస్ మార్కులు ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి జెఎన్‌టియుహెచ్ నుంచి వివరణ కోరుతూ విచారణను వాయిదా వేశారు.



## కుల దురహంకారానికి పరాకాష్ట

బిఆర్ఎస్ బహిరంగ క్షమాపణ చెప్పాలి: డిహెచ్‌పిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కుల దురహంకారానికి పరాకాష్ట అని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం, ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఒక్క వ్యక్తిని అవమానించడం కాదని, యావత్ దళిత సమాజం ఆత్మగౌరవాన్ని కించపరిచే చర్యగా చూడాలని అన్నారు. ఈ ఘటనపై బిఆర్ఎస్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్ రాజ్‌బహదూర్ గౌర్ హాల్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. దళితులు నడిచిన ప్రదేశం అపవిత్రమైందనే భావనతో శుద్ధి చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఏసురత్నం అన్నారు. ఘటనకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా డిహెచ్‌పిఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని ప్రకటించారు.

కళ్లముందు నీళ్లు పారుతున్నా

## పంటలను కాపాడలేని పరిస్థితి

బిఆర్ఎస్ఎల్‌పి ఉపనాయకుడు హరీశ్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కళ్ల ముందు నీళ్లు పారుతున్నప్పటికీ పొలాలకు నీళ్లు ఇవ్వలేని పాలన కొనసాగుతోందని, రాష్ట్రంలో పంటలను కాపాడలేని పరిస్థితి నెలకొన్నదని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రైతులకు కావాల్సింది పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కాదని, పంపులకు పవర్, పొలాలకు సాగునీరు కావాలన్నారు. ఎల్‌నినో ప్రకృతి వైపరీత్యం ఉండొచ్చని, కానీ నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు అందించక పోవడం మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శాసనమండలిలో ప్రధానప్రతిపక్ష నేత మదుసుదనాచారి,మాజీ మంత్రులు వేములప్రశాంత్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులతో కలిసి హరీశ్‌రావు మాట్లాడుతూ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మొదటి పంప్ హౌజ్ ఎల్లూరు పంప్ హౌజ్‌లో కేవలం రెండు మోటార్లు నడుస్తున్నాయని, మిగతావి ఎందుకు బంద్ పెట్టారని ప్రశ్నించారు. రోజుకు 1600 క్యూసెక్కుల నీరు రావాల్సిన ఉండగా, కేవలం 700 క్యూసెక్కులే వస్తున్నాయని వివరించారు. బీమా ప్రాజెక్టులో మూడు మోటార్లు ఉంటే ఒకటి మాత్రమే నడుపుతున్నారని, బేసిన్‌తో సంబంధం లేని వెలిగొండ ద్వారా ఎపి సిఎం చంద్రబాబు నీళ్లను తీసుకుపోతుంటే, నికర జలాల కేటాయింపు ఉన్న బీమా ఎందుకు నడపరని ప్రశ్నించారు. సిఎం రేవంత్ నిర్లక్ష్యం వల్లనే తెలంగాణకు వరప్రదాయిని అయినా కృష్ణా నీళ్లు ఎపికి వరప్రదాయినిగా మారిందన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్నారని, మంత్రి పొంగులేటి నియోజకవర్గంలో రైతులు ధర్నాలు చేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. బొగ్గు సర్ ప్లస్ ఉంటే యాదాద్రి ప్లాంటుకు బొగ్గును ఎందుకు సరఫరా చేయడం లేదన్నారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.

# 22ఎ చర్చలో పాల్గొనకుండా పారిపోతున్నారు

విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ అంటే అబద్ధాల రాష్ట్ర సమితి అని, అసత్యాల పునాదిపై ఏర్పడ్డ పార్టీ అని, ఆ పార్టీకి ఎఐ నాయకుడు కెటిఆర్ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం విమర్శించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ మీడియాలో వచ్చిన వార్తలను కూడా ఎఐ వీడియోలు అని ప్రచారం చేస్తూ, నేరాన్ని ఒప్పుకోకనే ఒప్పుకొన్నారన్నారు. గడిచిన పదేళ్లలో కెటిఆర్, కెసిఆర్ భూ బాగోతం బట్టబయలు అవుతుందనే 22ఎ మీద చర్చల్లో పాల్గొనకుండా పారిపోతున్నారని విమర్శించారు. లాజిస్టిక్ పార్కుల పేరిట భూములు మింగారని, ఇదంతా దృష్టి మరల్చడానికే దళితులపై పడ్డారన్నారు. కెటిఆర్, కెసిఆర్ చేసిందంతా మోసాలు, కుట్రలు, భూ దోపిడీనేనని ధ్వజమెత్తారు. కెసిఆర్ నిండు నూరేళ్లు క్షేమంగా ఉండాలని వారి పార్టీ నేతల కంటే తామే ఎక్కువ కోరుకుంటున్నామని వీరేశం స్పష్టంచేశారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ దళితులను అవమానించిందన్నారు. బిఆర్ఎస్ నేతల ప్రవర్తనపై, కెసిఆర్ సభకు ఎందుకు రావడం లేదో గవర్నర్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్రజలే బిఆర్ఎస్ నేతలను శుద్ధి చేస్తారు : విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**
బిఆర్ఎస్ నేతలు బుద్ధి మార్చుకోకపోతే, ప్రజలే వారిని శుద్ధి చేస్తారని ఎంఎల్‌సి బల్మూరి వెంకట్ అన్నారు. దళితులు ధర్నా చేసిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయడం కాదు, ముందు మీ మెదడును శుద్ధి చేసుకోండని హితవు పలికారు. గురువారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అసెంబ్లీ దగ్గర బిఆర్ఎస్ నేతలు చేసిన రాక్షస చర్యను టీవీ చానళ్ల లైవ్‌లో యావత్ సమాజం చూసిందని, అవి ఎఐ కాంటెంట్ అనడానికి సిగ్గుండాలని తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సిన ప్రతిపక్ష సభ్యులు పబ్లిక్‌లో ఫైటింగ్‌లకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు.

**ఫ్యూచర్ సిటీపై కుట్రలకు తెర తీశారు : విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



అసెంబ్లీ నుంచి సస్పెండ్ అయిన కెటిఆర్ బృందం ఫ్యూచర్ సిటీ పూర్తి అయితే పుట్టగతులుండవనే అక్కడికెళ్లి కొత్త కుట్రలకు తెర తీశారని విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ వాళ్లు పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధిని అడ్డుకొంటే ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. ఎట్టిపరిస్థితుల్లో ఫ్యూచర్ సిటీని కట్టి తీరుతామని ఆది శ్రీనివాస్ స్పష్టంచేశారు.

**కెసిఆర్ కుట్రలు పన్నుతున్నారు : విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్**
ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా ఫాంహౌజ్‌లోనే ఒక దిష్టిబొమ్మలా ఉండి కుట్రలు పన్నుతున్నారని విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ విమర్శించారు. కెసిఆర్ వల్ల తెలంగాణకు మైల పట్టిందని, బిఆర్ఎస్ అంటేనే అంటరాని పార్టీ అని ధ్వజమెత్తారు. మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాల్సిన బిఆర్ఎస్ సభ్యులు కావాలనే రచ్చ చేసి సస్పెండ్ అయ్యారని విమర్శించారు.

**బిఆర్ఎస్ చిల్లర రాజకీయాలు : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**
అసెంబ్లీలో ముఖం లేక బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫ్యూచర్ సిటీకి వెళ్లి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ దళితులు అవమానపరిచేలా వారు అడుగుపెట్టిన ప్రాంతాన్ని శుద్ధి చేసిన బిఆర్ఎస్ వాళ్లు దళితుల ఓట్లను అడగారా? అంటూ ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీ, ఫార్మాసిటీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొండల్ రెడ్డికి ఫ్యూచర్ సిటీలో భూమి ఇస్తే తప్పేంటి అని మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రశ్నించారు.

**ప్రజా సమస్యలపై చర్చ జరగాలి : ఎమ్మెల్యే పాయల్ శంకర్**
ఫీజురీయింబర్స్‌మెంట్, 22ఎ, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బకాయిలపై, రైతు సమస్యలపై చర్చ జరగాలని పట్టుబడుతున్నా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ సభ తూతూమంత్రంగా జరిపితే సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. మిగిలిన రెండురోజులైనా ప్రజా సమస్యలపై చర్చ జరగాలని ఆయన కోరారు.

## యువ ఓటర్ల మందకొడి స్పందన ఆందోళనకరం : మహేష్‌కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర పరిశీలన (సర్ 2026) ప్రక్రియలో అర్హులైన పౌరుల పేర్లు తొలగిపోకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లో నూతన ఓటర్ల నమోదు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఎన్నికల అధికారులు జారీ చేస్తున్న నోటీసులకు ఓటర్ల స్పందన మందకొడిగా ఉండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు కొత్త ఓటర్లుగా నమోదు చేసుకోవడంలో వెనుకబడుతున్నారని, మరోవైపు సర్ పరిశీలనలో భాగంగా అధికారులు జారీ చేసిన నోటీసులకు సకాలంలో స్పందించకపోవడం వల్ల అర్హులైన వేలాది మంది పౌరులు ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించడం ప్రజాస్వామ్య బాధ్యతగా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాలు, పార్టీ శ్రేణులు భావించి యుద్ధ ప్రాతిపదికన క్షేత్రస్థాయిలో పనిచేయాలని మహేష్‌కుమార్ గౌడ్ సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడు వెంటనే ఫారం–6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, సర్ నోటీసులు అందుకున్న వారు అవసరమైన ఆధారాలతో సకాలంలో స్పందించి తమ ఓటును పరిరక్షించుకోవాలని కోరారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. కాంగ్రెస్ క్యాడర్, బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఎ) స్థానిక బూత్ లెవల్ అధికారులతో (బిఎల్ఒ) సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సర్ ప్రక్రియను పార్టీ కార్యక్రమంగా కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన బాధ్యతగా భావించి చురుకుగా పనిచేయాలని మహేష్‌కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

## వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు

సిఎస్ సంజయ్ జాజు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వానాకాలం 2026–27 (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.2026–27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు.2026–27 గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

**8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు :**
రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సిఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పిఎసిఎస్), ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్ద ఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సిఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీ.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యలు వద్దు.. ధైర్యంగా జీవించండి : డిజిపి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ఉచ్చులో చిక్కుకుని అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడవద్దని తెలంగాణ డిజిపి సి.వి. ఆనంద్ పోలీసు సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సమస్యలు ఎదురైతే వాటిని దాచిపెట్టకుండా కుటుంబ సభ్యులతో పంచుకోవాలని, సమస్య పరిష్కారం కోసం ఉన్నతాధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన పోలీసు సిబ్బంది, ప్రజలను ఉద్దేశించి ప్రత్యేక సందేశం విడుదల చేశారు. గత నాలుగు నెలల్లో తెలంగాణ పోలీసు శాఖకు చెందిన ఇద్దరు సిబ్బంది ఆత్మహత్యలకు పాల్పడటం తనను తీవ్రంగా కలచివేసిందని డిజిపి తెలిపారు. యువ, మధ్య వయస్కులైన కానిస్టేబుళ్లు ఇలాంటి ఘటనలకు పాల్పడటం మరింత బాధాకరమన్నారు. ఈ ఘటనలపై జరిపిన విచారణలో ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పులపాలవడమే ప్రధాన కారణంగా తేలిందని సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. సమస్యలను ఒంటరిగా ఎదుర్కొనే ప్రయత్నం చేయకుండా కుటుంబ సభ్యులు, సహచరులు, ఉన్నతాధికారుల సహాయం తీసుకోవాలని కోరారు. పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై పోలీసు శాఖ ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని డిజిపి తెలిపారు.



## గణేష్ నిమజ్జన సమయంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలి

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి గురువారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన సమయంలో ఏలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే స్పందించేలా అన్ని చెరువుల వద్ద శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అవసరమైన క్రేన్లు, వైద్య సదుపాయాలు, సహాయక బృందాలు, తగిన ట్రాఫిక్ సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శామీర్‌పేట పెద్ద చెరువు పరిసరాల్లో పేరుకపోయిన మట్టి పూడిక, ఇతర మలినాలను తొలగించి సమగ్ర పారిశుధ్య చర్యలు చేపట్టాలని, నిమజ్జన ప్రాంతాన్ని పరిశుభ్రంగా నిర్వహించాలని కమిషనర్ సూచించారు. నిమజ్జన ప్రాంతాలకు వెళ్లే అప్రోచ్ రోడ్లను సక్రమంగా ఏర్పాటు చేయాలని, తగిన లైటింగ్ ఉండాలన్నారు. భక్తులకు ఏలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వాహణ చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్, ఇఇ, ఎఇ, టౌన్ ప్లానింగ్, యుబిడి, రామ్‌కి, తదితర శాఖలు అధికారులు పాల్గొన్నారు.

## మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



**ప్రజాపక్షం /కూకట్‌పల్లి :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6,500 మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువా రం హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని వివేకానందనగర్‌లోని పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ నివాసంలో ఆయన ప్రారంభించి భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. మట్టి వినాయకులను పూజించడం ద్వారా చెరువులు, నీటి వనరులు కలుషితం కాకుండా చూడవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్‌ను ఆయన ప్రత్యేంగా అభినందించారు.పర్యావరణహితమైన మట్టి వినాయకులనే పూజించేలా ప్రోత్సహించడమే తమ ఫౌండేషన్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యుడు బసిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, సింగదాసరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బిట్స్ పిలానీ హైదరాబాద్ విద్యార్థుల ప్రతిభ

డిఫెన్స్-టెక్ స్టార్టప్, బీజన్ టెక్ ఆవిష్కరణలు

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** బిట్స్ పిలానీ జవహర్ నగర్ హైదరాబాద్ క్యాంపస్‌లో విద్యార్థుల ఇంజనీరింగ్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైన ఒక ఆలోచన, భారత సాయుధ బలగాల (భారత సైన్యం) కోసం ఆధునిక స్వయంప్రతిపత్తి (ఆటోనోమాస్) సాంకేతికతలను అభివృద్ధి చేసే స్టార్టప్‌గా రూపాంతరం చెందింది. బిట్స్ హైదరాబాద్‌లోని కోరస్ ల్యాబ్ వేదికగా అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు నమన్ కాస్లీవాల్, శివ్ పాటిల్ ప్రతిపాదనలతో బీజన్ టెక్ స్టార్టప్‌ను స్థాపించారు. సైనిక పరికరాలకు కృత్రిమ మేధస్సు, స్వయంప్రతిపత్తిని అందించడమే లక్ష్యంగా వీరు పనిచేస్తున్నారు.



**మొదటి విజయం :** ఇస్రో రోబోటిక్స్ ఛాలెంజ్‌లో నావిగేషన్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసి ఫైనల్స్‌కు చేరడం ద్వారా ఈ బృందం గుర్తింపు పొందింది. అనంతరం పొఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో ఆర్మీ డిజైన్ బ్యూరో కోసం డ్రోన్ స్వార్మ్ గ్రౌండ్ స్టేషన్‌ను విజయవంతంగా ప్రదర్శించింది. బీజన్ ఆటోనామస్ నావిగేషన్ మాడ్యూల్ జిపిఎస్ లేని లేదా జిపిఎస్ సిగ్నల్స్ జామ్ అయ్యే ప్రతికూల వాతావరణంలో కూడా డ్రోన్లు సురక్షితంగా ప్రయాణించేలా విజన్‌బేస్డ్ ఎడ్జ్‌కంప్యూటింగ్ మోడ్యూల్‌ను రూపకల్పన చేశారు. ఈ సాంకేతికతపై సైన్యానికి చెందిన 8 విభాగాలు లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందజేశాయి. ఆటోనామస్ ఆర్టిలరీ పొజిషనింగ్ సిస్టమ్ పాత రకం ఆర్టిలరీ (ఫిరంగు)పొజిషనింగ్‌ను కంప్యూటర్ విజన్, ఆటోమేటెడ్ మోటార్స్ సాయంతో వేగవంతంగా కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించేలా ఆధునీకరిస్తుంది.
మార్కెట్ ప్రగతి ఈ ఆర్టిలరీ సిస్టమ్ కోసం స్టార్టప్‌కు రూ.20 లక్షల విలువైన ఎంపీపీ ఆర్డర్ లభించింది. అలాగే పరిశోధన మరియు నిపుణుల మార్గదర్శకత్వం కోసం నిర్వహించిన క్యూరియాసిటీ 2025 పోటీలో విజేతగా నిలిచి రూ.25 లక్షల గ్రాంట్‌ను సొంతం చేసుకుంది.
**ఆర్మీతో భాగస్వామ్యం :** వీరి ప్రచండ్ స్వార్మ్ గ్రౌండ్ స్టేషన్ సాఫ్ట్‌వేర్ ప్రస్తుతం ఇండియన్ ఆర్మీ యొక్క సదరన్ కమాండ్‌లో సేవలు అందిస్తోంది.
నమన్ కాస్లీవాల్: బిట్స్ హైదరాబాద్ టెక్నికల్ సెక్రటరీ, ఐఐటి బొంబాయి రోబోవార్స్ రన్నరప్ రెండు పేటెంట్ల అధిపతి. శివ్ పాటిల్: క్యాంపస్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు, సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్చర్‌లో విశేష అనుభవం కలిగిన సాంకేతిక నిపుణుడు. భారతదేశ రక్షణరంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు రక్షణ దళాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ బిట్స్ విద్యార్థుల ప్రతిభ ఎంతో దోహదపడుతోంది.




## పట్టుదల, కృషితో పిహెచ్‌డి సాధించిన దీపా బానోత్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉస్మానియా యూనివర్శిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పరిశోధక విద్యార్థిని నాగారంకు చెందిన డాక్టర్ దీపా బానోత్ బిజినెస్ మేనేజ్‌మెంట్ పిహెచ్‌డి పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా, గృహిణిగా కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరిశోధనను విజయవంతంగా పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. పట్టుదల, కృషితో కుటుంబ బాధ్యతలు ఉన్న ఉన్నత లక్ష్యాలను సాధించినట్లు నిరూపించారు. తన విజయానికి సహకరించిన తన భర్త రవితేజ, కుటుంబ సభ్యులు, ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ విద్యా సాగర్‌రావు, అధ్యాపకులు, పరిశోధకులు,బానోత్‌ను అభినందించారు.

# విధ్వంసానికి కుట్ర పన్నితే ఊరుకోం

డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటంలో సిపిఐ భాగస్వామ్యం

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వెల్లడి



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ :** భవిష్యత్తులో మనిషి మనుగడకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టే డంపింగ్ యార్డులకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో సిపిఐ భాగస్వామ్యం అవుతుందని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. దళిత, గిరిజన ప్రాంతాలను లక్ష్యంగా ఫార్మా కంపెనీలు, డంపింగ్ యార్డులు పెట్టి, అక్కడి విధ్వంసం చేసేందుకు కుట్ర పన్నితే చూస్తూ ఊరుకోబోమన్నారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ సమాఖ్య, సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జెఎసి ఆధ్వర్యంలో ''సిద్ధాపూర్ డంపింగ్ యార్డు జిఒ 645 రద్దయ్యే వరకు పోరాడాలి'' అనే అంశంపై ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పచ్చని మైదానాలు పనికిరాకుండా చేసే కుట్రపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలన్నారు. ఆధునీకరణ పేరిట ఫార్మా కంపెనీలు, డంపింగ్‌యార్డులు తెచ్చి జల, గాలి కాలుష్యం చేస్తే భవిష్యత్తులో ప్రమాద ఘంటికలు మోగుతాయని హెచ్చరించారు. ప్రజా పోరాటాలతో దేన్నైనా సాధించుకోవచ్చన్నారు. గతంలో రామన్నపేటలో రాంకీ వాళ్లు డంపింగ్‌యార్డు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంటే ప్రజలు తిరగబడ్డారని గుర్తుచేశారు.

ఫార్మా కంపెనీలు, డంపింగ్ యార్డుల వ్యతిరేక పోరాటానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. జెఎసి అధ్యక్షులు రాంబాల్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ సమాఖ్య అధ్యక్షులు కర్ణాకర్, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా నేతలు సిపిఐ షాద్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ పర్వతాలు, పల్లె రవికుమార్, సంధ్య( పిఒడబ్ల్యూ), సయ్యద్ రఫీ, జ్యోతి (చైతన్య మహిళా సంఘం), శ్రీనివాస్ (బిఎస్‌పి), రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ ఫామ్‌హౌస్ శుద్ధిపై భగ్గుమన్న కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మాజీ సిఎం కేసిఆర్ గడిలో దళిత సోదరులు డప్పుల దరువుతో నిరసనలు చేపడితే పాలతో, పసుపు నీళ్లతో శుద్ధి చేస్తారా..? దళితులంటే మీకు లెక్కలేదా..? దళితులు తలుచుకుంటే మీకు రాజకీయ పుట్ట గతులు ఉండవని రాబోయే ఎన్నికల్లో దళితులంతా ఏకమై బిఆర్ఎస్ పార్టీని ఓటుతో బొందపెడతారని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, బాల్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఉదండపురం సత్యనారాయణలు అన్నారు. గురువారం శామీర్‌పేటలోని ఎన్‌పిజి వెంచర్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ఆదేశాల మేరకు విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్‌రెడ్డిలు చేసిన అసభ్య అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. రెండు రోజుల క్రితం కేసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు డప్పులతో దండోరా వేస్తు నిరసనలు చేపడితే దళితులు నడిచిన నేలను పాలతో, పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దొరఅహంకారానికి నిలువెత్తు నిదర్శనమని ద్వజమెత్తారు. దొరల అహంకారాలను ఆదిపత్య పోరును ఇకనైనా విడిచిపెట్టాలని కేసిఆర్‌కు నాయకులు సూచించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై దాడికి ఫామ్‌హౌస్ నుంచే పన్నాగం పన్నారని, అసెంబ్లీ ముందు గంగుల కమలాకర్‌కు మహిళా ఎమ్మెల్యేలను తోసేయాలని కేటిఆర్ సైగలు చేశారని ఆరోపించారు. మీ నాయకులకు నేర్పిస్తుంది ఈ సంస్కారామేనా కేసిఆర్ అని ప్రశ్నించారు. తాత మధు, నవీన్‌రెడ్డిలను వెంటనే అరెస్ట్ చేయాలని వారిని శాసన మండలి నుంచి పూర్తిగా భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు దళిత సమాజాం ఓటు రూపంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. మీ ప్రభుత్వ హాయాంలో దళిత ఎమ్మెల్యేలను, ఉప ముఖ్యమంత్రులను చీడ పురుగులుగా చూశారని, మా సిఎం రేవంత్‌రెడ్డి దళితులకు పెద్దపీట వేస్తు పదవులు ఇస్తుంటే ఓర్వలేక కాంగ్రెస్ పార్టీపై బురద జల్లుతున్నారని ఆక్రోపించారు.

దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే రాజకీయాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు హరిబాబు, బీపిటి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు

ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/దుండిగల్ :** బౌరంపేట్ దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని మల్కాజ్గిరి ఎంపి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దుండిగల్ గండి మైసమ్మ మండలంలోని బౌరంపేటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక దళితులు సర్వే నెంబర్ 472 ఎర్రమన్ను బొందల స్థలాన్ని సందర్శించారు. అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన బౌరంపేట దళితులను ఉద్దేశించి ప్రసంగించారు. బౌరంపేట్ మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా వ్యవసా యమే జీవనాధారంగా చేసుకొని జీవించిన దళితులకు ప్రభుత్వం ఏ పరిహారం ఇవ్వకుండానే అసైన్మెంట్ స్థలాలను వాపస్ తీసుకోవ దం ధర్మం కాదని అన్నారు. దుండిగల్‌లో అసైన్మెంట్ స్థలాలను ప్రభుత్వం తీసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఎకరాకు 700 గజాల స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రభుత్వం ఇవ్వడానికి ఒప్పుకుందని అన్నారు. అలాగే బౌరంపేట్‌లో సర్వే నెంబర్ 472లో కూడా ఇదే విధానాన్ని పాటించి ప్రతి ఎకరా నుండి అసైనీ దారులకు 1000 గజాల స్థలాన్ని అన్ని హక్కులతో అసైన్‌మెంట్ దారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బౌరంపేట దళితులకు ప్రభుత్వం నుండి పరిహారంగా భూమి పొందే వరకు ఎవరు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి ప్రసంగించారు. మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపవద్దని న్యాయంగా వారికి అందాల్సిన నష్టపరిహారం ఇప్పించేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన బౌరంపేట మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ మాట్లాడుతూ ఇంతవరకు సర్వేనెంబర్ 472లో వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొచ్చిన వారు నేడు ప్రభుత్వం వ్యవసాయం చేయకుండా ఆపడంతో ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఊరికి ఒక్కో న్యాయం చేయవద్దని, దుండిగల్ అసైనీదారులకు ఏ మాదిరిగా పరిహారం ఇస్తున్నారో అదే మాదిరిగా ప్రతి ఎకరాకు ఒక వెయ్యి గజాలు స్థలాన్ని దళితులకు కూడా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశా రు. సమావేశంలో బిజెపి దుండిగల్ సర్కిల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు నల్ల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపిటిసి జంగారెడ్డి లు ప్రసంగించారు. కార్యక్రమంలో బౌరంపేట్ సర్వే నెంబర్ 166కు చెందిన అసైనీ దారులు కూడా హాజరై తమకు కూడా ఎలాంటి పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని ఈటల రాజేందర్‌కు ఫిర్యాదు చేశారు.

## శవయాత్ర నిర్వహించిన వారిపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మల్లాపూర్ డివిజన్‌లో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ శవయాత్ర నిర్వహించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేసారు. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు తీగుల్ల శ్రీనివాసగౌడ్, వాసుదేవ్ గౌడ్, కుంటి కృష్ణ, రాపోలు సతీష్, శ్రీనివాస్, శ్రవణ్, తదితరులు గురువారం నాచారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ధనుంజయ్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు అందచేసారు. రాజకీయ విభేదాల పేరిట వ్యక్తిగత అవమానాలు చేసేలా నీచపూరిత చర్యలు తగవన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలపాలన్నారు. తెలంగాణా ఉద్యమ సారధిగా, పదేళ్ల పాటు తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలించిన కెసిఆర్ పట్ల నీచపూరిత పనులను మానుకోవాలన్నారు.

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా రాకేష్ ముదిరాజ్

**ప్రజాపక్షం/దుండిగల్ :** విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న రాకేష్ ముదిరాజ్‌ను ఎన్ఎస్‌యుఐ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా రాకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు వినోద్ భయ్యా, తెలంగాణ ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి అన్న కి, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ అక్బర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన రాజ్యసభ ఎంపి అనిల్ కుమార్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో ఎన్ఎస్‌యుఐ మరింత బలోపేతం చేస్తానని రాకేష్ ముదిరాజ్ తెలిపారు.

## చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో, ప్రశాంత వాతారణంలో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా, అదన పు కలెక్టర్ వెంకటాచారీ, అడిషనల్ ఎస్పి రాజేష్ మినలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 14న వినాయకచవితి పండుగ సందర్భంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, వినాయక నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన రూట్ మ్యాపులు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. \వినాయకచవితి నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఫస్ట్ ఎయిడ్ కిట్లను, మెడికల్ ఆఫీసర్ సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం రోజు ఎట్టి పరిస్థితుల్లో డిజెకు పర్మిషన్ లేదని, ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని అన్నా రు. ఉత్సవ కమిటీ, పోలీస్ వారితో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. గణేష్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధంగా ఉత్సవ కమిటీ సభ్యులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనిం గ్ కలెక్టర్ బస్వ రాజ్, డిఆర్ఒ స్వర్ణలత, వికారాబాద్, తాండూర్, కొడంగల్ ఉత్సవకమిటీ సభ్యులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జీనోమ్‌వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గురువయ్యా గౌడ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఈ నెల 12 న మేడ్చల్ కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తారని ఈ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గోపగాని గురువయ్య గౌడ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల సమ్మతితో వివిధ రకాల పెండింగ్ కేసులు, రాజీ పడదగిన కేసులను సులభంగా, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. కోర్టుల చుట్టు తిరగకుండా సమయం, ఖర్చు ఆదా చేసుకుంటు కేసులను పరిష్కరించేందుకు ఇది మంచి అవకాశమని చెప్పారు.

రాజీ పడదగిన కేసులో ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో ముందుకు వచ్చి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఇన్స్‌పెక్టర్ గోపగాని గురువయ్య గౌడ్ కక్షిదారులను కోరారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** తొలి భూపోరాట నాయకురాలు, తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని జగద్గిరిగుట్ట సర్కిల్ చౌరస్తా వద్ద సిపిఐ ఆధ్వర్యంలో గురువారం ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె సేవలను స్మరించుకున్నా రు. భూమి కోసం, పేదలు, రైతుల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు. నాటి సామాజిక పరిస్థితుల్లో అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన ఐలమ్మను నేటి తరాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, పార్టీ జిల్లా కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు హాజరయ్యారు. మండల సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, గుట్ట పార్టీ శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, సోమయ్య, కృష్ణ, ఇమాంబై, వెంకటేష్ తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.
**జవహర్ నగర్‌లో :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ ధోబిఘాట్ లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాప్రా మండల సిపిఐ కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ దశరథ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఐలమ్మ చిన్నతనం నుంచే అన్యాయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నారని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు గ్రామాలు, వీధుల్లో పోరాట వీరుల స్మారక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 17న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, రైతు సంఘం నాయకుడు పి.నరసింహ, మహిళా నాయకులు అనసూయ, డి.మల్లిక, ఆదర్శనగర్ సిపిఐ కార్యదర్శి కిరణ్, చిట్యాల బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.






## పాలిటెక్నిక్ విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు..స్వల్ప ఉద్రిక్తత

* స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యారంగ విలీనం తగదు
* 20 రోజులుగా కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు

**ప్రజాపక్షం/ఉప్పల్:** స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యారంగాన్ని విలీనం చేసే ప్రక్రియను ప్రభుత్వం విరమించుకోవాలన్న డిమాండ్‌తో విద్యార్థులు గత 21 రోజులుగా కొనసాగుతున్న ఆందోళనలు గురువారం స్వల్ప ఉద్రిక్తంగా మారాయి. ఆందోళనలు కొనసాగిస్తున్న కళాశాల వద్దకు ఇద్దరు డిసిపిల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో చేరుకొన్న పోలీసు బలగాలు విద్యార్థులను అడ్డుకొన్న క్రమంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తరగతులు బహిష్కరించి కళాశాల బయట నిరసన తెలిపేందుకు వచ్చిన విద్యార్థులను పోలీసులు తాళ్లతో అడ్డుకొన్నారు. తాము శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే ఎందుకు అడ్డుకొంటున్నారంటూ విద్యార్థినీ విద్యార్థులు పోలీసులను నిలదీసారు. తరగతులను ఈ డిమాండ్‌తో రామంతాపూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు 21వ రోజుకు చేరుకొంది. ప్రభుత్వం జిఒ97తో స్కిల్ యూనివర్సిటీలో విలీనంచేసి తమ విద్యావిధానానికి తూట్లు పొడిచే యత్నాలకు పాల్పడుతున్నారన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్ పరిష్కారమయ్యే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని విద్యార్థులు తెలిపారు. దీంతోపాటు పాలిటెక్నిక్ కళాశాలల ప్రభుత్వ స్థలాలను ప్రయివేట్‌పరం చేసే కుట్ర దీని వెనుక ఉన్నట్లు తెలుస్తోందని, ఇప్పటికైనా తమ ఆందోళనలను విరమించేలా ప్రభుత్వ నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్, మల్కాజిగిరి డిసిపి శ్రీధర్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఎసిపి వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో పోలీసులు కళాశాల వద్ద మోహరించారు.

## గణేష్ ఉత్సవాల్లో డిజెలకు అనుమతి లేదు

నవాబుపేట్ ఎస్సై గిరి

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** నవాబుపేట్ మండలంలోని అన్ని గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీలు ఈ ఏడాది ఉత్సవాల్లో డిజెలు ఏర్పాటు చేయరాదని నవాబుపేట్ ఎస్సై గిరి సూచించారు. డిజెలకు ఎలాంటి అనుమతులు లేవని, ఇప్పటికే ఎవరైనా డిజె బుక్ చేసుకున్నట్లయితే ముందుగానే రద్దు చేసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా డిజెలు ఏర్పాటుచేస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు డిజెను సీజ్ చేస్తామని ఎస్సై గిరి హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు కమిటీలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## అంతారం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

స్కూటీని ఢీ కొట్టిన డిసిఎం * ఒకరు మృతి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మండల పరిధి అంతారం సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు స్కూటీపై వస్తుండగా ఎదురుగా వస్తున్న డిసిఎం స్కూటీని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు అక్కడిక్కడే మృతి చెందగా మరో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయయ్యాని పోలీసులు తెలిపారు. ఈ ఘటన గురువారం తాండూరు మండల పరిధి అంతారం సమీపంలో బైపాస్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు తాండూరు పట్టణ పరిధి ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన వడ్డే శేఖర్(6వతరగతి), గోవర్ధన్ (9వతరగతి)లు పెద్దేముల్ మండల పరిధి గోట్లపల్లి సమీపంలో మాడల్ స్కూల్‌లో చదువుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన సాత్విక్(15)తాండూరు పట్టణంలోని నంబర్ వన్ స్కూల్‌లో పదవ తరగతి చదవుతున్నారు. అయితే గురువారం సాయంత్రం సాత్విక్ స్కూటీపై గొట్లపల్లి సమీపంలో మోడల్ స్కూల్‌కు వెళ్ళి తమ స్నేహితులైన వడ్డే శేఖర్, గోవర్ధన్‌లను స్కూటిపై ఇంటికి తీసుకువస్తున్నారు. వారు అంతారం బైపాస్ రోడ్డు సమీపం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న డిసిఎం స్కూటీని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో సాత్విక్ (15)అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయని తెలిపారు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి క్షగాత్రులను చికిత్స నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాల పాలైన ఇద్దరు విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు తరలించారు. సాత్వికి మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విజయ్ దేవరకొండ రష్మిక కలిసి నటించిన 'రణబాలి' సినిమా టీజర్ వచ్చేసింది. ఈ టీజర్ విజయ్ దేవరకొండ నట విశ్వరూపాన్ని చూపిస్తూ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. రాక్షస రాజుగా పేరున్న సర్ థియోడర్ హెక్టార్ ఆజ్ఞపై పండిన ప్రతి ధాన్యపుగింజను దోపిడీ చేస్తూ అన్నపూర్ణగా వెలిగిన మన సీమగా ర్చేస్తుంటారు బ్రిటీష్ అధికారులు.

# రీల్



## వైవిధ్యమైన కథతో 'ఐ బొమ్మ'

బానోత్ పవన్, గౌతమ్, నర్మద, సతీష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'ఐ బొమ్మ'. ఈ చిత్రాన్ని శ్రీ మల్లన్న క్రియేషన్స్ బ్యానర్ పై కురువ జమన్న నిర్మిస్తున్నారు. విజయ్ రఘునాథభట్ల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా త్వరలో వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. హైదరాబాద్‌లో 'ఐ బొమ్మ' సినిమా ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రామసత్యనారాయణ మాట్లాడుతూ 'ఐ బొమ్మ' సినిమా ట్రైలర్ బాగుంది. చిన్న చిత్రాల నిర్మాతలకు క్యూబ్ యూఎఫ్ వో ఛార్జీలు భారంగా మారుతున్నాయి. నిర్మాతల మండలికి కొత్తగా ఎన్నికైన మా కార్యవర్గం తరుపున ఈ సమస్యకు పరిష్కారం చేయాలని అనుకుంటున్నాం అన్నారు.అతిథిగా వచ్చిన ప్రొడ్యూసర్ రాజా మాట్లాడుతూ నేను వర్జిన్ బాయ్స్ సినిమా నిర్మించిన తర్వాత డైరెక్టర్ విజయ్ నా దగ్గరకు వచ్చి కలిశాడు. రెండు మూడు స్క్రిపట్స్ కూడా చెప్పాడు. మంచి టాలెంట్ ఉన్న యువ దర్శకుడు విజయ్ అన్నారు. మూవీ ప్రొడ్యూసర్ కురువ జమన్న మాట్లాడుతూ మా వృత్తి వ్యవసాయం. సినిమాల మీద ఇష్టంతో చిత్ర నిర్మాణంలోకి వచ్చాను. దర్శకుడు విజయ్ చెప్పిన కథ బాగా నచ్చింది. . ఓవర్ ది నైట్ స్క్రిప్ట్ కంప్లీట్ చేసి 15 రోజుల్లో షూటింగ్ కంప్లీట్ చేశాం. అన్నారు. నటుడు బానోతు పవన్ , డివోపీ ఆనంద్ మరుకుర్తి, మ్యూజిక్ హనుమ ప్రసాద్ యాళ్ల ప్రొడ్యూసర్ కురువ జమన్న స్క్రిప్ట్, డైరెక్షన్ విజయ్ రఘునాథభట్ల.

# 'రణబాలి' టీజర్ విడుదల



విజయ్ దేవరకొండ రష్మిక కలిసి నటించిన 'రణబాలి' సినిమా టీజర్ వచ్చేసింది. ఈ టీజర్ విజయ్ దేవరకొండ నట విశ్వరూపాన్ని చూపిస్తూ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. రాక్షస రాజుగా పేరున్న సర్ థియోడర్ హెక్టార్ ఆజ్ఞపై పండిన ప్రతి ధాన్యపు గింజను దోపిడీ చేస్తూ అన్నపూర్ణగా వెలిగిన మన నేలను కరువు సీమగా మార్చేస్తుంటారు బ్రిటీష్ అధికారులు. ఆకలి అని అడిగిన వారిని క్రూరంగా చంపేస్తుంటారు. ఈ రాక్షస రాజు సర్ థియోడర్ హెక్టర్ కు, అతని అధికారులను తన ధైర్య సాహసాలతో అంతే క్రూరంగా ఎదుర్కొంటాడు రణబాలి. గుండె ధైర్యం నిండిన అతని దాటికి, పదునెక్కిన అతని కత్తి వేటుకి బ్రిటీష్ అధికారులు, పోలీసులు చెల్లాచెదురు అవుతారు. ఒక్క ధాన్యపు గింజ పొలిమేర దాటకుండా కాపలా కాస్తూ తన ప్రజల ఆకలి తీర్చుతాడు రణబాలి. అతని పేరేంటని ఆరా తీసిన బ్రిటీష్ అధికారులకు 'శింగనమల బొబ్బిలి రణబాలిరా..నీ యక్కా' అంటూ పౌరుషంగా సమాధానం ఇస్తాడు. ఆ కొండపైనున్న మా భద్ర మల్లాడి మీద ఆన..నేను కాయలి కాసొండంగా, ఒక్క మెతుకు గూడ పొలిమేర దాడదు చెప్తన్నా..అంటూ రణబాలి పాత్రలో విజయ్ చెప్పిన డైలాగ్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. రణబాలి ఒక గుహ ముందు మట్టి కుండలో పెట్టిన ద్రావణాన్ని ఒక చేయి వచ్చి అందుకుంటున్నట్లు టీజర్ చివరి షాట్ లో చూపించడం క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. రణబాలి' చిత్రంతో దర్శకుడు రాహుల్ సంకృత్యన్ ప్రేక్షకులకు మరపురాని సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నట్లు ఈ టీజర్ తో తెలుస్తోంది. టి సిరీస్, మైత్రీ మూవీ మేకర్స్ వరల్ క్లాస్ ప్రొడక్షన్ క్వాలిటీస్ టీజర్ లో ఆకట్టుకుంటున్నాయి. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా 'రణబాలి' సినిమా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది



## 'కాకా ధూమ్ ధమాకా' సాంగ్ ప్రోమో

నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'క్రేజీ కల్యాణం''. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 2గా ప్యాషనేట్ ప్రొడ్యూసర్ బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు.ఈ సినిమా నుంచి 'కాకా ధూమ్ ధమాకా' సాంగ్ ప్రోమో రిలీజ్ చేశారు. పెళ్లి భారత్ లో చేసే సూపర్బ్ మాస్ స్టెప్పులతో ఈ సాంగ్ ఉండబోతున్నట్లు ప్రోమోతో తెలుస్తోంది. సురేష్ బొబ్బిలి ఎనర్జిటిక్ కంపోజిషన్ లో కాసర్ల శ్యామ్ లిరిక్స్ తో ఈ పాట మ్యూజిక్ లవర్స్ ని ఆకట్టుకోనుంది. ఈ పాట ఫుల్ వెర్షన్ ని ఈ నెల 12వ తేదీన విడుదల చేయబోతున్నారు. నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి, తదితరులు నటిస్తున్నారు.




## 15 ఏళ్ల నా కల 'పంచనామా'.. ఉదయభాను

జీ5 మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్‌ను అందుబాటులోకి తీసుకురాబోతుంది. అదే 'పంచనామా' సిరీస్. ప్రముఖ నటుడు భరత్ శ్రీనివాసన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సెప్టెంబర్ 11 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కాబోతుంది. మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో 6 ఎపిసోడ్స్ ఉండనున్నాయి. హైదరాబాద్‌లో ప్రివ్యూ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత, షో రన్నర్ ఉదయభాను మాట్లాడుతూ నేను ఎమోషనల్ అవ్వకూడదని అనుకున్నాను. నిర్మాతగా మారాలనేది నా సాధారణ కల కాదు. దాదాపు 15 ఏళ్లుగా ఒక తపస్సు చేస్తున్నాను. టెలివిజన్లోనే పుట్టాను, ఉదయభాను కాస్తా హృదయభానుగా మారింది అక్కడే.. అందుకే టెలివిజన్ నుంచే నా ప్రొడక్షన్ మొదలుపెట్టాలని ఇన్నేళ్లుగా ఎన్ని ప్రయత్నాలు చేశానో, ఎంత మంచి కంటెంట్ మోసుకుంటూ ఎక్కడికెక్కడికో వెళ్లానో నాకే తెలుసు. వచ్చే వారం, వచ్చే నెల మొదలవుతుంది అనుకుంటూనే ఆగిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. చివరికి నా చిన్ననాటి స్నేహితుడు శ్రీరామ్ ద్వారా 'జీ' హెడ్ అనురాధ మేడమ్‌ను కలిశాను.ఆ తర్వాత వారి ఆలోచనలకు తగినట్లుగా ఈ ప్రాజెక్ట్ ఓకే అయింది. నా బిడ్డల కోసం నేను ఎలాగైతే తాపత్రయపడతానో.. ఈ ప్రాజెక్ట్ కోసం కూడా అంతే తాపత్రయపడ్డాను. ఇంత తక్కువ సమయంలో, ఇంత మంచి క్వాలిటీతో సిరీస్ పూర్తి చేయడానికి మా టీమ్లోని ప్రతి ఒక్కరూ 100 శాతానికి మించి శ్రమించారు. దర్శకుడు, రైటర్ నాగేంద్ర గారు, నేను కలిసి భరత్ గారికి కథ చెప్పగానే ఆయనకు నచ్చేసింది. లక్కీగా ఆయన డేట్లు దొరికాయి. 15 ఏళ్లుగా నా కడుపులో దాచుకున్న ఆవేదన, ఎమోషన్ ఇది.. అందుకే కాస్త ఎక్కువ సమయం తీసుకున్నాను. ఈ 'పంచనామా' సిరీస్ సెప్టెంబర్ 11న జీ5 లో విడుదలవుతోంది, ఇది కచ్చితంగా సూపర్ డూపర్ సక్సెస్ అవుతుందని నమ్ముతున్నాను.' అని అన్నారు. హీరో ప్రేమిస్తే భరత్ , నిర్మాత విజయేంద్ర మౌళి , డైరెక్టర్ మోహన్ శ్రీవాత్సవ , నటుడు సూర్య శ్రీనివాస్, నటి శ్రీజ , నటుడు శివ కార్తీక్ దండ ,రైటర్ నాగేంద్ర పిల్లా చీఫ్ కో డైరెక్టర్ బాలకృష్ణ కట్టా, కాస్ట్యూమ్ డిజైనర్ భావన పోలేపల్లి పాల్గొన్నారు.

## 'ధమ్ ధమ్' లిరికల్ వీడియో ఆవిష్కరణ



మాస్ పోయెట్రీతో మ్యూజికల్ లవ్ స్టోరీగా తెరకెక్కిన 'చకోర ' చిత్రంలోని సెకండ్ ఎనర్జటిక్ సాంగ్ 'ధమ్ ధమ్ ' లిరికల్ వీడియోను జీవి ప్రకాష్ కుమార్ ఆవిష్కరించారు. హై జాయ్ బ్యాన్స డా. చింతాడ హేమారావు నిర్మాతగా, విపి నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ వద్ద ఫస్ట్ అసిస్టెంట్ డైరెకర్‌గా పనిచేసిన మంగా శ్రీనివాస్ ఈ చిత్రంతో నూతన దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. శ్రవణ్, మలైకా టి. వాసుపల్ను సరి కొత్త ప్రేమ జంటగా పరిచయం చేస్తూ ఈ సినిమా తెరకెక్కింది. ఆణిముత్యాల్లాంటి పాటలతో రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రిన్స్ హెన్రీ సంగీతం అందిస్తున్నారు. రామజోగయ్య శాస్త్రి ఈ సాంగ్‌కు సాహిత్యం అందించారు. డాన్స్ మాస్టర్ మెహర్ బాబా కొరియోగ్రఫీ అందించారు. నూతన గాయని అభిఖ్య తనికెళ్ళ ఈ ఎనర్జటిక్ సాంగ్ ని పాడారు.. ఈ సాంగ్ యువతని ఊర్రూతలూగించేలా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఈ సందర్భంగా మ్యూజికల్ హీరో ప్రముఖ సంగీత దర్శకులు జీవి ప్రకాష్ కుమార్ ప్రశంసించారు. చకోర చిత్రం ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 8న థియేటర్లలో విడుదల కానుంది. శ్రవణ్, మలైకా టి వాసుపల్, అనుష్క లూహార్, యామిని, ఎల్ బి శ్రీరామ్, సుమన్, బ్రహ్మాజీ, ఇంద్రజ, మణి చందన, నెల్లూరు సుదర్శన్, ప్రభావతి, మాధవి ప్రసాద్, జనార్దన్, ఆకెళ్ళ గోపాల కృష్ణ, వంగపండు,వంశీ, సుమంత్, భాను, సూర్య మాకిరెడ్డి, తదితరులు నటిస్తున్నారు.



## 'రేంజ్ ఆఫ్ సిగ్మా' పాటకు సూపర్ రెస్పాన్స్

లైకా ప్రొడక్షన్స్ సుభాస్కరన్ నిర్మాణంలో రాబోతున్న మూవీ 'సిగ్మా . సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమా ద్వారా జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన తొలి రెండు పాటలు 'సిగ్మా స్టైల్', 'అయ్యయ్యో అమ్మాడి' సినిమాపై మరింత బజ్ క్రియేట్ చేశాయి. రెండు పాటలు విభిన్నమైన మూడ్స్‌తో ఆకట్టుకోవడంతో 'సిగ్మా'పై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ మరింత పెరిగింది. తాజాగా మేకర్స్ రేజ్ అఫ్ సిగ్మా పాటని రిలీజ్ చేశారు. తమన్ అందించిన పవర్ఫుల్ మ్యూజిక్, సీన్ రోనాల్ ఎనర్జిటిక్ వోకల్స్‌తో రేంజ్ ఆఫ్ సిగ్మా సాంగ్ ఆకట్టుకుంటోంది. విడుదలైన వెంటనే ఈ పాటకు సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, సంపత్ రాజ్, శివ పండిట్, అన్బు థాసన్, యోగ్ జపి తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి తమన్ ఎస్. సంగీతం అందిస్తున్నారు. కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, హరిహరసుధన్ వీఎఫ్ఎక్స్ సూపర్వైజర్గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది.

### సిఆర్ ఫౌండేషన్ విస్తృత సేవలకు

# స్వయం సమృద్ధి నమూనా




ప్రజాపక్షం/హైదరాబాద్ : సిపిఐ అగ్రనేత చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ మరింత విస్తృతంగా సేవలను అందించేందుకుగాను స్వయం సమృద్ధి నమూనాను రూపొందించుకుని ముందుకు కొనసాగాలని సిఆర్ ఫౌండేషన్ కార్యవర్గం నిర్ణయించింది. కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్ సర్వసభ్య సమావేశం చైర్మన్ డాక్టర్ కె. నారాయణ అధ్యక్షతన గురవారం జరిగింది. ఈ సందర్భంగా కె.నారాయణ ఫౌండేషన్ నిర్వహిస్తున్నకార్యకలాపాలు, విస్తరణ ప్రణాళికలను వివరించారు. కడప, గుంటూరు, గూడూరు ప్రాంతాలలో భవనాలు, భూములు విరాళంగా లభించాయని, అక్కడ వృద్ధాశ్రమాలు నిర్మించే ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు. ఇందులో కడపలోని వృద్ధాశ్రమం ఇప్పటికే ప్రారంభమై సేవలందిస్తోందని తెలిపారు. అమరావతిలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 3 ఎకరాల భూమిని కేటాయించడానికి అంగీకరించిందని, అయితే స్థలం ఖరారు కావాల్సి ఉందని డాక్టర్ నారాయణ వెల్లడించారు. తొలుత ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి 2024లో జరిగిన సర్వసభ్య సమావేశం నుంచి ఇప్పటి వరకు గత రెండేళ్లలో జరిగిన కార్యకలాపాలపై నివేదికను సమర్పించారు. వృద్ధాశ్రమం డైరెక్టర్ వి.చెన్నకేశవ రావు, సిఆర్ పాలీ క్లినిక్ డయాగ్నస్టిక్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని, ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ టి.సురేష్ బాబు, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జె.కల్పన ఫౌండేషన్‌లోని వివిధ కేంద్రాల నిర్వహణ నివేదికలను, ఆర్థిక వివరాలతో పాటు భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను సమర్పించారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి నూతన కార్యవర్గం ఎన్నికతో పాటు కార్యవర్గ విస్తరణను ప్రతిపాదించగా సమావేశం 25 మందితో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

**భవిష్యత్ ప్రణాళికలు:**

సిఆర్ పాలీ క్లినిక్ ద్వారా గామీణ ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరేలా టెలిమెడిసిన్ ద్వారా సేవలను విస్తరించాలని, పేదలు, అవసరమైన వారి కోసం డయాలసిస్ ఏర్పాటు చేయాలని ఫౌండేషన్ నిర్ణయించింది. ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్ ద్వారా పాఠశాల పిల్లల కోసం నెలవారీ కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్లను ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. మహిళా సంక్షేమ కేంద్రం (ఎంఎస్‌కె) ద్వారా శిక్షణ నుండి ఉత్పత్తి వైపు కార్యకలాపాలను విస్తరించాలని, కుట్టు, చీర రోలింగ్ సెంటర్‌ను ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఫౌండేషన్ కార్యవర్గం నిర్ణయించింది.

**రూ.25 లక్షల విరాళానికి సుముఖం**

వృద్ధాశ్రమంలో గత 22 ఏళ్లుగా ఉంటున్న సుబ్బలక్ష్మి తన మరణానంతరం సిఆర్ ఫౌండేషన్‌కు రూ.25 లక్షలు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన నిర్ధారణ లేఖను ఆమెతో పాటు ఆస్ట్రేలియాలో నివసిస్తున్న ఆమె కుమారుడు కంచి బొట్ల శేషాద్రి శర్మ ఆఫీస్ బేరర్లకు అందజేశారు.

### చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ కార్యవర్గం నిర్ణయం

### సిఆర్ ఫౌండేషన్ ఆఫీస్ బేరర్లు

సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ కె. నారాయణ, అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట రెడ్డి, ఉపాధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, డాక్టర్ కె.రజిని, పిడికిటి సంధ్య కుమారి, ప్రధాన కార్యదర్శిగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కార్యదర్శులుగా కంభంపాటి అజయ్ కుమార్, మహ్మద్ యూసుఫ్, ఎ.రామానాయుడు, కోశాధికారిగా వి.చెన్నకేశవరావు ఎన్నికయ్యారు.

### కార్యవర్గ సభ్యులు

ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులుగా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యేలు చాడ వెంకట రెడ్డి, కె.రామకృష్ణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, మాజీ ఎమ్మెల్సీ పి.జె. చంద్రశేఖర రావు, వివిధ రంగాల ప్రముఖులు కె.శ్రీనివాసరెడ్డి, అక్కినేని వనజ, డాక్టర్ టి.సురేష్, జోశ్యభట్ల కల్పన, చలసాని రాఘవేంద్ర రావు, డాక్టర్ పి.సంజీవమ్మ, జి. ఈశ్వరయ్య, డాక్టర్ బి.వి.విజయ లక్ష్మి , డి.జవహర్ బాబు ఎన్నికయ్యారు.

## సాయుధ పోరాటం వారోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మె ల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని ఇటి.నరసింహ తెలిపారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో లోటస్ పాండ్ లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో భారత దేశంలో హైదరాబాద్ రాష్ట్రం విలీన వార్షికోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం ఆడిటోరియంలో బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు ముఖ్య అతిథులుగా జస్టిస్ బి.చంద్రకుమార్, వక్తలుగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్.కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ప్రముఖ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ, సినీనటులు రవి ప్రసంగించనున్నారు.

**ఈనెల 13న కవి సమ్మేళనం**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈనెల 13న ఉదయం 10 గంటలకు రావి నారాయణ రెడ్డి ఆడిటోరియంలో కవిసమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'భావన' కవితా సంకలనం ఆవిష్కరణ, భారతదేశంలో ఇటీవలి పరిణామాలు అనే అంశంపై సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ ప్రసంగించనున్నారు. ఈ నెల15వ తేదీన మహిళా సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ రమా మేల్కొటే హాజరుకానున్నారు.

17న తెలంగాణ సాయుధ పోరాట శాశ్వత చిత్ర ప్రదర్శన ప్రారంభం

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ సాయుధ పోరాట శాశ్వత చిత్ర ప్రదర్శన ప్రారంభించనున్నారు. చిత్ర ప్రదర్శనను సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ప్రారంభించనున్నారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు చాడ వెంకట రెడ్డి అధ్యక్షతన జరగనున్న కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యేకూనంనేని సాంబశివరావు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు డాక్టర్ ప్రభాకర్, మాజీ ఎంపి బి.వినోద్ కుమార్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పాల్గొనున్నారని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ళ ప్రతాప రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## రక్షణ వ్యవస్థ అవసరం

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి మోహనతో కూడిన ధర్మాసనం, కేంద్రం, ఇతర సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది. భారత్‌లో కొన్ని రక్షణ చర్యలు అవసరమని విచారణ సందర్భంగా ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. 'జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అలయన్స్' అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది హెచ్ఎస్ ఫూల్కా వాదనలు వినిపించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల వయసు నిబంధనలు, భారత చట్టాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి కొన్ని వేదికలు 13 ఏళ్ల వయసు నుంచే ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పిస్తున్నాయని పిటిషనర్ పేర్కొన్నారు. భారత చట్టాల ప్రకారం 18 ఏళ్లలోపు వారంతా మైనర్లుగా పరిగణిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలు డిజిటల్ వేదికలపైకి ప్రవేశించినప్పుడు వారి వయసును సక్రమంగా నిర్ధారించడం, వారి వ్యక్తిగత సమాచారాన్ని రక్షించడం, ప్రమాదకర కంటెంట్ నుంచి వారిని కాపాడటం వంటి అంశాలపై స్పష్టమైన నియమాలు అవసరమని పిటిషన్ పేర్కొంది.

**సిఎస్ఎఎం కట్టడికి మరింత పటిష్ఠ చర్యలు**

చైల్ సెక్సువల్ ఎక్స్‌ప్లాయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్‌కు సంబంధించి దేశంలో కఠినమైన శిక్షా నిబంధనలు ఉన్నప్పటికీ, వాటిని సమర్థంగా అమలు చేయడంలో డిజిటల్ వేదికలు విఫలమవుతున్నాయని పిటిషన్‌లో ఆరోపించారు. పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర కంటెంట్‌ను గుర్తించి తొలగించేందుకు ఆటోమేటెడ్ కంటెంట్ ఫిల్టరింగ్ వ్యవస్థలను విస్తృతంగా వినియోగించాలని, అలాగే వినియోగదారుల వయసును నిర్ధారించే సమర్థమైన విధానం ఉండాలని కోరారు.

**తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి చేయాలని పిటిషన్**

18 ఏళ్లలోపు పిల్లలతో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోకుండా నిబంధనలు రూపొందించాలని పిటిషన్ కోరింది. మైనర్ డిజిటల్ సేవలను వినియోగించాల్సిన పరిస్థితి ఉంటే తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకుడి అనుమతి తప్పనిసరి చేయాలని సూచించింది. అలాంటి అనుమతి ఇచ్చే వ్యక్తి నిజంగా తల్లిదండ్రి లేదా చట్టబద్ధ సంరక్షకుడేనా అన్నది గుర్తింపు ధ్రువీకరణ లేదా ఇకెవైసి ద్వారా నిర్ధారించే విధానం ఉండాలని కోరింది. ఇందుకోసం 20 21లోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమాల్లో మార్పులు చేయాలని ప్రత్యేక మార్గదర్శకా లు రూపొందించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

**బాలల కిడ్నాప్ కేసుల దర్యాప్తుకు దేశవ్యాప్తంగా ఒకే విధానం**

అలాగే పిల్లల కిడ్నాప్, అపహరణ కేసుల దర్యాప్తుపై దాఖలైన మరో ప్రజాప్రయోజన వ్యాజ్యంపైనా సుప్రీంకోర్టు స్పందించింది. ఇలాంటి కేసుల దర్యాప్తు కోసం దేశవ్యాప్తంగా ఒకే విధమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో పాటు మంత్రిత్వ శాఖలకు నోటీసులు జారీ చేసింది. న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. అడ్వొకేట్ ఆన్ రికార్డ్ అశ్వని కుమార్ దూబే ద్వారా పిటిషన్ సమర్పించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది.

## చెడిపోతున్న యువత

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సుదీర్ఘ ప్రసంగం చేశారు. రాజకీయాల్లో రోజురోజుకూ దిగజారుతున్న నైతిక విలువలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభ స్పీకర్ స్థానం అత్యున్నతమైనదని, నాలుగు కోట్ల మంది ప్రజల ఆత్మగౌరవానికి అది ప్రతీక అని పేర్కొంటూ, స్పీకర్‌ను ఉద్దేశించి అసెంబ్లీలో అనుచిత వ్యా ఖ్యలు చేయడం తీవ్ర అభ్యంతరకరమని అ న్నారు. ఆధునిక యుగంలో ఉంటూ అటవీ యుగం వైపు వెళ్తున్నట్టు ప్రవర్తించడం సరికాదని, బూతులు మాట్లాడటమే గొప్పగా భా వించే దిగజారుడు సంస్కృతికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రజాప్రతినిధులైన వావిలాల గోపాలకృష్ణయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, నాగిరెడ్డి వంటి నాయకులు ప్రజా సమస్యలపై అవగాహనతో పోరాడారే తప్ప ఇటువంటి భాషను ఎప్పుడూ ఉపయోగించలేదని గుర్తుచేశారు. యాదగిరిగుట్ట దేవస్థానం పరిధిలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులు, ఆటో డ్రైవర్లకు కనీస వేతనాలు, న్యాయం జరిగే వరకు సీపీఐ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**యువత చైతన్యంతోనే సోషలిజం సాధ్యం: ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ**

దేశంలో తీవ్రమవుతున్న నిరుద్యోగాన్ని పక్కదారి పట్టించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతను భక్తి ముసుగులో మభ్యపెడుతున్నాయని ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఒకప్పుడు రాజకీయాలు, వేదికలు వయోవృద్ధులకే పరిమితమయ్యేవని, కానీ ప్రస్తుతం ఈ దేశ భవిష్యత్తు యువతరం చేతుల్లోనే ఉందనేది స్పష్టమైందని పేర్కొన్నారు. దేశాన్ని పురోగమనం వైపు తీసుకెళ్లే బాధ్యతాయుతమైన యువజన సంఘంగా ఏఐవైఎఫ్ నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని కోట్ల ఉద్యోగాలు కల్పించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కొత్త పరిశ్రమలు స్థాపించకపోగా, ఉన్న పరిశ్రమలు మూతపడటంతో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఆలోచన ప్రభుత్వాలకు లేదని, ప్రశ్నించే తత్వాన్ని మరియు చైతన్యాన్ని చంపేయడానికే యువతకు భక్తి ముసుగు తొడుగుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలోనూ నిరుద్యోగ భృతి హామీని విస్మరించారని, లక్షలాది మంది నిరుద్యోగులు ఉండగా కేవలం వందల సంఖ్యలోనే నోటిఫికేషన్లు ఇస్తూ మభ్యపెడుతున్నారని ఆరోపించారు. నిరుద్యోగ సైన్యం తిరగబడితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగక తప్పదని హెచ్చరించారు. దేశంలో కార్మికులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని, యువతకు ఉపాధి లేక నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సోషలిస్టు రాజ్యాన్ని స్థాపించడమే లక్ష్యంగా బలమైన పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవాలని ఏఐవైఎఫ్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మహాసభలకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ, గంగోత్రి, ఉమా, మమత, కునుకుంట్ల శంకర్, బిజ్జా శ్రీనివాసులు, తీర్పారీ వెంకటేశ్వర్లు, పేరబోయిన మహేందర్ లు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు ఈ మహాసభలో ముఖ్య అతిథులుగా ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షకార్యదర్శులు రోషన్ కుమార్ సిన్హా, సిగ్జెండర్ మహేసరి, ఏఐవైఎఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్ కుమార్, యుగంధర్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ టీ నరసింహ, సిపిఐ కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, కల వేణు శంకర్ సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి సహాయ కార్యదర్శులు బొలగానీ సత్యనారాయణ చెడే చంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మణికంఠ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, పేరబోయిన బంగారు, పేరబోయిన పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com